17-04-2024
బుధవారం
హైదరాబాద్

సంపుటి 26, సంచిక: 298
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8| మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00

Published from:
**Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' శ్రీరామనవమి శుభాకాంక్షలు

## సెలవు

శ్రీరామనవమి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి బుధవారం సెలవు. గురువారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

- మేనేజర్

# భారీ ఎన్‌కౌంటర్

## 29 మంది మావోయిస్టులు హతం

ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో ఎదురుకాల్పులు

ముగ్గురు భద్రతా సిబ్బందికి గాయాలు

ఘటనాస్థలి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం



గాయపడిన భద్రతా సిబ్బంది









**కాంకేర్/భద్రాచలం :** సార్వత్రిక ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురు కాల్పుల్లో 29 మంది మావోయిస్టులు హతమయ్యారు. కాంకేర్‌లోని చోటేబైథియా పోలీస్‌స్టేషన్ పరిధి బీనాగుండా, కరోనార్ అడవిలో జరిగిన ఎదురుకాల్పుల్లో బిఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు జవాన్లకు గాయాలు అయ్యాయి. ఘటనాస్థలంలో ఎకె 47, ఇన్సాస్, 303 రైఫిల్స్ సహా మొత్తం పదికిపైగా అధునాతన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందాలు మంగళవారం సంయుక్త సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని బస్తరం రేజ్ ఐజి సుందర్‌రాజ్ తెలిపారు. ఈ అడవిలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. మావోయిస్టుల ఎదురుకాల్పుల్లో గాయపడిన పోలీసులు, బిఎస్‌ఎఫ్ సిబ్బందిని ఆస్పత్రులకు తరలించేందుకు అదనపు బలగాలను అడవులకు పంపించామని వెల్లడించారు. చనిపోయిన మావోయిస్టుల్లో అగ్రనేతలు శంకర్‌రావు, లలిత, రాజు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఆయన తలపై రూ.25 లక్షల రివార్డు ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చనిపోయిన మావోయిస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. కాంకేర్ జిల్లాలోని కల్పర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 29 మంది సిపిఐ మావోయిస్టు కార్యకర్తల మృతదేహాలు స్వాధీనం చేసుకున్నామని బిఎస్‌ఎఫ్ ప్రకటించింది. కాగా, ఈనెల 19న దేశంలో పోలింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ఇలాంటి కీలక సమయంలో సోమవారం కాంకేర్ జిల్లాలోని ఛోటేబైథియా పోలీసు స్టేషన్ పరిధిలో ఓ గ్రామస్థుడిని మావోయిస్టులు హత్య చేశారు. ఈ తరుణంలో మావోయిస్టుల ఏరివేత కోసం మంగళవారం తెల్లవారుజాము నుంచి భద్రతా బలగాలు, పోలీసులతో కూడిన స్పెషల్ టీమ్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో భద్రతా బలగాలకు అడవుల్లో తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. వారిని ప్రతిఘటించేందుకు భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో 29 మంది మావోయిస్టులు చనిపోయారు.

'సివిల్స్'లో పాలమూరు బిడ్డ

# అనన్యరెడ్డికి మూడో ర్యాంకు

యుపిఎస్‌సి ఫలితాల్లో సత్తాచాటిన తెలంగాణ అమ్మాయి

మొదటి, రెండవ ర్యాంకులతో మెరిసిన ఆదిత్య శ్రీవాత్సవ, అనిమేష్ ప్రధాన్







**న్యూఢిల్లీ :** అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యుపిఎస్‌సి నిర్వహించిన సివిల్స్ 2023 తుది ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య రెడ్డి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకుతో మెరిశారు. ఆదిత్య శ్రీవాత్సవకు మొదటి ర్యాంకు, అనిమేష్ ప్రధాన్‌కు రెండో ర్యాంకు వచ్చింది. 2023 ఏడాదికి గాను 1016 మందిని యుపిఎస్‌సి ఎంపిక చేసింది. అందులో 664 మంది పురుషులు కాగా, 352 మంది మహిళలు ఉన్నారు. మొదటి ఐదు ర్యాంకులు సాధించిన వారిలో ముగ్గురు పురుషులు ఉండగా, ఇద్దరు మహిళా అభ్యర్థులు ఉన్నారు. పికె సిద్ధార్థ రామ్ కుమార్‌కు నాల్గొవ ర్యాంకు సాధించగా, రుహాని ఐదవ ర్యాంకు వచ్చింది. సృష్టి దబాస్ 6వ ర్యాంకు, అన్‌మోల్ రాఠోర్ 7, ఆశీష్ కుమార్ 8, నౌషీన్ 9, ఐశ్వర్యం ప్రజాపతి 10వ ర్యాంకుతో మెరిశారు. గతేడాది విడుదలైన సివిల్స్ 2022 ఫలితాల్లో తెలుగు అమ్మాయి ఉమాహారతి మూడో ర్యాంకుతో సత్తా చాటగా.. ఈసారి కూడా తెలంగాణకు చెందిన అనన్య రెడ్డి మూడో ర్యాంకు సాధించడం విశేషం. అయితే మొదటి 25 ర్యాంకులు సాధించిన వారిలో 10 మంది మహిళలు, 15 మంది పురుష అభ్యర్థులు ఉన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షను ఏడాదిలో మూడు దశల్లో పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 1105 ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. గతేడాది తరువాయి 2లో



బాసర ఆర్‌జియుకెటిలో

# విద్యార్థి ఆత్మహత్య

ప్రజాపక్షం/ బాసర

బాసర ఆర్‌జియుకెటిలో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పియుసి రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మంగళవారం హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి వెళ్లిన విద్యార్థి పరీక్షల నిమిత్తం ఈనెల 12న తిరిగి విశ్వవిద్యాలయానికి వచ్చాడు. హాజరుశాతం తరువాయి 2లో

గుంపు హింస అడ్డుకునేందుకు

# ఏం చర్యలు తీసుకున్నారు?

ఆరు వారాల్లో నివేదిక ఇవ్వండి

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు పిటిషన్‌పై రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ :** చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని 'గుంపు హింస' కు పాల్పడే ఘటనలు, గో సంరక్షణ పేరుతో సామూహిక దాడులకు పాల్పడే ఘటనలను తనిఖీ చేసేందుకు వివిధ రాష్ట్రాలు ఎలాంటి చర్యలు తీసుకున్నాయో తమకు నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్‌ఎఫ్ ఐడబ్ల్యు) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. గో సంరక్షణ పేరుతో జరగే హింసాకాండ, విలువల పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హింసాత్మక చర్యలతో తీర్పులు చెప్పాలనుకునే సామూహిక మూక దాడులను అరికట్టేందుకు వీలుగా నిరంతరం తనిఖీ ఉండాలని 2018లో సుప్రీంకోర్టు సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఈ తీర్పుకు అనుగుణంగా రాష్ట్రాలలో ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకునే విధంగా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మహిళాభ్యున్నతి, మహిళా హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం మంగళవారంనాడు ఉత్తర్వులు జారీ చేస్తూ ఆరువారాల్లో తమకు సమాధానం చెప్పాలని రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించారు. గోసంరక్షణ పేరుతో ముస్లిం మైనారిటీలపై హింసాత్మక దాడులు, హత్యలు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇతరులకు న్యాయం చేసే పేరుతో కొట్టి చంపడం వంటి ఘటనలు విపరీతంగా పెరిగిపోవడంతో ఈ సమస్య సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. వివిధ మైనారిటీ గ్రూపులు, హక్కుల సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అనంతరం ఆరేళ్ళక్రితం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సజావుగా, సక్రమంగా అమలు చేసేందుకు ఈ విధమైన దాడులపై తనిఖీ, నిఘా కొనసాగేలా తక్షణ చర్యలకు ఆదేశించాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు కోరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతోపాటు మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన పోలీస్ డైరెక్టర్ జనరల్స్‌కు కూడా సుప్రీంకోర్టు గత ఏడాదిలో నోటీసులు జారీ చేసింది. ఈ పైన పేర్కొన్నా రాష్ట్రాలలోనే చాలా ఎక్కువగా గుంపు హత్యలు, హింసాత్మక దాడులు తరువాయి 2లో



# బహిరంగ క్షమాపణ చెప్పండి

మీ విశ్వసనీయత రుజువు చేసుకోవాలి

రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణలకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ :** అల్లోపతీ వైద్యవిధాన ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నం చేసిన కేసులో యోగా గురు రామ్‌దేవ్ బాబా, అతడి సహాయకుడు బాలకృష్ణలకు సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరిక చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేశారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో సుప్రీంకోర్టు మంగళవారంనాడు విచారణ సందర్భంగా రామ్‌దేశ్ బాబా, బాలకృష్ణ వారంరోజుల్లోగా బహిరంగ క్షమాపణలు తెలియజేసేందుకు అనుమతి ఇచ్చింది. బహిరంగంగా పశ్చాత్తాపం చెందాలని పేర్కొంది. బహిరంగ క్షమాపణలు చెప్పినంతమాత్రాన అంతటితో బాధ్యత తీరిపోదని, అంతటితో వదిలిపెట్టేదిలేదనీ, వారంతట వారు ఏకపక్షంగా బాహాటంగా తమ విశ్వసనీయతను, ప్రామాణికతలను రుజువు చేసుకునేందుకు కొన్ని చర్యలు చేపట్టాలని జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసు విచారణను తదుపరి ఈనెల 23 వ తేదీకి వాయిదా వేసింది. కోర్టు ఉల్లంఘన చర్యలకు పాల్పడిన రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణలు భౌతికంగా ధర్మాసనం ఎదుట హాజరై బేషరతుగా క్షమాపణలు తెలియజేశారు. అదేవిధంగా వారిద్దరూ పశ్చాత్తాపం ప్రదర్శించి బహిరంగంగా క్షమాపణలు తెలియజేసేందుకు సిద్ధంగా ఉన్నారని కూడా యోగా గురు తరపు న్యాయవాది రోహత్గీ ధర్మాసనానికి తెలియజేశారు. దాంతో వారిద్దరూ బహిరంగ తరువాయి 2లో

# రెండో విడతలో 390 మంది కోటీశ్వరులు

కాంగ్రెస్ నేత వెంకటరమణ ప్రథమం

మూడోస్థానంలో హేమమాలిని

ఎడిఆర్ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల రెండోవిడత పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుంది. దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 89 స్థానాలకు ఓటింగ్ జరుగుతుంది. ఇందులో మొత్తం 1,210 మంది అభ్యర్థులు తమ అదష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో కొందరు సంపన్నులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. కర్నాటకలోని మండ్య స్థానంలో మాజీ సీఎం కుమారస్వామిపై తరువాయి 2లో

గల్ఫ్ వెళ్లే కార్మికులకు

# ప్రత్యేక బోర్డు

ఏర్పాటుకు అధ్యయనం చేస్తున్నాం : సిఎం రేవంత్‌రెడ్డి

గల్ఫ్ సమస్యలను సెప్టెంబర్ 17లోపు పరిష్కరిస్తామని హామీ





ప్రజాపక్షం/హైదరాబాద్

గల్ఫ్ సమస్యలను సెప్టెంబర్ 17లోపు పరిష్కరించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసే బాధ్యత తమదని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. గల్ఫ్,ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల కోసం ప్రత్యేకంగా ఒక బోర్డ్‌ను ఏర్పాటు చేసేందుకు అధ్యయనం చేస్తున్నామని, ఇందుకు ప్రజాభవన్ లో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతు బీమా తరహా గల్ఫ్ కార్మికులకు బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ డెక్కన్‌లో గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో సిఎం రేవంత్ రెడ్డి మంగళశారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ తరువాయి 2లో

# శోభాయమానంగా భద్రగిరి





నేడే సీతారాముల కల్యాణం

ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎస్

ప్రజాపక్షం/భద్రాచలం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న పుణ్యభద్రాద్రి శ్రీ సీతారాముల పెళ్లికి ముస్తాబైంది. లోక కళ్యాణార్థం మిథిలా స్టేడియంలో నవమి నాడు రామచంద్ర స్వామికి, సీతమ్మ తల్లి కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరగనుంది. మరుసటి రోజు రాజాధిరాజు రామయ్యకు మహాపట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి వీధులన్నీ పండుగ కళతో శోభాయమానంగా మారిపోయాయి. భక్త రామదాసు కాలం నుండి నేటి వరకు ఈ దివ్య క్షేత్రంలో సీతారాములు పెళ్లి వేడుక అభిజిత్ లగ్నంలో ఆరుబయట నిర్వహిస్తారు. అలనాటి గోల్కొండ నవాబు తానీషా ప్రభువు కల్యాణం సందర్భంగా సీతారాములకు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ నాటి నుండి నేటికీ ఆనవాయితీ ప్రకారం పాలక ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇక్కడ సీతారాముల కల్యాణానికి వినియోగించే తలంబ్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. ముస్లీం సాంప్రదాయ పద్ధతిలో పన్నీరు, అత్తరుతో పాటు ఇతర సుగంధ ద్రవ్యాలలో పసుపు,కుంకుమలు కలిపి తయారు చేస్తారు. వీటిని నవమి నాడు శీతారాముల శిరస్సులపై అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా రుత్వికులు పోస్తారు. అలనాడు రాముదాసు చేయించిన బంగారు ఆభరణాలే నేటికీ సీతారాములతో పాటు లక్ష్మణ స్వామికి ధరింపజేసి వేడుకను నిర్వహిస్తారు. ఇక్కడ విశేషం ఏమిటంటే సీతమ్మవారు ధరించే మంగళసూత్రంలో తరువాయి 2లో



# జీలం నదిలో పడవ బోల్తా

ఆరుగురు మృతి

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని జీలం నదిలో పడవ బోల్తా పడింది. శ్రీనగర్ సమీపంలోని గాందర్‌బల్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. గల్లంతయిన మరో ఆరుగురిని రక్షించి ఆసుపత్రిలో చేర్చినట్లు అధికారులు తెలిపారు. అందులో ముగ్గురు చికిత్స పొందుతుండగా, మరో ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారన్నారు. అయితే ప్రమాద సమయంలో 15 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచార. అందులో ఏడుగురు మైనర్లు ఉన్నట్లు శ్రీనగర్ తరువాయి 2లో

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కూడా ఉండేట్లులేదు

సిఎం బిజెపిలో కలిసే అవకాశం

రైతుకు బోనస్ ఇవ్వండి ... మేం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయం

సంగారెడ్డి సభలో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్ల కంటే ఎక్కువ రావని సర్వే రిపోర్టులు వస్తున్నాయని బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. తెలంగాణ సిఎం బిజెపిలో కలిసే అవకాశం ఉందని కెసిఆర్ అన్నారు. తెలంగాణకు బిఆర్‌ఎస్ అక్కరకు రాని చుట్టం అని బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ పేర్కొన్నారు. బిజెపికి ఓటు వేస్తే మంజీరా నదిలో పడేసినట్టే అని తెలిపారు. బిజెపి ఈ పదేండ్లలో తరువాయి 2లో

# ఇరాన్ అణుస్థావరాలపై దాడికి ఇజ్రాయిల్ సన్నద్ధం

సర్వత్రా ఉద్రిక్తత ః ప్రపంచ దేశాల విజ్ఞప్తులు



**టెల్‌అవీవ్ :** ఇరాన్‌ను గట్టి దెబ్బతీయాలని ఇజ్రాయిల్ నిర్ణయించింది. గడచిన మూడు రోజులుగా ఇజ్రాయిల్ వార్ కాబినెట్ ఎడతెగని సమావేశాలు నిర్వహిస్తోంది. ఇరాన్‌ను ఇంతకుఇంత దెబ్బతీసేస్తామని ఇజ్రాయిల్ వార్ కేబినెట్ ప్రతినిధి హెర్జీ హలేవి మంగళవారం ప్రకటించారు. ఇరాన్ క్షిపణి ప్రాజెక్టులపై ఆంక్షలు విధించాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేసింది. ఇరాన్‌కు గట్టి గుణపాఠం చెబుతామన్నారు. దీంతో అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా, యురోపియన్ యూనియన్ దేశాలు వెంటవెంటనే ప్రకటనలు విడుదల చేశాయి. సహనం పాటించాలని అంతర్జాతీయ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అమెరికా వైట్ హౌస్ అధికార ప్రతినిధి జాన్‌కిర్బీ ఒక ప్రకటన చేశారు. యూరోపియన్ యూనియన్ కూడా అదే పద్ధతిలో ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదిలాఉండగా అంతర్జాతీయ అణుశక్తిసంస్థ(ఐఏఇఏ) ఈ పరిణామాల పట్ల తీవ్రఆందోళన వ్యక్తంచేసింది. ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయిల్ దాడి చేసే ప్రమాదముందని ఐఏఇఏ డైరెక్టర్ జనరల్ రఫాయెల్ గ్రోస్సీ ఆందోళన వ్యక్తంచేశారు. దాడికి మూల్యం చెల్లించవలసిందే.గట్టి దెబ్బతీస్తాం అని ఇజ్రాయిల్ వార్ కేబినెట్ చెప్పడాన్ని ఆయన తప్పుపట్టారు. ఇరాన్ అణుస్థావరాల విషయంపై దీర్ఘకాలంగా అమెరికా, ఇరాన్ మధ్య వివాదముంది. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తుందని అమెరికా ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో ఈ దేశంపై ఆంక్షలు కూడా విధించింది. మరోవైపు ఐఏఇఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్‌గ్రోస్సీ (గ్రోస్సీ) కూడా సోమవారం ఒక ప్రకటన చేస్తూ ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ అణుస్థావరాలను సంక్షిప్తంగా మరోసారి తనిఖీలు చేస్తామని చెప్పారు. తమ బృందం ఈ పని పూర్తిచేస్తుందన్నారు. "మేము రోజూ అంటే మా ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వం మాకు ఏమి చెప్పిందంటే ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య మా అణుస్థావరాలు మూసివేశాం అని తెలియచేసింది. మా ఇన్‌స్పెక్టర్లుకూడా తనిఖీలలో చూశారు" అని గ్రోస్సీ చెప్పారు. ఈనెల 14న ఇరాన్ 300డ్రోన్లు, భారీ క్షిపణులు, బాలిస్టిక్ క్రూయిజ్‌క్షిపణులతో ఇజ్రాయిల్‌పై దాడిచేసింది. ఆదివారంనాడు భద్రతామండలి సమావేశం తరువాత గ్రోస్సీ ప్రత్యేకించి మాట్లాడుతూ ఇరాన్‌వద్ద భారీస్థాయిలో శుద్ధిచేసిన యురేనియం ఉందని, అయితే అంత మాత్రాన ఇరాన్‌వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని అర్థం కాదని అన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని, ఆయుధాల తయారీని చేపట్టిందన్న సూచనలు గానీ, అలాంటి సమాచారం గానీ తమ వద్ద లేదని చెప్పారు. అయితే గడచిన ఫిబ్రవరిలో ఐఏఇఏకు ఇరాన్ ఇచ్చిన త్రైమాసిక సమాచారం ప్రకారం 5,525.5 కిలోగ్రాములు(12,182 పౌండ్లు) శుద్ధిచేసిన యురేనియం నిల్వలు ఉన్నాయి. 2023 నవంబరు నాటికి కూడా అదే గణాంకాలు ఉన్నాయి. అయితే ఈ శుద్ధి చేసిన యురేనియంలో 60శాతం మేరకు స్వచ్ఛత ఉంది. ఒక అణుబాంబును తయారు చేయాలంటే యురేనియంలో స్వచ్ఛత 90శాతం మేరకు ఉండాలి. తమ అణుశక్తి కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాలకోసమేనని ప్రజల ఇంధన, విద్యుత్ అవసరాలు తీర్చటం కోసమేనని ఇరాన్ పదేపదే ప్రకటిస్తూ వస్తోంది. ఇదిలా ఉండగా మరోవైపు అమెరికా ఇరాన్‌ని అణచివేయటం కోసమే ఇజ్రాయిల్‌ను ఇంతదాకా తీసుకొచ్చిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పరిస్థితులు తీవ్రంగా ఉంటాయ్

రెడ్‌లైన్స్ అన్నీ దాటేస్తాం : ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్ :** ఒకవేళ ఇజ్రాయిల్ గనుక తమపై ప్రతీకార దాడులు చేస్తే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని ఇరాన్ మంగళవారంనాడు తాజా హెచ్చరిక చేసింది. ఈనెల 14న తమ దాడికి ప్రతిగా ఎదురుదాడికి దిగితే, "ఇరాన్ సైన్యం అన్ని రెడ్ లైన్స్ దాటేస్తుంది" అని ఇజ్రాయిల్‌కు హెచ్చరించింది. ఇరాన్ అణుకేంద్రాలపైనా, ఇతర కీలక స్థావరాలపైనా కూడా దాడులు చేసేందుకు ఇజ్రాయిల్ వార్ క్యాబినెట్ ప్లాన్ రచనలు చేస్తున్నది. తాము ప్రతిదాడి చేయడం పక్కా అని ఇప్పటికే వార్ క్యాబినెట్ స్పష్టం చేసింది. అణుకేంద్రాలు, గనులు, ఇరాన్ కీలక కమాండర్ల స్థావరాలపైన దాడులు చేసేందుకు ఇజ్రాయిల్ సన్నద్ధమవుతున్నది. అదేవిధంగా ఇరాన్ అనుకూల ఉగ్రవాదస్థావరాలపై కూడా దాడులు చేయాలని వార్ క్యాబినెట్ నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి.

ప్రపంచం

## అమెరికా నగరాలలో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు

స్తంభించిన ట్రాఫిక్

**చికాగో :** అమెరికాలో పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనలు సోమవారం నుండి ఉధృతరూపం దాల్చాయి. అమెరికాలోని ప్రధాన నగరాలలో నిరసన ప్రదర్శకులు వాహనాలతో సహా మార్గాలను స్థంభింపచేశారు. శ్రీఇల్లినాయిస్, కాలిఫోర్నియా, న్యూయార్క్, పసిఫిక్ నార్త్ వెస్ట్ ప్రాంతాలలో భారీ ఎత్తున పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు జరుగుతున్నాయి. దేశంలో చాలా ఎక్కువగా ఉపయోగించే విమానాశ్రయాలు, గోల్డెన్ గేట్, బ్రూక్లిన్ బ్రిడ్జితోపాటు ఎప్పుడూ చాలా బిజీగా ఉండే వెస్ట్‌కోస్ట్ హైవే ప్రాంతాలకు వెళ్లే మార్గాలలో పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రయాణీకులను అటు వైపు వెళ్లే మార్గాలను అనుమతించటంలేదు. చికాగోలో ఓహేర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వైపు వెళ్లే మార్గాలన్నీ ఉదయం 7గంటలకే మూసుకుపోయాయి. నిరసన ప్రదర్శకులు ఆ ప్రాంతాలను బ్లాక్ చేసి పాలస్తీనా అనుకూల నినాదాలు చేశారు. పాలస్తీనాపై ప్రపంచవ్యాప్తంగా విధించిన ఆర్థిక ఆంక్షలులో భాగంగానే తామిక్కడ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నామని ఆ నిర్వాహకులలో ఒకడైన రిఫ్కా ఫలానెహ్ చెప్పారు. కాగా శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో నిరసన ప్రదర్శన కారణంగా చాలా వాహనాలు అనేక గంటలు ఆగిపోయాయి. గోల్డెన్ గేట్ బ్రిడ్జివద్ద పాదచారులు , ద్విచక్రవాహనాలు స్తంభించిపోయాయి.మనహట్టంకు వెళ్లే వాహనాలన్నీ బ్రూక్లిన్ బ్రిడ్జిపై స్తంభించిపోయాయి. కాగా చికాగోలో గత ఏడా ది అక్టోబర్ 7న ఇజ్రాయిల్ ఘర్షణ మొదలైనప్పటినుండి ప్రతిరోజూ నిరసన ప్రదర్శనలు పాలస్తీనాకు అనుకూలంగా జరుగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండ గా ఓహేర్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ కార్లలో వెళ్లే ప్రయాణీకులు పైన పేర్కొన్న మార్గాలలో ప్రయాణించవద్దని హెచ్చరించింది. ఇప్పటికే కారులలోఇరుక్కుపోయినవారంతా ఎక్కడికక్కడ కార్లు వదిలిపెట్టి నడకదారిలో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓరెగాన్ రాష్ట్ర పోలీసులు ఒక ప్రకటన విడుదలచేస్తూ 52మంది పాలస్తీనా అనుకూల ప్రదర్శకులను అరెస్ట్ చేశామని చెప్పారు. యూజేన్, ఓరెగాన్ మధ్య 177 కి.మీ.ల మేర సౌత్ ఆఫ్ పోర్ట్‌లాండ్ వరకు వాహనాలకు ఇబ్బంది కలిగిందని తెలిపారు. న్యూ యార్క్ పోలీసులు కూడా 150మంది నిరసన ప్రదర్శకులను అరెస్ట్ చేశారు. కానీ ఆతరువాత మరింతమంది ప్రదర్శనలో పాల్గొన్నారు.

## పాకిస్థాన్ అభివృద్ధికి సౌదీ అరేబియా బాటలు

ఇక లోతైన అనుబంధం

సౌదీ విదేశాంగమంత్రి ప్రకటన



**ఇస్లామాబాద్ :** ఇప్పటివరకూ జరగకుండా ఆగిపోయిన ఆర్థికాభివృద్ధిద్వారా పాకిస్థాన్‌లో రాబోయేకాలంలో విశేషమైన, సార్థకతతో కూడిన ఆర్థిక ప్రయోజనాలు ఒనగూరుతాయని సౌదీ అరేబియా విదేశాంగమంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ అన్నారు. పాకిస్థాన్‌తో లోతైన ఆర్థిక సంబంధాల ద్వారా సరికొత్త అనుబంధానికి తెర తీస్తున్నామని ఆయన ప్రకటించారు. పాకిస్థాన్ అభివృద్ధికి పెట్టుబడులు సమకూర్చుతామని చెప్పారు. రెండు రోజులపాటు సౌదీ అరేబియా బృందం పాకిస్థాన్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసింది. దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీలతో ఆయన సమావేశవాలు జరిపారు. అనంతరం మంగళవారం అల్ సౌద్ పాకిస్థాన్ విదేశాంగమంత్రి ఇషాద్ దార్‌తో కలిసి ఇస్లామాబాద్‌లో సంయుక్త పత్రికాగోష్టిలో మాట్లాడారు. ఇటీవల పాకిస్థాన్ ప్రధానమంత్రి షరీఫ్ సౌదీ అరేబియాలో పర్యటించి ఆ దేశ రాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. కష్టాల్లో ఉన్న తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని, దేశాన్ని గట్టెక్కించాలని కోరారు. సౌదీ రాజు ఇచ్చిన హామీ మేరకు ఈ బృందం పాకిస్థాన్‌లో పర్యటించింది. ఈ ఒప్పందం ప్రకారం తొలి విడతగా పాకిస్థాన్‌కు ఐదు బిలియన్ డాలర్ల పెట్టుబడులు సమకూరతాయి. సౌదీ అరేబియా ఇచ్చిన వాగ్దానం ప్రకారం రాబోయే ఐదేళ్ళలో పాకిస్థాన్‌కు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సమకూరుతాయి. వ్యవసాయరంగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంధన రంగం, గనుల తవ్వకం, రక్షణ రంగాల్లో ఈ పెట్టుబడులు పెడతారు.

## బంగ్లాదేశ్‌లో రోడ్డుప్రమాదం : 14మందిమృతి

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 మంది మరణించారు. ఢాకా – ఖున్‌లా జాతీయ రహదారిపై ఒక బస్సు, మినీ రవాణా వాహనం ఢీకొన్నాయి. ఖుల్‌నా డివిజన్‌లోని మగురా నగరానికి బస్సు వెళుతుండగా ఢాకా వెళుతున్న బస్సు ఢీ కొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 11మంది ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. ఢాకా ట్రిబ్యూన్ పత్రిక ఈ విషయం వెల్లడించింది. ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మరో ఇద్దరు మరణించారు. మరొకరు చికిత్స పొందుతూ మరణించారు. ట్రక్కు డ్రైవరు, హెల్పర్ కూడా మరణించారు. మరణించిన వారిలో ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మరణించిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. మృతుల అంత్యక్రియలకు ప్రభుత్వం 20 వేల టాకాలు పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు 5 లక్షల టాకాలు, గాయపడినవారికి మూడు లక్షల టాకాలు పరిహారం ప్రకటించింది.

## చరిత్రాత్మక డెన్మార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనం దగ్ధం



**కొపెన్‌హాగన్ :** డెన్మార్క్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీ భవనం మంగళవారం అగ్నికి ఆహుతైంది. 17వ శతాబ్దంనాటి అత్యంత పురాతనమైన ఈ భవంతిపై ఉన్న చరిత్రాత్మకమైన గోపురం భీతావహమైన అగ్ని కీలలకు దగ్ధమై కుప్పకూలిపోయింది. అగ్ని ప్రమాదంలో భవంతి కూడా కుప్పకూలి వీధిలో రోడ్లపై పడిపోయింది. దీంతో డెన్మార్క్ ప్రజలు తీవ్రంగా కలత చెందారు. పురాతనమైన స్టాక్ ఎక్స్ఛేంజీ భవంతిపై ఉన్న 56 మీటర్లు పొడవుగల గోపురం కుప్పకూలిపోయింది. ఐతే ఈ అగ్ని ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా? అనే విషయం వెంటనే తెలియరాలేదు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు కూడా తెలియలేదు. పెద్దసంఖ్యలో అగ్నిమాపకదళాలు అక్కడికి చేరుకుని సహాయ కార్యక్రమాలు నిర్వహించాయి. 1857 వ సంవత్సరం నుండీ ఈ చరిత్రాత్మకమైన భవంతి డేనిష్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధీనంలో ఉంటున్నది. డెన్మార్క్ రాజు క్రిష్టియన్4 ఈ భవంతిని నిర్మించారు. డెన్మార్క్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆ పరంపరను కాపాడేందుకు, పునరుద్ధరణ చర్యలు కూడా తీసుకుంటున్నది. అనూహ్యంగా ఈ భవంతిలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. "డెన్మార్ దేశంలో ఉన్న 400 సంవత్సరాలనాటి గొప్ప చారిత్రక కట్టడం అగ్నికి ఆహుతైపోయిందని ఆ దేశ సాంస్కృతిక శాఖామంత్రి జాకబ్ ఎంగల్ స్కుమిడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆస్ట్రేలియా చర్చిలో టెర్రరిస్టు దాడి

**సిడ్నీ :** సిడ్నీ వెస్ట్ ఫీల్డ్ షాపింగ్‌మాల్‌లో మహిళలపై కత్తితో దాడి చేసిన మరువకముందే మరో ఘటన జరిగింది. గుడ్ షెపర్డ్ చర్చిలో ఓ బిషప్ మార్ మారి ఎమ్మాన్యుయేల్‌పై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. పోలీసులు ఈ ఘటనను ఉగ్రవాద దాడిగా ప్రకటించారు. సిడ్నీలోని అస్సీరియన్ చర్చిలో బిషప్‌పైన, అతడి అనుచరులపైన కత్తితో దాడిచేసి గాయపరచిన ఘటనలో 15 ఏళ్ళ టీనేజ్ బోయ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. బిషప్ తలపై, శరీరంపై పలుమార్లు కత్తితో పొడిచి గాయపర్చాడు. ఈ ఘటనతో చర్చిలో ఉన్నవారంతా భయభ్రాంతులై బిషప్‌కు సాయం చేసినట్లు ఒక వీడియోలో కనిపించింది. బిషప్‌తోపాటు మరో ముగ్గురు కూడా గాయపడ్డారు. దాడిచేసిన వ్యక్తిని మత ఉగ్రవాదిగా పోలీసులు పేర్కొన్నారు.

## ప్రత్యేక బోర్డు (మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్ ఎంపి అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ ఆది శ్రీనివాస్, గల్ఫ్ ఎన్ఆర్‌ఐ కార్మిక సంఘాల నేతలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఒక టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసి, గల్ఫ్ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఫిలిప్పీన్ విధానాలతో పాటు కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా తాము అధ్యయనం చేసినట్టు తెలిపారు. ఇప్పటికే గల్ఫ్ కార్మికుల కోసం ఒకపాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వం తరపున మిమ్మల్ని ఆహ్వానించి, పాలసీ డాక్యుమెంట్‌పై అభిప్రాయాలను, సూచనలను తీసుకుంటామని హామీనిచ్చారు. గల్ఫ్‌కార్మికులకు న్యాయపరమైనసాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**'ఏజెంట్ల నమోదు' విధానం ...**ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతున్నదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏజెంట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. గల్ఫ్ వెళ్లే వారికి ఒక వారం రోజుల పాటు శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నామన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి ఎక్కువ మంది గల్ఫ్ కార్మికులు ఉన్నారని, ఇందులో ఏజెంట్ల బారిన పడి కొందరు, యాజమాన్యం చేతిలో మరికొందరు కార్మికులు ఇబ్బంది పడుతున్నారని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ బాధితుల తరపున ప్రాతినిధ్యం వహించేందుకు లోక్‌సభ ఎన్నికల్లో 'జీవన్ అన్న'కు(జీవన్ రెడ్డి) అవకాశం ఇవ్వాలని, పార్లమెంట్‌లో గల్ఫ్ బాధితుల గొంతు వినిపించేందుకు నిజామాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలని రేవంత్ రెడ్డి కోరారు.

## పడవ బోల్తా (మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ కమిషనర్ భట్ తెలిపారు. ప్రమాద స్థలంలో ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసులు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఆ పడవలో పాఠశాల విద్యార్థులు సహా పలువురు ఉన్నారు. వారంతా గాండ్‌బల్ నుంచి బట్వారాకు వెళ్తున్నారు. ఈ ప్రమాదం నుంచి పలువురిని కాపాడారు. గల్లంతయిన వారి సంఖ్య తెలియాల్సి ఉంది. అయితే గత దశాబ్ద కాలంగా గాండ్‌బాల్ నుంచి శ్రీనగర్‌ను కలిపే వంతెన నిర్మాణం జరుగుతోందని, దీంతో ప్రజలు నదిని దాటాలంటే పడవలను ఆశ్రయించాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. ఈ వంతెనను నిర్మించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అన్నారు.

## భద్రగిరి (మొదటి పేజీ తరువాయి)

మూడు సూత్రాలు ఉంటాయి. ఒకటి రాముని వంశానికి చెందినది కాగా, రెండోది సీతమ్మ పుట్టింటిది, మూడోది భక్తరామదాసుది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతకుమారి ప్రభుత్వం తరుపున సీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఆమె మంగళవారం భద్రాచలం చేరుకోగా, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, ప్రత్యేకాధికారి నరేంద్ర నింజే, దేవదాయ, సమాచార శాఖ కమీషనర్ హనుంతరావు, ఎస్‌పి రోహిత్ రాజులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలు.

**రేపు పట్టాభిషేకం ...** రామనవమి ముగిసిన మరుసటి రోజు రాజాధిరాజు రామచంద్ర ప్రభువుకి పట్టాభిషేకం నిర్వహిస్తారు. రాజఠీవితో స్వామి వారు సింహాసనంపై ఆశీనులు కాగా వేదమంత్రాలతో స్వామికి పూజలు చేసి పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపిస్తారు.

### సిఎం శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భగవంతున్ని ప్రార్థించారు. 'శ్రీరామనవమి' సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యాన్ని దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు.

## క్షమాపణ చెప్పండి
(మొదటి పేజీ తరువాయి)

క్షమాపణలు తెలియజేయడానికి ధర్మాసనం అంగీకరించి అనుమతి మంజూరు చేసింది. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో పతంజలి సంస్థ టీకా పంపిణీ కార్యక్రమానికి వ్యతిరేకంగా ఆధునిక వైద్య విధానానికి వ్యతిరేకంగా ప్రచారం కొనసాగించింది. దీంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) వారిపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. అల్లోపతి వైద్యవిధానానికి వ్యతిరేకంగా వారు ప్రచారం చేస్తున్నారనీ, అల్లోపతి వైద్యవిధాన ప్రతిష్టను దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని 2022లోఐఎంఎ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది."ఆ ప్రకటనల ద్వారా మీరు ఏం చేద్దాం అనుకున్నారనే విషయంపై మేం వ్యాఖ్యానించదలచుకోలేదు. కానీ ఈక్షణంలో మాత్రం వారిద్దరూ (రామ్‌దేవ్, బాలకృష్ణ) సమస్య నుండి బయట పడలేదు, వారి బాధ్యత తీరిపోలేదు" అనివారి తరపు న్యాయవాది రోహత్గీకి ధర్మాసనం తెలియజేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం రామ్‌దేవ్, బాలకృష్ణలతో మాట్లాడింది. "మీరు ఇద్దరూ ఇక్కడ ఉన్నారని మేం అర్థం చేసుకున్నాం. ప్రజల్లో మీకు ఎంతో ప్రతిష్ట ఉంది, యోగా కోసం మీరుఎంతో చేశారు, మీరు చేసిన కృషిని ప్రజలు ఎంతగానో ప్రశంసిస్తున్నారు, ప్రపంచం మీరు చేసిన కృషిని చూస్తోంది" అని ధర్మాసనం వారితో చెప్పింది. అదేవిధంగా కోర్టును ఎందుకు అగౌరవించారని గత ఏడాది నవంబరు 21న సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత కూడా పత్రికాగోష్టిలో ఎందుకు మాట్లాడారని రామ్‌దేవ్ బాబాను జస్టిస్ హిమాకోహ్లీ ప్రశ్నించారు."కోర్టును అగౌరవించే ఉద్దేశం నాకు ఎప్పుడూ లేదు, ఏ రూపేణా నేను కోర్టును అగౌరవించను, నేను ఎలాంటి తప్పు చేసినాగానీ బేషరతుగా క్షమాపణలు చెబుతున్నాను" అని ముకుళిత హస్తాలతో రామ్‌దేవ్ బాబా హిందీలో ధర్మాసనానికి తెలియజేశారు. ఈ విధమైన హామీకి పతంజలి సంస్థ కట్టుబడి ఉండాలని ధర్మాసనం పేర్కొంది. "మీరు అల్లోపతి వైద్యవిధాన ప్రతిష్టను దిగజార్చకండి, మీ పని మీరు చేసుకోండి, మీరు ఎన్నో మంచిపనులు చేస్తున్నారు" అని జస్టిస్ అమానుల్లా అన్నారు.

## విద్యార్థి ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)

తక్కువగా ఉందని అధికారులు అతడిని పరీక్షకు అనుమతించలేదు. తల్లిదండ్రులకు ఫోన్ చేసి హాజరు శాతం తక్కువగా ఉందని.. ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. వారు రాకపోవడంతో విద్యార్థి హాస్టల్‌లోనే ఉన్నాడు. తోటి విద్యార్థులు పరీక్షకు వెళ్లిన కొద్దిసేపటికి ఉరేసుకున్నాడు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన విద్యార్థులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. సిఐ రాకేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏం చర్యలు తీసుకున్నారు?
(మొదటి పేజీ తరువాయి)

జరిగాయి. కానీ గోవధకు పాల్పడ్డారన్న పేరుతో గుంపు దాడులకు పాల్పడిన బాధితులపై పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేశారు. "గుంపు హత్యల ఘటనలపై దాఖలైన రిట్ పిటిషన్లకు చాలా రాష్ట్రాలు సమాధానాలు చెబుతూ అఫిడవిట్లు కోర్టులో దాఖలు చేయలేదని మేం గుర్తించాం. ఈ విధమైన కేసుల్లో తీసుకునే చర్యలపై సమాధానాలు ఇవ్వడానికి రాష్ట్రాల ప్రభుత్వాలు చాలా నిరాసక్తత చూపించాయి, నిర్లక్ష్యం ప్రదర్శించాయి, అందువల్ల రాష్ట్రాలకు మేం ఆరు వారాలు మాత్రమే గడువు ఇస్తున్నాం, ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెబుతూ ఆరు వారాలు పూర్తయేనాటికి రాష్ట్రాలు సుప్రీంకోర్టు ఎదుట అఫిడవిట్లు దాఖలు చేయాలి, ఏ చర్యలు తీసుకున్నారో వివరంగా లిఖితపూర్వకంగా తెలియజేయాలి" అని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఇలాంటి గుంపు హత్యలు, దాడులకు గురైన బాధితులపైనే ప్రభుత్వం ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసింది అని ఈ విచారణ సందర్భంగా ఎన్ఎఫ్‌ఐడబ్ల్యు తరపున వాదనలకు హాజరైన న్యాయవాది నిజామ్ పాషా ధర్మాసనం ఎదుట చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వమే ఈ విధంగా గుంపు హత్యలు, దాడులు జరగలేదని తిరస్కరిస్తే ఇక తహసీన్ పూనావాల్లా కేసు విచారణ సందర్భంగా 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎవరు అమలు చేస్తారని నిజామ్ పాషా ధర్మాసనాన్ని ప్రశ్నించారు. పూనావాల్లా కేసులో సుప్రీంకోర్టు అనేక విధాలుగా రాష్ట్రాలకు ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేసింది. గోవధ జరిగిందని నిర్ధారణ చేయడానికి ఏం చేశారు? ఆ మాంసం గో మాంసమే అని రసాయనిక పరీక్షల ద్వారా నిర్ధారించకుండా దాడికి గురైన బాధితులపైనే ఏ విధంగా ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేస్తారు? అని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదిని సుప్రీంకోర్టు ధర్మాసనం నిలదీసింది. "మీరు ఎవరినైనా రక్షించడానికి ప్రయత్నం చేస్తున్నారా? కనీస రసాయన పరీక్షల ద్వారా గోమాంసానిన నిర్ధారించకుండా గోవధ జరిగిందని మీరు ఎలా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేస్తారు?" అని ధర్మాసనం ప్రశ్నించింది. హర్యానాలో గుంపు దాడులు జరగకపోయినాగానీ ఒక వాహనంలో వెళుతున్న మాంసాన్ని పట్టుకుని గోవధ జరిగిందని, గోమాంసాన్ని తరలిస్తున్నారని కేసులు పెట్టారని ఎన్ఎఫ్‌ఐడబ్ల్యు తరపు న్యాయవాది పాషా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. "గుంపు దాడులు, హింస వంటి ఘటనలు జరగలేదని రాష్ట్రాలు చెబుతున్నాయనీ, కానీ గోవధ జరిగినట్టుగా బాధితులకు వ్యతిరేకంగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. కేవలం మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలు మాత్రమే బాధ్యతగా ఈ విషయంలో అఫిడవిట్లు దాఖలు చేశాయి" అని పాషా చెప్పారు.

## అనన్యరెడ్డికి మూడో ర్యాంకు
(మొదటి పేజీ తరువాయి)

మే 28న ప్రిలిమ్స్ నిర్వహించారు. 10,16,850 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 5,92,141 మంది పరీక్షలు హాజరయ్యారు. రాతపరీక్షలో దాదాపు 14,624 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రిలిమినరీ పరీక్షను క్లియర్ చేసిన వారికి సెప్టెంబర్ 15, 16, 17, 23, 24 తేదీల్లో రెండు షిఫ్టుల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించి.. డిసెంబర్ 8న మెయిన్స్ ఫలితాలు విడుదల చేశారు. మెయిన్స్‌లో సత్తా చాటిన వారికి జనవరి 2, ఏప్రిల్ 9 మధ్య వివిధ దశల్లో పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలు ప్రకటించారు. ఈ ఫలితాల్లో 1016 మందిని యుపిఎస్‌సి ఎంపిక చేయగా.. ఇందులో జనరల్ కేటగిరీలో 347 మంది, ఇడబ్ల్యుఎస్ నుంచి 115, ఒబిసి నుంచి 303, ఎస్‌సి కేటగిరీలో 165, ఎస్‌టి కేటగిరీలో 86 మంది చొప్పున ఎంపికయ్యారు.

### సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు వీరే..

దోనూరు అనన్య రెడ్డి (3) మూడో ర్యాంకుతో సత్తా చాటగా.. నందల సాయికిరణ్ 27, మేరుగు కౌశిక్ 82, పెంకీసు ధీరజ్ రెడ్డి 173, జి.అక్షయ్ దీపక్ 196, గణేశ్న భానుశ్రీ లక్ష్మి అన్నపూర్ణ 198, నిమ్మనపల్లి ప్రదీప్‌రెడ్డి 382, బన్న వెంకటేశ్ 467, కడుమూరి హరిప్రసాద్‌రాజు 475, పూల ధనుష్ 480, కె.శ్రీనివాసులు 526, నెల్లూరు సాయితేజ 558, కిరణ్ సాయింపు 568, మర్రిపాటి నాగభరత్ 580, పోతుపురెడ్డి భార్గవ్ 590, కె.అర్పిత 639, ఐశ్వర్య నెల్లిశ్యామల 649, సాక్షి కుమారి 679, చౌహాన్ రాజ్‌కుమార్ 703, గాదె శ్వేత 711, వి.ధనుంజయ్ కుమార్ 810, లక్ష్మి బానోతు 828, ఆదా సందీప్ కుమార్ 830, జె. రాహుల్ 873, హనిత వేములపాటి 887, కె.శశికాంత్ 891, కెసారపు మీన 899, రావూరి సాయి అలేఖ్య 938, గోవద నవ్యశ్రీ 995 ర్యాంకుల్లో మెరిశారు.

### పాలమూరు జిల్లా ప్రజలు హర్షం

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన అనన్యరెడ్డి మొదటి ప్రయత్నంలోని సివిల్ సర్వీస్‌కు ఎంపిక కావడం పట్ల పాలమూరు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొన్నకల్ గ్రామానికి చెందిన దోనూర్ సురేష్ రెడ్డి, మంజుల తల మొదటి సంతానమైన అనన్య.. పాఠశాల విద్యనంతా మహబూబ్‌నగర్ పట్టణంలోని పూర్తి చేసింది. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ఇంటర్మీడియట్ కోసం హైదరాబాద్‌లోని నారాయణ ఐఎఎస్ అకాడమీ చేరింది. చిన్నప్పటినుంచి సివిల్ సర్వీస్‌కు ఎంపిక కావాలన్నా ఆకాంక్షను, పట్టుదలను, గమనించి అనన్యను పైచదువుల కోసం ఢిల్లీలోని మీరంతా హౌస్‌లో తల్లిదండ్రులు చేర్పించారు. డిగ్రీ పూర్తయిన వెంటనే సివిల్స్‌కు సిద్ధమై మొదటి ప్రయత్నంలోనే మూడో ర్యాంకు సాధించడం పట్ల పాలమూరు జిల్లా వాసులు అనన్యరెడ్డిని అభినందిస్తున్నారు.

### సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్: 'సివిల్స్ పరీక్ష 2023' ఫలితాల్లో ఉత్తీర్ణులైన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈసారి దాదాపు 50 మందికి పైగా సివిల్ సర్వీసుకు ఎంపికవ్వడం సిఎం ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన దోనూరి అనన్య రెడ్డికి ప్రత్యేక అభినంధించారు.

## కోటీశ్వరులు (మొదటి పేజీ తరువాయి)

పోటీ చేస్తున్న కాంగ్రెస్ నేత వెంకటరమణ గౌడ రెండోవిడత పోలింగ్‌లో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తుల విలువ రూ.622 కోట్లకు పైనే. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ రూ.593 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. అలనాటి బాలీవుడ్ నటి, మథుర సిట్టింగ్ ఎంపీ హేమమాలిని మూడో స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆమె ఆస్తుల విలువ రూ.278 కోట్లు అని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. రెండో విడతలో మొత్తం 33 శాతం అంటే 390 మంది కోటీశ్వరులు ఉన్నట్లు తెలిపింది. అభ్యర్థుల సగటు ఆస్తుల విలువ రూ.5.17 కోట్లుగా ఉంది. సార్వత్రిక సమరం మరో మూడురోజుల్లో ప్రారంభం కానుంది. ఏప్రిల్ 19న తొలివిడత ఓటింగ్ జరగనుంది.

తొలివిడతలో మధ్యప్రదేశ్ మాజీసీఎం కమల్‌నాథ్ కుమారుడు, ఎంపీ నకుల్‌నాథ్ రూ. 717 కోట్లతో అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచిన సంగతి తెలిసిందే.

## ఉండేట్లులేదు (మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు ఒక్క పని కూడా చేయలేదంటూ కెసిఆర్ ధ్వజమెత్తారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల బిఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో మంగళవారం జరిగింది. సభలో కెసిఆర్ ప్రసంగిస్తూ 'కాంగ్రెస్ గెలిచిందని మాకు ఓర్వలేనితనం ఏం లేదు. వారు కూడా ఐదేండ్లు ఉండాలి. అప్పుడే నల్లదేందో తెల్లదేందో తెలుస్తది. కానీ ఈ సిఎం మాటలు చూస్తుంటే, సభల్లో ఆయన వణుకుడు చూస్తుంటే తెలంగాణ జనం, రైతులు తిరగబడ్డరని అర్థమవుతోంది. నారాయణపేట సభలో సిఎం భయం చూస్తుంటే ఈ గవర్నమెంట్ ఏడాది కూడా ఉండేటట్టు లేదు. ఎవడు ఎప్పుడు పోయి బిజెపిలో కలుస్తడో.. ముఖ్యమంత్రే జంప్ కొడతడో.. ఏమైతదో తెలియని పరిస్థితి. సిఎం ఇక్కడ ఒకటి మాట్లాడుతున్నాడు. అక్కడ ఒకటి మాట్లాడుతున్నాడు. ఢిల్లీకి పోయి బిజెపికి ఓటు వేయమని చెబుతుండు. ఏం జరుగుతుంది. ఎవరు ఎవరికి బీటీమ్. ఎవరెవరూ కలిసిపోయారు. ఇంకా మోసపోతే దెబ్బతింటం' అన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర పూర్తి కావాలన్నా, కరెంట్ మంచిగా రావాలన్నా ఈ ప్రభుత్వం మెడలు వంచాలి. 'అంబేద్కర్‌ను అవమానిస్తే మౌనం పాటిద్దామా? దళితబంధు బంద్‌పెడితే నోరు మూసుకుని పడి ఉందామా? ఇదే పార్లమెంట్ ఎన్నికల్లో వాళ్లకు సురుకుపెట్టాలి. బిడ్డా మోసం చేస్తే పడగొడుతామని జవాబు చెప్పాలి' అన్నారు.

### రైతుకు బోనస్ ఇవ్వండి

'నేను ముఖ్యమంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. రైతులకు బోనస్ పేరు మీద మీరు తప్పించుకోలేరు. దానికి ఎన్నికల కమిషన్ అడ్డురాదు. బిఆర్‌ఎస్ కూడా మీ పైన ఫిర్యాదు చేయబోదు. ఏ రైతుకు ఎంత బాకీ ఉంటారో అంత బోనస్ చిట్టీలు రాసివ్వండి. ఎన్నికల సమయంలో బాండ్ రాసిచ్చారు కదా. అలా బాండ్ ఇచ్చినట్లుగా ఇవ్వండి. అలా కాదంటే ఎన్నికల తెల్లారి ఇవ్వండి. కానీ బోనస్ ఎగబెడతాం అంటే మాత్రం ఊరుకునేది లేదు' అని కెసిఆర్ హెచ్చరించారు.

### పోస్టు కార్డుల ఉద్యమం

రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, బోనస్ ఇవ్వాలని, వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యాప్తం గా రైతాంగం పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించాలని కెసిఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇప్పటికే సిద్దిపేట రైతులు ఈ పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారని గుర్తుచేశారు. రైతు బంధు ఏది? అని అడిగితే ఈ లిల్లీపుట్ వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కెసిఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల సమస్యల గురించి అడిగితే పేగులు తీసి మెడలో వేసుకుంటామని, పండబెట్టి తొక్కుతామని, బాడీ మీద చెడ్డీలేకుండా చేస్తామంటూ అగౌరవంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.




| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## సిపిఐ ఎన్నికల నిధికి విరాళాలకు విజ్ఞప్తి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** సిపిఐ జాతీయ సమితి ఎన్నికల నిధి కోసం తెలంగాణ రాష్ట్రంలోని కమ్యూనిస్టు పార్టీ ప్రతి సభ్యుడు విధిగా రూ.10లు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మొత్తాన్ని పార్టీ జిల్లా సమితి నాయకత్వం సేకరించి వెంటనే రాష్ట్ర కేంద్రానికి పంపాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్నికల నిధి నిమిత్తం రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు రూ.5000, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూ.3000, రాష్ట్ర సమితి సభ్యులు రూ.1000లు, ప్రతి ప్రజాసంఘం రూ.5000లు రాష్ట్ర కేంద్రానికి పంపాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ కుటుంబాలు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు కూడా ఎన్నికల నిధికి తమ వంతు విరాళాన్ని పంపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

**సిపిఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ బ్యాంకు అకౌంట్ల వివరాలు:**

1.యుబిఐ 020110100049404,
ఆర్‌టిజిఎస్: యుబిఐఎన్0802018
2.ఎస్‌బిఐ62458147645,
ఆర్‌టిజిఎస్:ఎస్‌బిఐఎన్ 0020067

**డాక్టర్ నారాయణ, కూనంనేని విరాళం:**
సిపిఐ జాతీయ సమితి ఎన్నికల నిధికి పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఒక లక్ష రూపాయలను, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు వ్యక్తిగతంగా ఒక లక్ష రూపాయలను,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితికి ఒక లక్ష రూపాయలను అందజేశారు.

## డిఎంకెపై ఆగ్రహం...మాకు అనుకూలం..

### బిజెపి ప్రభుత్వ నమూనాను తమిళులు గమనిస్తున్నారు

ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ :** డిఎంకెపై తమిళ ఓటర్లకు ఉన్న ఆగ్రహం బిజెపికి ఉపకరిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. కాంగ్రెస్ పట్ల తమిళనాడు రాష్ట్ర ప్రజలు నిరాశకు గురైనప్పుడు ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపారని చెప్పారు. ప్రధాని మోడీ 'ఎఎన్‌ఐ' మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తమిళనాడు రాజకీయాల గురించి మాట్లాడారు. ప్రస్తుతం నిరాశ చెందిన తమిళ ప్రజలు కేంద్రంలో బిజెపి ప్రభుత్వ నమూనాను, ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల నమూనాను గమనిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా వివిధరాష్ట్రాలలో నివసిస్తున్న తమిళులు వారి స్వంత రాష్ట్రానికి వెళ్ళినప్పుడు, తాము ఉంటున్న రాష్ట్రంలో జరిగే పరిణామాలను వివరిస్తున్నారని పేర్కొన్నారు. పానీపూరీ వాలా అంటూ బిజెపిని డిఎంకె గేలి చేస్తోందని, కాని తమిళనాడు ప్రజలను కాశీకి వెళ్ళి చూసినప్పుడు, తాము విన్నదానికి అక్కడ వేరుగా ఉన్నదని చెబుతన్నారని అన్నారు. అక్కడ ఎంతో అభివృద్ధి జరిగిందని, అందుకే డిఎంకెకి వ్యతిరేకంగా ఆగ్రహం పెరిగిపోయిందని చెప్పారు. కొన్ని పార్టీలు కేవలం తమ కుటుంబం కోసం, కుటుంబ చేత, కుటుంబానికై పని చేస్తుంటాయని మోడీ ఎద్దేవా చేశారు. బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డిఎంకెలో చేరినట్లయితే , ఆ పార్టీలో ఆయన పెద్ద నాయకుడు అయ్యేవారని అన్నారు. అలా కాకుండా ఆయన బిజెపిలో చేరారన్నారు. అన్నామలై కేవలం సిద్ధాంతాలకు అకర్షితుడై బిజెపిలో చేరినట్లుగా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం అందరినీ ఆకర్షిస్తున్నదని, సామర్థ్యాన్ని బట్టి ప్రతి చిన్న, పెద్ద కార్యకర్తకు తమ పార్టీ అవకాశాలను ఇస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాగాంధీ తన మెడలో రుద్రాక్ష మాల ధరించేవారని, అలాంటిది సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారి పక్కన కాంగ్రెస్ నేతలు ఎందుకు కూర్చుంటున్నారని ప్రజలు ప్రశించాలని మోడీ అన్నారు. సనాతన ధర్మంపై ద్వేషం నుండే డిఎంకె జన్మించి ఉండొచ్చన్నారు.

## ఉత్తరాదిన నష్టాన్ని తమిళనాడులో పూడ్చుకునే యత్నం

- అందుకే మోదీ పదేపదే మా రాష్టానికి వస్తున్నారు
- రాహుల్ ఒక్క పర్యటన.. మోదీ పది పర్యటనలకు సమానం

### తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె నేత ఎం.కె.స్టాలిన్




**చెన్నై :** తమకు గట్టి పట్టు ఉండే ఉత్తరభారత రాష్ట్రాలలో జరగబోయే నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలలో, ప్రత్యేకించి తమిళనాడులో పదేపదే పర్యటిస్తున్నారని డిఎంకె అధ్యక్షులు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె. స్టాలిన్ ఎద్దేవా చేశారు. "నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలలో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. గతంలో ఈ రాష్ట్రాలలో వారి పార్టీకి గట్టిపట్టు ఉండేది. ఇప్పుడు జరగబోయే నష్టాన్ని మోడీ, అమిత్ షాలు దక్షిణాది రాష్ట్రాలలో పూడ్చుకోవాలని చూస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలలో ప్రత్యేకించి తమిళనాడులో బిజెపి సిద్ధాంతం ప్రజల ఆలోచన విధానానికి వ్యతిరేకమైనదని"ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్టాలిన్ స్పష్టం చేశారు. ఎవరు అధికారంలోకి రావాలనే దానికంటే ఎవరు అధికారంలోకి రాకూడదనేది అంశాన్ని ప్రస్తుత ఎన్నికలు నిర్ణయిస్తాయని చెప్పారు. గుజరాత్ నమూనా, అభివృద్ధి హీరో (హీరో ఆఫ్ డెవలప్‌మెంట్) అనే ముసుగులు ధరించి మోడీ ఎన్నికలో బరిలో ఉన్నారని, ఆ ముసుగు జారిపోయి ఆయన అవినీతి మోడీగా నిలబడ్డారని విమర్శించారు. తన స్వార్థపూరిత రాజకీయాల కోసం దేశమంతటిని నాశనం చేశారని మోడీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.

**పునరావృతం కానున్న 2004 ఫలితం**

తమిళనాడులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసే ఒక్క పర్యటన మోడీ చేసే పది పర్యటనలతో సమానమని స్టాలిన్ అన్నారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ ప్రధానమంత్రి అభ్యర్థులను ప్రచారం చేయలేదని పేర్కొన్నారు. 2004లో ప్రధాని అభ్యర్థి ఎవరనేది ప్రచారం చేయకుండానే యుపిఎ ప్రభుత్వం విజయం సాధించిందని, మన్మోహన్ సింగ్ దేశ ప్రధాని అయ్యారని గుర్తు చేశారు. ఆయన పదేళ్ళు భారతదేశాన్ని పరిపాలించారని, 20ఏళ్ళ తరువాత చరిత్ర పునరావృతం కానున్నదని తెలిపారు. కేవలం మీడియా ఆధారంగానే తమిళనాడులో బిజెపి బలపడుతోందనే మిథ్యను ప్రచారం చేస్తున్నారని, తమిళనాడుకు మంచి పథకాల అమలుచేసి ఎన్నికలలో వంద ఓట్లు సాధించాలనే ఆలోచన బిజెపికి ఎన్నడూ లేదన్నారు.

బిజెపి ఆశీర్వాదంతోనే ఎఐడిఎంకె కూటమి మరో నాటకానికి తెరలేపిందని, దాని నాయకుడు బిజెపికి బానిస మాత్రమే కాదని, వెట్టి కార్మికుడు అని మండిపడ్డారు. బిజెపితో తెగదెంపు లు చేసుకున్న తరువాత ఆ పార్టీకి వ్యతిరేకంగా నోరు తెరవలేని ఎఐఎడిఎంకె నాయకుడు ఎడప్పాడి పలనిస్వామిని ఉద్దేశించి స్టాలిన్ ఘాటు విమర్శలు చేశారు.

బహుముఖ పోటీ డిఎంకెకు లబ్ది చేకూరుతుందనే వాదనను ఆయన త్రోసిపుచ్చారు. అలాగైతే ప్రత్యర్థి శిబిరం ముందే ఓటమిని అంగీకరించిందా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రత్యర్థి పార్టీలన్నీ గతంలో ఒకే కూటమిలో ఉన్నప్పుడు కూడా తమను ఓడించలేకపోయాయని గుర్తుచేశారు. బిజెపి మ్యానిఫెస్టోపై స్టాలిన్ స్పందిస్తూ వారంటీ లేకుండానే మోడీ గ్యారంటీలు ఇస్తారని అన్నారు. పాత వాగ్దానాలనే మళ్ళీ మ్యానిఫెస్టోలో పెట్టారని, బిజెపి మ్యానిఫెస్టోలో ఎక్కడా ఇండియా అనే పదం లేదని, ఈసారి ఎన్నికల్లో బిజెపి అనే పదంలేని ఇండియాను ప్రజలు సృష్టిస్తారని అన్నారు.

## ముందు ఉత్తర్‌ప్రదేశ్ గురించి ఆత్మపరిశీలన చేసుకో

### ప్రధానికి కేరళ సిఎం విజయన్ ధీటైన జవాబు



**త్రిస్సూర్ :** కేరళను విమర్శించే ముందు ప్రధాని మోడీ...బిజెపి పాలిత ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సూచిల విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుండి తమ ప్రభుత్వం పొందిన ప్రశంసలను కూడా చూడాలని సూచించారు. త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల సభల్లో కేరళ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం త్రిస్సూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం విజయన్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ ర్యాంకుల్లో సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలన సూచిలలో కేరళ ప్రథమ స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ గుర్తింపులు అన్నీ ఊరికే రాలేదని, రాజకీయంగా తమను వెంటాడుతున్నప్పటికీ కేరళ రాష్ట్రం అత్యున్నత స్థాయికి ఎదిగిన తీరును కేంద్రం గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి ఎంపిగా ఉన్న ప్రధాని మోడీ.. వివిధ సూచిలలో ఆ రాష్ట్రం సాధించిన ర్యాంకుల ఏమిటనేది ఆయన తనకు తానుగా ప్రశ్నించుకోవాలని అన్నారు. కేరళను మోడీ, బిజెపిలు వంచిస్తున్నాయని, ఇటీవల విడుదల చేసిన బిజెపి మ్యానిఫెస్టోలో కూడా ఆ విషయం మరోసారి తేలిపోయిందన్నారు.సిపిఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా కమిటీ ఖాతాలను కేంద్ర ఏజెన్సీలు నిలిపివేసినా.. ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సురేశ్ గోపి గెలిచేందుకు ఆ చర్య ఉపయోగపడబోదన్నారు. కేరళ రాష్ట్రంలోని మొత్తం 20లోక్‌సభ నియోజకవర్గాలలో బిజెపి మూడవ స్థానంతో సరిపెట్టుకుంటుందని అన్నారు.బిజెపి ఎన్నికల ప్రణాళిక మతోన్మాద ఎజెండాతో కూడి ఉన్నదని, తమ పదేళ్ల పరిపాలన నివేదికను ప్రజలకు ఇచ్చే ధైర్యం బిజెపికి లేదన్నారు. లోక్‌సభ ఎన్నికలు కేవలం సంఘ్ పరివార్ శక్తులను ఓడించేందుకే కాకుండా భారత సార్వభౌమత్వం, సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్య స్వభావాలను పరిరక్షించేందుకు జరుగుతున్నా యని విజయన్ తెలిపారు.

## త్వరలో ఇండియా కూటమి ఉమ్మడి పత్రం?

**న్యూఢిల్లీ :** 2024 పార్లమెంటు ఎన్నికల మ్యానిఫెస్టో తరహాలోత్వరలోనే ఇండియా కూటమి ఉమ్మడి పత్రాన్ని ప్రజల ముందు ఉంచే అవకాశం ఉన్నది. బిజెపిని ఓడించే ఉమ్మడి లక్ష్యం విషయంలో కూటమి భాగస్వాములు ఐక్యంగా ఉన్నారనే సందేశాన్ని దేశ ప్రజలకు ఇచ్చేందుకు ఉమ్మడి పత్రం (జాయింట్ డాక్యుమెంట్) విడుదల గురించి యోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆ దిశగా కూటమిలో పార్టీల మధ్య చర్చలు జరిగా యి. ఈ పత్రంలో అన్ని పార్టీలకు ఆమోదయోగ్యమైన ఉమ్మడి అంశాలు ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా ఉద్యోగాల కల్ప న, ధరల పెరుగుదల నియంత్రణ, సంక్షేమ పథకాలతో పాటు, దేశానికి సంబంధించి ఆందోళన కలిగించే అంశాల ప్రస్తావన ఇండియా కూటమి ఉమ్మడిపత్రంలో ఉండనుంది. ఈ వారంలో దీనిని విడుదల చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు వార్త కథనాలు వెలువడుతున్నాయి.

## గులాబీ కంచుకోటల్లో కాంగ్రెస్ పాగా

### వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో క్లీన్‌స్వీప్




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ఒకప్పుడు బిఆర్‌ఎస్ కంచు కోటలుగా ఉన్న నియోజకవర్గాలలో కాంగ్రెస్ పాగా వేసింది. గడిచిన రెండు దశాబ్దాలుగా బీఆర్‌ఎస్ తిరుగు లేని శక్తిగా ఉన్న స్థానాలలోనూ నేడు కాంగ్రెస్‌దే హవా నడుస్తోంది. గడిచిన లోక్‌సభ ఎన్నికలలోనూ వరుసగా రెండు మార్లు బిఆర్‌ఎస్ అభ్యర్థులే ఘన విజయం సాధించారు. కానీ నేడు పరిస్థితి తలకిందులైంది. గత సంవత్సరం చివరిన జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తో బిఆర్‌ఎస్ డీలా పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికలలో గెలచి అధికారంలోకి వచ్చిన ఊపుతో కాంగ్రెస్ ప్రస్తుతం జోరు మీద ఉంది. రానున్న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికలలో దీని ప్రభావం పడనుంది. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలలో నేడు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలే ఉండడంతో ఇక విజయం ఖాయమనే ధీమా కాంగ్రెస్‌లో వ్యక్తం అవుతున్నది. అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎంఎల్‌ఎలే ఉన్నప్పటికీ తమ సిట్టింగ్ స్థానాలను తిరిగి దక్కించుకుంటామని బిఆర్‌ఎస్ ఆశతో ఉంది. మరోవైపు బిజెపి గడిచిన ఎన్నికలలో పెద్దగా ప్రభావం చూపకపోవడంతో కొంత వెనుకబడినా లోక్‌సభ ఎన్నికలలో గట్టి పోటీని ఇవ్వాలని చూస్తున్నది. లోక్‌సభ నియోజక వర్గాల రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభా స్థానాలు ఉన్నాయి. వీటిలో వరంగల్ ఎస్సీ సామాజిక వర్గానికి, మహబూబాబద్ నియోజక వర్గం ఎస్‌టి సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి. ఈ రెండు నియోజక వర్గాల పరిధిలో గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటి అసెంబ్లీ నియోజక వర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు.

వరంగల్ లోక్‌సభ పరిధి లో 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో 6 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఒక్క స్టేషన్ ఘన్‌పూర్‌లో బిఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. కాగా కడియం శ్రీహరి ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో వరంగల్ పరిధిలోని ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో కలిపి 6,63,556 ఓట్లు పొందగా బిఆర్‌ఎస్‌కు 4,33,368 ఓట్లు, బిజెపికి 1,56,638 ఓట్లు వచ్చాయి. ఇక మహబూబాబాద్ లోక్‌సభ నియోజక వర్గం పరిధిలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో భద్రాచలం అసెంబ్లీ నియోజక వర్గంలో మాత్రమే బీఆర్‌ఎస్ గెలుపొందగా మిగిలిన ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది.

భద్రాచలం ఎమ్మెల్యే సైతం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు మహబూబాబాద్ లోక్‌సభ నియోజక వర్గం పరిధిలో 6,85,897 ఓట్లు, బిఆర్ ఎస్‌కు 4,43,910 ఓట్లు, బిజెపికి కేవలం 34,431 ఓట్లు మాత్రమే వచ్చా యి. కాంగ్రెస్ మహబూబాబాద్ లోక్‌సభ నియోజక వర్గం పరిధి లో 2.30,188 ఓట్ల మెజారిటి ఉంది. దీంతో రెండు చోట్లా కాంగ్రెస్ పార్టీకి గెలుపు అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. లోక్‌సభ పోరులోనూ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోంది.

## ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుంది

### రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడః** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతితో కలసి ఈ నెల 18న సాయంత్రం పట్టణంలో జరిగే పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహాక సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జూన్ 9న భారత ప్రధానిగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. బిజెపికి తెలంగాణలో ఓట్లు అడిగే అర్హతలేదన్నారు. బిజెపి పార్టీ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. విభజన హామీల్లో భాగంగా పార్లమెంట్‌లో చట్ట ప్రకారం తెలంగాణకు రావాల్సిన ట్రైబల్ యూనివర్సిటి, కాజీపేట రైల్వేకోచ్, బయ్యారం స్టీల్‌ప్లాంట్, హైదరాబాద్‌లో రెండున్నర లక్షల కోట్లతో 50 లక్షల ఐటి ఉద్యోగాలు వంటి హామీలు అమలు చేయకుండా మోసం చేసిన బిజెపి తెలంగాణ ప్రజలు క్షమాపణలు చెప్పాలన్నారు. బిజెపి పార్టీ మతపరంగా ప్రజలను విభజించి రాజకీయంగా లబ్ది పొందే ప్రయత్నం తప్ప మరొక్కటి లేదన్నారు.

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వారి ఆదాయాన్ని పూర్తిగా తగ్గించిందన్నారు. సిఎం కెసిఆర్ 10సంవత్సరాలు తెలంగాణను పాలిస్తే అధికారం పోయిన వందరోజుల్లోనే బిఆర్‌ఎస్ ఖాళీ అయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బిఆర్‌ఎస్ కనుమరుగు అవుతుందన్నా రు. నల్లగొండ ఎంపి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బిజెపి, బిఆర్‌ఎస్ తప్ప అన్ని పార్టీల నాయకులను ఓట్లు అడగాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పిసిసి ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వంగవీటి రామారావు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్, డిసిసి ఉపాధ్యక్షులు పార సీతయ్య, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి, కీతా వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, బషీర్, పుల్లారెడ్డి,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఖరారు కాని కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి

### అభ్యర్థి దొరకడం లేదంటూ ప్రతిపక్షాల మాటల తూటాలు

### అధిష్టానం చుట్టూ వెలిచాల, ప్రవీణ్‌రెడ్డి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. రేపు మాపు అంటూ వాయిదాలు వేస్తుండడంతో పార్టీ శ్రేణులు నిరుత్సాహంతో ఉన్నారు. ఓ వైపు బిజెపి.. మరో వైపు బిఆర్‌ఎస్ అభ్యర్థులు జోరుగా ప్రచారం కొనసాగిస్తుండగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వంపై మీనమేషాలు లెక్కిస్తుండడం ఆ పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. మరో వైపు ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు దగ్గరకు వస్తుండగా అదే రోజు నుంచి నామినేషన్ల పర్వం కొనసాగనుంది. కరీంనగర్ నుంచి వెలిచాల రాజేందర్‌రావు, అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి టిక్కెట్లు ఆశిస్తుండగా ఎవరి అనుచరులు వారు టికెట్ కన్ఫార్మ్ అయ్యిందంటూ ప్రచారంచేస్తూ కాంగ్రెస్ శ్రేణులను గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 18 నుంచి నాలుగు రోజుల పాటు నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరిని గెలిపించాలని చర్చ జరగాలని తలలు పట్టుకుంటున్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు బండి సంజయ్ కుమార్, వినోద్‌కుమార్ ఇప్పటికే తమ ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇప్పటికే బిజెపి ఎంపి అభ్యర్థిత ప్రజాహిత యాత్ర పేరిట పార్లమెంటు నియోజకవర్గాన్ని చుట్టివచ్చారు. మరో వైపు బిజెపి నుంచి నియోజకవర్గ, మండల శ్రేణులు సైతం బండి సంజయ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు. రైతు దీక్షలు, నేతన్నల మద్దతుగా నిలుస్తూ తన దైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. బిఆర్ ఎస్ ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్ సైతం ఎమ్మెల్యేలను, మాజీ ఎమ్మెల్యేలతో పాటు బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు.మార్నింగ్ వాక్‌లతో పాటు కార్నర్ మీటింగులతో తమ ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ టికెట్‌పై దృష్టిపెట్టని అధిష్టానం లోక్‌సభ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రచార బాధ్యతలకు సంబంధించి ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ నేతలతో పాటు అనుబంధ సంఘాల నేతలకు పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఇంచార్జిలను నియమిస్తున్నారు. ఇంకా అభ్యర్థి తేలకపోవడంతో పార్లమెంటు పరిధిలోని7 నియోజకవర్గాల ప్రచారంలో ఆలస్యం జరిగి ప్రజలను కలుసుకోలేకపోతామేమోనని కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొనగా అభ్యర్థుల్లోనూ అదే టెన్షన్ పట్టుకుంది. అభ్యర్థిని ప్రకటిస్తే ప్రచార రంగంలోకి దిగడానికి నేతలు సంసిద్ధంగా ఉన్నారు.

**వెలిచాలకా? ప్రవీణ్ రెడ్డికా?**

కరీంనగర్ ఎంపి టికెట్ కోసం ప్రధానంగా ముందు నుంచి వెలమ సామాజిక వర్గానికి చెందిన వెలిచాల రాజేందర్‌రావు, బిసి సామాజిక వర్గానికి చెందిన అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిల పేర్లు ప్రధానంగా అధిష్టానం పరిశీలిస్తోంది. హుస్నాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డ ప్రవీణ్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన హామీ మేరకు ప్రవీణ్ రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్లుగా తెలుస్తోంది. కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం ఈ విషయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావుకే టికెట్ ఇవ్వాలని పొన్నం ప్రభాకర్‌తో పాటు ముఖ్య నేతలు కోరుతున్నట్లు తెలుస్తోంది. అటు సామాజిక వర్గం, ఆర్థిక పరిస్థితులు, తండ్రి చరిష్మా తోడవుతుందని వివరించినట్లు తెలిసింది. ఆఖరుగా 2009లో కరీంనగర్ ఎంపిగా పొన్నం ప్రభాకర్ గెలుపొందారు. మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతున్నారు.

కాగా కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అప్పటి నుంచి నామినేషన్ల దాఖలకు ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. నోటిఫికేషన్ ఒక్క రోజే సమయం మిగిలియగా కాంగ్రెస్ క్యాండిటేట్‌పై ఉత్కంఠ కొనసాగుతుండడంపై పెదవి విరుస్తున్నారు. ప్రతిపక్షాలు సైతం ఇదే అస్త్రంగా అభ్యర్థి కరువయ్యాడంటూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు వేస్తోంది. నోటిఫికేషన్‌కు ముందే క్యాండిటేట్ ప్రకటించాలని కాంగ్రెస్ వర్గాలు కోరుతున్నాయి.

## నిర్మల్‌లో క్రాస్ ఓటింగ్ తప్పదా?

### పార్టీలోకి అవినీతి పరుల ఆహ్వానంపై సీనియర్‌ల గుసగుస..



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిః** లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు మొదలయ్యాయి, సీనియర్లకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నా, బిఆర్‌ఎస్ అవినీతి పరులను కాంగ్రెస్‌లో చేర్చకోవడం పట్ల డిసిసి ప్రెసిడెంట్‌పై కాంగ్రెస్ పార్టీపై నమ్మకం కోల్పోతున్నారు?దీంతో నిర్మల్ జిల్లాలో క్రాస్ ఓటింగ్ జరుగుతుందా అనే ప్రచారం కూడా లేకపోలేదు. కాంగ్రెస్ నేతల నిర్లక్ష్యం కారణంగానే కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత మొదలైంది. తుక్కగూడలో జరిగిన బహిరంగ సభకు పోవడానికి వాహనాలు ఏర్పాటు చేయకపోవడం, ఎవరైనా సొంత ఖర్చులతో వెహికల్ ఏర్పాటుచేస్తే రండి లేకుంటే పోండి అన్నట్లు ప్రచారం కూడా లేకపోలేదు. డిసిసి అధ్యక్షులుపై నాయకులు, కార్యకర్తలు నారాజయ్యారని కొందరు సీనియర్ నాయకులు వాపోతున్నారు. గతంలో మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతి ఉద్యోగుల నియామకంలో ముఖ్యపాత్ర పోషించిన కొందరిని పార్టీలో చేర్చుకోవద్దని చెప్పినా కాంగ్రెస్ పార్టీ నాయకులు చేర్చుకోవడం పట్ల కాంగ్రెస్‌పార్టీపై నమ్మకం కోల్పోతుందని, అవినీతిపరులను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ ముందుకు వెళ్తే కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా నాయకులపై వ్యతిరేకత ఏర్పడుతుందని, గతంలో అధికారం అడ్డుపెట్టుకొని చెరువులు, కుంటలు, కందకాలను, నిర్మల్ పట్టణంలో ఇరువైపులా అభివృద్ధి పేరుతో అక్రమాలకు పాల్పడ్డ టిఆర్‌ఎస్ నాయకులను పార్టీలోకి చేర్చుకోవద్దని, గత వారం రోజుల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేసినా, లెక్క చేయకపోవడం, బిజెపి, టిఆర్‌ఎస్ పార్టీ మంత్రులపై విమర్శలు చేసిన స్పందించి కనీసం ప్రెస్‌మీట్ పెట్టి కౌంటర్ ఇవ్వకపోవడంపై, డిసిసి అధ్యక్షులపై నాయకులు, కార్యకర్తలు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తుంది. డిసిసి అధ్యక్షులు మౌనం వీడకుండా ప్రతిపక్షాలపై ప్రెస్‌మీట్ పెట్టకపోవడంపై ఏదైనా లోపాయికారి ఒప్పందం జరిగిందా అనే అనుమానాలు కూడా లేకపోలేదే, ప్రతిపక్ష నాయకులు అనేక రకాలుగా విమర్శలు చేస్తున్న, అన్ని జిల్లాల నుండి డిసిసి అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్లు వేస్తుంటే నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు కౌంటర్ వేయకపోవడం పట్ల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా గుసగుసలాడుతున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే డిసిసి అధ్యక్షులు పై కాంగ్రెస్ అధిష్టానానికి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఇప్పటికైనా జిల్లా ఇన్చార్జ్ మంత్రి కార్యకర్తల సూచనలు పట్టించుకోవాలని, గత ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని మళ్లీ పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా పార్టీలో ఎవరిని చేర్చుకుంటే ఓటు బ్యాంకు పెరుగుతుందో, కార్యకర్తల, నాయకుల సూచనలు తీసుకోవాలని కొందరు సీనియర్ నాయకులు అంటున్నారు.

ప్రజాపక్షం

బుధవారం, ఏప్రిల్ 17

# సుప్రీం తీర్పును తప్పుబట్టిన మోదీ

మనీలాండరింగ్, క్విడ్ ప్రోకోలతో రాజకీయ పార్టీలు – కార్పొరేట్‌ల మధ్య అవినీతి బాంధవ్యానికి వీలు కల్పించిన ఎన్నికల బాండ్‌ల పథకం రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఇంత ఆలస్యంగా స్పందించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ దాన్ని తప్పుబట్టారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దేశం మళ్లీ ఎన్నికల్లో నల్లధనంలోకి నెట్టివేయబడిందన్నారు. నిజాయితీగా పర్యాలోకనం చేసే ఎవరైనా 'అందుకు విచారిస్తార'ని న్యూస్ ఏజన్సీ ఎఎన్ఐకిచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని అన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తున్నదెవరో తెలుపుతున్నందున ఎన్నికల బాండ్‌లను 'విజయగాథ'గా అభివర్ణించారు. ఈ బాండ్‌ల వెనుకనున్న ఆలోచన తనదే అని ఆయన పరోక్షంగా అంగీకరించారు. 'ఎన్నికల్లో నల్లధనం ప్రమాదకరమైన క్రీడగా ఉందని దేశంలో చాలాకాలంగా చర్చ జరుగుతోంది. మన ఎన్నికలకు నల్లధనం నుంచి స్వేచ్ఛ కల్పించటం ఎలా? పారదర్శకత సాధించటం ఎలా? మనం ఏదో ఒకటి చేయాలి. నేను స్వచ్ఛమైన మనస్సుతో ఆలోచించాను. మార్గాంతరం కోసం అన్వేషించాం. చిన్నబాట కనిపించింది. అదే పరిపూర్ణ మార్గమని మేమెన్నడూ చెప్పలేదు. విధాన నిర్ణయం తీసుకోవటంలో లోపం వుండదని ఎన్నడూ చెప్పను. చర్చలద్వారా మెరుగుపరుచుకునే అవకాశం ఎంతో ఉంటుంది. అయితే నేడు దేశాన్ని నల్లధనంలోకి నెట్టివేశాం. అందువల్ల ప్రతి ఒక్కరూ విచారిస్తున్నారని చెప్పగలను' అని ఆవేదన వ్యక్తం చేశారు మోదీ. ప్రతిపక్షాలు ఆ పథకంలోని లోపాలను ఎత్తిచూపినపుడు ఎందుకు పట్టించుకోలేదు? గరిష్ట లబ్ధిదారు తమ పార్టీయే కావటం, తాము ఏమిచేసినా అదే రైటు అనే మితిమీరిన ఆత్మవిశ్వాసం, ప్రతిపక్షాలపట్ల తృణీకార భావం అందుకు కారణం అనుకోవచ్చు. ఎన్నికల బాండ్ల పథకంపై ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని ఆయన ఇప్పటికీ నిందిస్తున్నారు. ఈ పథకం కింద 3000 కంపెనీలు విరాళాలివ్వగా, వాటిలో 26 కంపెనీలపై ఇడి చర్య తీసుకుందని, ఇడి చర్య తర్వాత 16 కంపెనీలు ఎన్నికల బాండ్‌లు కొనుగోలు చేశాయని ప్రధాని వివరించారు. అంటే విరాళాల కొరకు అధికార ఏజన్సీలను ప్రయోగించినట్లు అంగీకరించారు. ప్రధాని వ్యాఖ్యలకు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ బెదిరించి డబ్బు గుంజిన ఈ అతిపెద్ద పథకం రూపశిల్పి మోదీ అని తేటతెల్లమైందన్నారు. ఈ పథకం కింద ఎవరెవరికి ఎంత ధనం అందిందనే విషయాన్ని వెల్లడించటానికి తొలుత సాకులు చెప్పిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టు మందలింపుపై వెల్లడించిందని, దాంతో భాగోతం బయటపడిందన్నారు. ఆ పథకాన్ని ప్రధాని సమర్థించటం ''నష్ట నివారణకు విషాదకర ప్రయత్నం''గా ఉందన్నారు. ఈ పథకంలో పేర్లు – తేదీలు ముఖ్యం. కొందరు తమకు కాంట్రాక్టు మంజూరైనాక, లేదా తమపై సిబిఐ దర్యాప్తు ఉపసంహరించాక వారు బాండ్‌లు కొన్నారు. ఒక క ంపెనీపై సిబిఐ దర్యాప్తు ఎందుకు మొదలుపెట్టారు, అది ఎన్నికల బాండ్ ఇవ్వగానే ఎందుకు ఉపసంహరించారో ప్రధాని చెప్పాలి అని రాహుల్ డిమాండ్ చేశారు.

ఇదే సమయంలోనే, ఎన్నికల బాండ్‌ల పథకాన్ని కొట్టివేసిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై సుప్రీంకోర్టులో రెవ్యూపిటిషన్ దాఖలైంది. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన ఊహాజనితం అని పిటిషన్ ఆరోపించింది. నల్లధనం అరికట్టటానికై ఫైనాన్స్ చట్టానికి సవరణ ద్వారా ఈ పథకం తెచ్చారు. ఇది నల్లధనాన్ని పూర్తిగా అరికట్టలేకపోయినా దాతలను గోప్యంగా ఉంచటంద్వారా కొంతమేరకు పారదర్శకతను ప్రవేశపెట్టిందని పిటిషనర్ పేర్కొన్నారు.

మరోవైపున, 'తప్పుడు సమాచారం', 'బహిరంగ విమర్శ'ల ద్వారా అవినీతికేసుల్లో న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెస్తున్నారని గత నెలలో 600మంది న్యాయవాదులు, వారికి తోడుగా తాజాగా 20మందికిపైగా సుప్రీంకోర్టు, హైకోర్టు రిటైర్డ్ జడ్జీలు భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌కు లేఖరాయటం గమనించదగింది. అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లాగే న్యాయవ్యవస్థలోకూడా విభజన తెచ్చే, కొందరు తమ అనుకూల–వ్యతిరేక తీర్పులనుబట్టి న్యాయవ్యవస్థపై విమర్శలతో ఒత్తిడి తెచ్చే ఈ ధోరణి – ప్రజలకు ఇప్పటికీ విశ్వాసం మిగిలివున్న న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తుంది. అందువల్ల న్యాయాధికారులు మనో నిబ్బరంతో ఒత్తిళ్లకు అతీతంగా కక్షిదారులకు న్యాయం చేయటంపైనే దృష్టి లగ్నం చేయాలి.

## కుక్కకాటుకు చెప్పుదెబ్బ

# కేరళ స్టోరీకి పోటీగా మణిపూర్ చిత్రం!



ఎం. కోటేశ్వరరావు

కేరళలో ఈనెల 26న జరిగే లోక్‌సభ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయం కొనసాగింపుగా పైచేయి సాధించాలని సిపిఎం నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ చూస్తుండగా 2019 పార్లమెంటు ఎన్నికలలో వచ్చిన సీట్లను నిలుపుకోవాలని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి ప్రయత్నిస్తోంది. ఏదో ఒక సీటు సాధించి రాష్ట్రంలో తమకూ స్థానం ఉందని పరువు నిలుపుకొనేందుకు బిజెపి చూస్తోంది. జనసంఘం తరువాత బిజెపిగా ఉన్న పార్టీకి గతంలో ఒకసారి ఒక అసెంబ్లీ స్థానం రావటం తప్ప కేరళ నుంచి పార్లమెంటులో ప్రాతినిధ్యం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి రాజ్యసభ ద్వారా కేరళ బిజెపి నేతలు ఇద్దరికి కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న ఒక స్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ ఎన్నికలలో అనూహ్యంగా కేరళ స్టోరీ పేరు తో వచ్చిన ఒక సినిమాను సంఘపరివార్ ప్రోద్బలంతో క్రైస్తవ మతాధికారులు ప్రదర్శిస్తున్నారు. లవ్ జీహాద్ పేరుతో కాషాయ దళాలు ముందుకు తెచ్చిన కుట్ర సిద్ధాంతంతో కూడా కూడిన ఊహాజనిత చిత్రమే అది.ముస్లిం యువకులు హిందూ, క్రైస్తవ మతాలకు చెందిన యువతులకు వలపు వలవేసి మతమార్పిడికి చూస్తున్నారన్నదే ఆ చిత్ర కథ. ఇటీవల బిజెపి వైపు మొగ్గిన కొందరు క్రైస్తవ మతపెద్దలు తమ మతానికి చెందిన యువతులను హెచ్చరించే పేరుతో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. దీన్ని దూరదర్శన్‌లో కూడా ఇటీవల ప్రదర్శించారు. దీంతో ఎంత మంది బిజెపికి ఓటు వేస్తారో తెలియదు. దీనివెనుక ఉన్నవారు ఊహించని విధంగా అదే క్రైస్తవ మతానికి చెందిన వారు మణిపూర్‌లో క్రైస్తవ గిరిజనుల మీద జరుగుతున్న దాడులు, అత్యాచారాల ఉదంతాలతో రూపొందించిన '' అణచివేతకు గురైనవారి ఆక్రందన ''( క్రై ఆఫ్ ద అప్రెసెడ్) పేరుతో రూపొందించిన ఒక డాక్యుమెంటరీని పోటీగా ప్రదర్శిస్తున్నారు. కేరళలో18శాతం మంది క్రైస్తవమతాన్ని అవలంభించే జనం ఉన్నా రు. ముస్లింలు 26.6శాతం ఉన్నారు. మణిపూర్‌లో కుకీ తదితర గిరిజనుల మీద దాడులు జరుగుతున్నప్పటికీ ప్రధాని నరేంద్రమోడీ ఒక్కసారి కూడా ఆ రాష్ట్రాన్ని సందర్శించి బాధితులకు ఊరటగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అక్కడ అధికారంలో ఉన్న బిజెపి హిందూమతానికి చెందిన మెయితీలకు మద్దతుగా ఉందనే విమర్శలు ఉన్నాయి.

కమ్యూనిజం, కమ్యూనిస్టు పార్టీ మీద తప్పుడు ప్రచారం చేసి కేరళలో మెజారిటీ క్రైస్తవుల ఓట్లు పొందటంలో గతంలో కాంగ్రెస్ ఎత్తుగడలు పారాయి. తరువాత పరిస్థితిలో మార్పు వచ్చింది. అనేక చోట్ల కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేస్తున్నారు. ఇప్పుడు బిజెపి కూడా రంగంలోకి దిగి వారిని సంతుష్టీకరించేందుకు చర్చీల చుట్టూ చక్కర్లు కొడుతున్నది.కేరళ స్టోరీ చిత్రాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నది. ఆర్ఎస్ఎస్ అజెండాలో భాగంగానే అధికారాన్ని దుర్వినియోగం చేసి దూరదర్శన్‌లో కేరళ స్టోరీ చిత్రాన్ని ప్రదర్శించినట్లు సిపిఎం, కాంగ్రెస్ రెండూ విమర్శించాయి.తమకేమీ సంబంధం లేదని బిజెపి బుకాయించింది. ఓట్ల కోసం కమలనాధులు దేనికైనా సిద్దపడుతున్నారు. కేరళలో 2019లో ఇరవై స్థానాలకు గాను కేవలం ఒక్కచోటే సిపిఎం గెలిచింది. ఈ సారి పరిస్థితులు భిన్నంగా ఉన్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతించాలన్న సుప్రీం కోర్టు తీర్పును ఎల్‌డిఎఫ్ సమర్ధించింది. దానికి తోడు కేంద్రంలో రెండవసారి నరేంద్రమోడీ అధికారంలోకి రాకుండా ఉండాలంటే సమర్థవంతంగా ఎదుర్కోగలిగింది కాంగ్రెస్ మాత్రమే అని జనం నమ్మటం, వయనాడు నుంచి పోటీ చేస్తున్న రాహుల్ గాంధీ గెలిస్తే ప్రధాని అవుతారన్న ప్రచారం కాంగ్రెస్ గెలుపుకు దోహదం చేశాయి. తరువాత 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శబరిమల వివాదం ఎలాంటి ప్రభావం చూపలేదు. కేంద్రంలో బిజెపికి వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిలో సిపిఎం, సిపిఐ కూడా భాగస్వాములుగా ఉండటంతో ఎవరు గెలిచినా బిజెపిని వ్యతిరేకించే వారే గనుక గతంలో మాదిరి బిజెపిని గట్టిగా వ్యతిరేకించే ముస్లింలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపే అవకాశం లేదని, ఎవరు గట్టిగా నిలబడతారని భావించే వారికి ఓటు వేయనున్నారని సాధారణంగా కమ్యూనిస్టులను వ్యతిరేకించే ప్రముఖ పత్రిక మళయాళ




మనోరమ ఒక సమీక్షలో పేర్కొన్నది.

ముందే చెప్పినట్లు 2019లో జరిగిన ఎన్నికలలో శబరిమల వివాదం మీద కమ్యూనిస్టు వ్యతిరేకతను పెద్ద ఎత్తున రెచ్చగొట్టారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ కూటమికి (48.48శాతం) 96,29,030 ఓట్లు, 19 సీట్లు వచ్చాయి. ఎల్‌డిఎఫ్ కూటమికి (36.29శాతం) 71,56,387ఓట్లు, ఒక సీటు వచ్చింది. బిజెపి కూటమికి (15.64 శాతం) 31,71,792 ఓట్లు వచ్చాయి. తరువాత రెండు సంవత్సరాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్‌కు 1,05,55, 516 ఓట్లు (45.43శాతం), కాంగ్రెస్ కూటమికి 81,96,813 ఓట్లు (39.47శాతం)రాగా బిజెపి కూటమి ఓట్లు 23,54, 468 (12.41 శాతం) వచ్చాయి. నరేంద్రమోడీ రెండవసారి మరింత బలంగా అధికారానికి వచ్చారని, తమ బలం పెరిగిందని, అసెంబ్లీ ఎన్నికల్లో 35 సీట్లతో తాము అధికారానికి వస్తున్నట్లు బిజెపి ప్రచారం చేసుకుంది. అంతకు ముందు ఉన్న ఒక్క సీటూ పోయింది. 2016 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే 2.55శాతం, 2019 పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే 3.23శాతం ఓట్లు కోల్పోయింది. ఇప్పుడు ఐదు సీట్లు తెచ్చుకుంటామని, పదేండ్లలో రాష్ట్రంలో అధికారానికి వస్తామని బిజెపి నేత ప్రకాష్ జవదేకర్ చెబుతున్నారు. గతంలో నరేంద్రమోడీ పలుకుబడి, శబరిమల వివాదంపై రెచ్చగొట్టుడు దానికేమీ లాభించలేదు.

**శైలజా టీచర్‌పై ముగ్గురు శైలజల పోటీ!**
**సిఎఎ ప్రస్తావనకు భయపడిన కాంగ్రెస్ !!**

కేరళ లోక్‌సభ ఎన్నికలు మొత్తంగా ఆసక్తి కలిగిస్తున్నప్పటికీ సిపిఎం అభ్యర్థిగా వడకర స్థానం నుంచి పోటీ చేస్తున్న ప్రస్తుత ఎంఎల్‌ఎ కె కె శైలజ టీచర్ మీద అదే పేరు గలిగిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరపున పాలక్కాడ్ ఎంఎల్ ఎ షఫీ పరంబి రంగంలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల ఎల్‌డిఎఫ్ ప్రతినిధులు గెలిచారు. కన్నూరు లోక్‌సభ పరిధిలోని మట్టనూర్ అసెంబ్లీ నుంచి కెకె శైలజ రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 61వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. తాము అధికారంలోకి వస్తే వివాదాస్పద సిఎఎ(చట్టం)ను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో దాని ఊసెత్తలేదు. ప్రశ్నించిన విలేకర్లతో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సతీశన్ ఇంకేదైనా ప్రశ్న ఉండే అడగండని సమాధానాన్ని దాటవేశారు. పిసిసి తాత్కాలిక అధ్యక్షుడు ఎంఎం హసన్ మాట్లాడుతూ మేము అ చట్టాన్ని రద్దు చేయాలని ఆసక్తితో ఉన్నాం అయితే సిపిఎంను మెప్పించేందుకు దాన్ని మానిఫెస్టోలో చేర్చాల్సిన అవసరం లేదు. మార్క్సిస్టులు చెప్పినట్లు మానిఫెస్టోను రాయాల్సిన అవసరం లేదన్నారు.

**కుక్కలా మొరుగుతున్నారని తండ్రిని తూలనాడిన కొడుకు !**

పత్తానంతిట్ట నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు ఓడిపోవటం ఖాయమని, అక్కడ పోటీచేస్తున్న కాంగ్రెస్ గెలుస్తుందని కేరళ మాజీ సిఎం ఎకె ఆంటోనీ చెప్పారు. కుటుంబం రాజకీయాలు వేరువేరని తాను తొలి నుంచి చెబుతున్నానని తన పిల్లల గురించి ఎక్కువగా అడగవద్దని అన్నారు. కాంగ్రెస్ నేతల పిల్లలు బిజెపిలో చేరటం తప్పిదమన్నారు. ఆరోగ్య సమస్యల కారణంగా పత్తానంతిట్ట ప్రచారానికి వెళ్లటం లేదని అన్నారు. కేరళ లో శబరిమల సమస్య ముగియటంతో బిజెపి స్వర్ణయుగం ముగిసిందని అన్నారు. తన తండ్రి చేసిన వ్యాఖ్యల పై కుమారుడు అనిల్ ఆంటోనీ స్పందిస్తూ గాంధీ కుటుంబం కోసం నిలబడుతున్నవారినిచూసి విచారిస్తున్నానని, కాలంచెల్లిన నేతలు మాత్రమే కాంగ్రెస్‌లో ఉన్నారని అన్నారు. తండ్రి పట్ల అనిల్ అంటోనీ మర్యాదను చూపాలని తిరువనంతపురం కాంగ్రెస్ అభ్యర్థి శశిధరూర్ సలహా ఇచ్చారు. బిజెపి నేతల భాషతో తాను పోటీపడలేనన్నారు.

**బిజెపి ప్రచార తీరు ఇదా !**

వయనాడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పోటీ చేస్తుండగా ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా సిపిఐ జాతీయ మహిళానేత అన్నీ రాజా బరిలో ఉన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె సురేంద్రన్ కూడా ఇక్కడ పోటీ చేస్తున్నారు.తాను గెలిస్తే నియోజకవర్గంలోని సుల్తాన్ బాతరీ పేరును గణపతి వట్టం అని మారుస్తానని ప్రచారం చేస్తున్నారు. టిప్పు సుల్తాన్ ఈ ప్రాంతంలోని ఒక పాడుపడిన జైన ఆలయంలో తన ఫిరంగులను ఉంచి బ్రిటీష్ వారి మీద యుద్ధం చేశాడు. దాంతో బ్రిటీష్ వారు ఆ ప్రాంతాన్ని సుల్తాన్ బ్యాటరీ అని పిలిచారని తరువాత అదే సుల్తాన్ బాతరీగా మారిందని చెబుతున్నారు. అక్కడ ఒక చిన్న గణపతి ఆలయం ఉందని, అందువలన గణపతి వట్టం అని కూడా పిలిచారని కొందరు చెబుతారు. ఇది టిప్పు సుల్తాన్ ప్రాంతం కాదు గనుక గణపతివట్టంగా పేరు మార్చాలని బిజెపి నేత చెప్పారు. ఎన్నికల్లో చెప్పుకొనేందుకు ఏమీలేక బిజెపి జోకులు పేలుస్తోందని కాంగ్రెస్ నేతలు కొందరు అపహాస్యం చేశారు.

# మోదీ పాలనపై కార్మికసంఘాల సమరశంఖం



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వానికి పదేళ్లు నిండాయి. 'అచ్చేదిన్' 'మేక్ ఇన్ ఇండియా' 'స్వచ్ఛభారత్' 'స్వదేశీ' లాంటి వాగాడంబర నినాదాలతో అధికారంలోనికి వచ్చిన మోడీ బిజెపి ప్రభుత్వం నగ్న స్వరూపం బట్టబయలైంది.

'మేడిపండు చూడు మేలిమై ఉండుపొట్ట విప్పి చూడు పురుగులుండు' అన్నట్లు బిజెపి ప్రభుత్వ పాలనంతా 'కార్పొరేటీకరణ కాషాయీకరణ' తప్ప ఏమీ కానరావడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సామాన్య ప్రజలు, శ్రమ జీవులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలైన, నిత్యావసర ధరలు తగ్గింపు గాని, ఉపాధి అవకాశాల పెంపుగాని మచ్చుకైనా లేవు. దేశంలో సమాంతరంగా నడుస్తున్న నల్లధనం బయటకు తీసుకొస్తానని, పెద్ద నోట్ల రద్దుచేసి ప్రతి పేద కుటుంబానికి రూ.15లక్షలు బ్యాంక్ అకౌంట్లో వేస్తానని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, జిఎస్‌టి లాంటి చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టనున్నట్లు పెద్దపెద్ద వాగ్దానాలు చేసి ఆచరణలో చతికిల పడ్డారు. చివరికి ఈ ప్రజా వ్యతిరేక చర్యలే ప్రజల నడ్డి విరిచాయి. పరిశ్రమలు మూతపడ్డాయి. రైతాంగం సంక్షేమంలోనికి నెట్టబడినారు. చిన్న వ్యాపారులు చితికిపోయారు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పతనా వ్యవస్థలోకి జారింది. ధరలను అదుపులో పెట్టలేక ద్రవ్యోల్బణం పెరగటానికి దోహదపడ్డాయి.

**కార్మిక వ్యతిరేక చర్యలు :**

కార్మికుల సమస్యలు వినేందుకు, కార్మిక సంఘాలతో చర్చించేందుకు ప్రతి సంవత్సరం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం ప్రతి ఆరు మాసాలకు ఒకసారి నిర్వహించబడుతుండేది. ప్రతి బడ్జెట్ సమావేశాలముందు ఐఎల్ సి సమావేశము కేంద్ర కార్మిక శాఖ మంత్రి అధ్యక్షతన జరిపి కేంద్ర కార్మిక సంఘాలు పెట్టిన డిమాండ్లపై చర్చించేవారు. 2015 నుండి ఆ సంఘాలతో సమావేశాలు కూడా జరుపుటలేదు. మోదీ ఈ తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యోగ, కార్మిక సంఘాలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ10 ప్రధాన డిమాండ్లతో మెమోరాండం ఇస్తూ దశలవారీగా ఆందోళన చేపడుతూ వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎనిమిది సార్లు సమ్మెలు నిర్వహించడం జరిగింది. 2015–2016 సం. రాలలో కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్త సమ్మెలు, 2017 నవంబర్ 9,10, 11తేదీలలో లక్షలాదిమంది కార్మికులతో ఢిల్లీ పార్లమెం టు స్ట్రీట్‌లో మహా పడావ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 2019 ఎన్నికల ముందు జనవరి 8,9 తేదీలలో రెండు రోజుల సార్వత్రిక సమ్మెలో 10 కోట్లకు పైగా కార్మికులు పాల్గొన్నారు.

2019లో రెండవసారి తిరుగులేని మెజారిటీతో అధికారంలోనికి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ దిగ్గజాలకు తలొగ్గి వేతనాలకు సంబంధించిన చట్టాలను నాలుగింటిని విలీనం చేస్తూ, అదేవిధంగా 49 చట్టాలను నాలుగు కోడ్‌లుగా సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం జరిగే రీతిలో సవరణ చేసింది. మేక్ ఇన్ ఇండియా నినాదాలతో హైర్ & ఫైర్ ( వాడుకుని వదిలేసే) పద్ధతిలో శ్రమజీవులను బానిసలుగా మార్చి నిర్ణయాలు తీసుకుంది. పార్లమెంటులో తమకున్న మందబలంతో, సెప్టెంబర్ 2020లో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలలో సమూలంగా మార్పులు చేయడానికి నిర్ణయించి ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు సభలో లేని సమయములో కొత్త లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టి కనీసం చర్చలు లేకుండా ఏకపక్షంగా ఆమోదించుకుంది.

**మోదీ – బిజెపిని గద్దెదించాలి:**

మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో పదేళ్లుగా విసిగి వేసారిపోయిన కార్మిక సంఘాలు తాడోపేడో తేల్చుకునేందుకు జాతీయస్థాయిలో ఉన్న కార్మిక సంఘాలన్నీ కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక( పిసిటియు)గా ఆవిర్భవించి ఉమ్మడి పోరాటాలు చేస్తున్నవి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ పలు కార్యక్రమాలు చేస్తున్నాయి. భారతీయ మజ్దూర్ సంఘ్ మాత్రం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నది.

ఒకవేళ బిజెపి గనుక మూడోసారి అధికారంలోకి వస్తే ఇక మరిన్ని కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు, చట్టాలను అమలులోకి తెస్తుందని కార్మిక



ఎస్‌కెఎం గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా

సంఘాల ఐక్యవేదిక దృఢంగా విశ్వసిస్తూ.. ఒక ప్రకటన చేశారు. 'దేశంలో కార్మిక సంఘాలకు ఇది 'చావో బతుకో' తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇదే మోదీ గనుక అధికారంలోనికి వచ్చి మూడవసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే 'కార్మికులు పోరాటాలు చేయడానికి కూడా అవకాశం ఉండదు. అందుకే ఈ 18వ లోకసభ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. మోదీ ప్రభుత్వం కార్మికులకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులను హరించి వేస్తుంది. వారికి ఉన్న ఒకే ఒక్క ఆయుధం పోరాటం, శాంతియుత నిరసన మార్గం. ఇక కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా మళ్లీ మోడీ కార్మికులకు దక్కనివ్వరు, సమ్మెలు చేయనివ్వరు.

దేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను నామరూపాలు లేకుండా చేయటం, కార్మిక సంఘాలను నామమాత్రంగా మార్చి వేయడమే మోదీ తెచ్చిన లేబర్ కోడ్స్ ప్రధాన ఉద్దేశం. ఇక ఆయన అధికారం కొనసాగితే ఈ లేబర్ కోడ్స్‌ను పూర్తిస్థాయిలో అమలులోనికి తీసుకొస్తారు. ఇప్పటివరకు కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించడం వల్లనే ఈ నాలుగు లేబర్ కోడ్ల అమలును మోదీప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో వాయిదా వేస్తూ వస్తున్నది.

ఈ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో '**సంకల్ప పత్ర్**' పేరుతో 14 అంశాలతో కూడిన మేనిఫెస్టోను ప్రధాని మోదీ విడుదల చేశారు. ఇందులో దేశ సంపద సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తున్న 47 కోట్ల శ్రామిక వర్గ హక్కుల పరిరక్షణకు కొరకు చేపడుతున్న చర్యలు ప్రకటించలేదు.. ఇది ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చే విధంగా ఉన్నది.. కనీస వేతనాలను సార్వత్రీకరించడమే తమ ఉద్దేశమని, అందరికీ కనీస వేతనాలు అమలు చేయడమే తమ లక్ష్యమని, అదే విధంగా కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పిస్తామని, కార్మికుల పని పరిస్థితులను మెరుగు పరుస్తామని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి పొంతన లేదు.

అయితే కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదికలో ఉన్న పది జాతీయ కార్మిక సంఘాలుమాత్రం మోడీ ప్రభుత్వం దేశంలో ఆధునిక బానిసత్వాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని (పిసీటియు) స్పష్టమైన అభిప్రాయాలతో ఉంది.ఈ 10 సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం అవిశ్రాంతంగా కార్మిక సంఘాలపై దాడులు చేస్తూనే ఉందని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఎఐటియుసి, ఐఎన్ టియు సి, హెచ్ ఎంఎస్, సిఐటియు, ఎస్ఐడబ్ల్యూఎ, ఎఐసిసిటియు, ఎపిఎఫ్, యుటియుసిలు ఈ ఐక్యవేదికలో సభ్యులుగా ఉన్నాయి. వీటితోపాటు స్వతంత్ర సంఘాలు, సమాఖ్యలు కూడా సభ్యులుగా ఉన్నాయి. కార్మికుల పని పరిస్థితులను దిగజార్చేందుకు, వారి ఉద్యోగ భద్రత సామాజిక భద్రతను దెబ్బతీసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నందువల్లనే కార్మికులు పోరాటాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పిసీటియు చెబుతున్నది.

**రైతు–కార్మిక సంఘాలు ఐక్య వేదిక:**
దేశంలో మొదటిసారిగా రైతు సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తో కేంద్ర కార్మిక సంఘాలు మమేకమయ్యాయి. మోడీ పార్లమెంటులో వ్యవసాయ చట్టాలను వెనుకకు తీసుకుంటున్నామని ప్రకటించినప్పటికీ వాటినే కొనసాగిస్తు న్నందున రైతు సంఘాల వేదిక, కార్మికులు, కర్షకులు సంయుక్తంగా ఉద్యమాలకు పిలుపునిస్తున్నారు.

ఇటీవలనే అంటే ఫిబ్రవరి 16వ తేదీన పిసిటియు ఎస్‌కెఎంలు సమిష్టిగా దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు పిలుపు ఇచ్చాయి. ప్రభుత్వం డ్రోన్ల ద్వారా బాష్పవాయు ప్రయోగం, లాటిచార్జి చేసి కార్మికులను,కర్షకులను అణిచివేసేందుకు ప్రయత్నించింది. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోనికి వచ్చేందుకు మోడీ గ్యారెంటీ పేరుతో ప్రజలను తప్పుతో పట్టించే ప్రయత్నం చేస్తున్నది. 'వికసిత భారత్', రామరాజ్యం గురించి భ్రమలు సృష్టించి ,..ధరల పెరుగుదల, నిరుద్యోగం మొదలైన రోజువారీ సమస్యల నుండి దృష్టిని మళ్లించడం ద్వారా ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఆగ్రహాన్ని తటస్థం చేయాలని భావిస్తుంది.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలతో విసిగి వేసారి పోయిన కార్మిక సంఘాలు ఈ ఎన్నికల్లో 'మోడీ హటావో–దేశ్ కో బచావ్' పిలుపు నిచ్చాయి.

# మనిషిపక్షాన గొంతెత్తిన పేరలింగం



అతనొక నిత్యచైతన్య ఉద్యమ తరంగం. పేరు దేవగుప్తపు పేరలింగం. రాజమండ్రిలో ఒక సాధారణ కార్మికుడు. ఎక్కువగా చదువు కోలేదు. కానీ, ఆయన కృషి గురించి తెలుసుకుంటే గొప్ప గొప్ప విద్యావేత్తలు సైతం సిగ్గుతో తలదించుకోవల్సిందే! ఇప్పుడు ఆయన వయసు ఎనభై సంవత్సరాలు. జీవిత కాలమంతా ఒంటరిగానే సైన్సుహేతువాద ప్రచారంలో తలమునకలై గడిపారు. తనసైకిల్కు 'హేతువాద చైతన్యరథం' అని బోర్డు తగిలించుకుని, వెనక సీటుమీద పుస్తకాల సంచి పెట్టుకుని, గోదావరి జిల్లాలో ఊరూరా తిరిగేవారు. గ్రామీణ ప్రజల్లో మూఢనమ్మకాలు తగ్గించడానికి జీవితాన్ని ధారపోశారు. నిక్కరు, ఆఫ్ షర్టు వేసుకుని, కాళ్లకు స్లిప్పర్స్‌తో సైకిల్‌మీద మారుమూల గ్రామాలన్నీ తిరిగే పేరలింగాన్ని ఆ ప్రాంతంలో అందరూ గుర్తుపడతారు. 1942 సెప్టెంబరు 6న దేవగుప్తపు పేరలింగం ఒక పేద వడ్రంగి కుటుంబంలో జన్మించారు. ఆ రోజుల్లో వారికి చదువుకునే అవకాశం లేదు. అయినా, అంతర్గతంగా అక్షరాలపట్ల పొంగుకొచ్చిన ప్రేమాభిమానాలవల్ల తెలుగు అక్షరాలు నేర్చుకోగలిగారు.

ఉన్నత విద్య సాధించలేకపోయినా తన పరిమితమైన పరిజ్ఞానంతోనే ప్రశ్నించడం నేర్చుకున్నారు. ప్రశ్న ఆయనలో శోధన శక్తిని తట్టిలేపింది. ఆ ప్రశ్నతో, ఆ శోధనతో హేతువాదిగా మారారు. 1980లలో రాజమండ్రి హేతువాదానికి మంచి కేంద్రంగా ఉండేది. రావిపూడి వెంకటాద్రి, పెన్మెత్స సుబ్బరాజు, కత్తి పద్మారావు మొదలైన వారంతా రాజమండ్రి సుబ్రహ్మణ్య మైదానంలో సభలునిర్వహించేవారు. వేల సంఖ్యలో జనం హాజరయ్యేవారు. ఆ వేల మందిలో ఈ డి.పేరలింగం ఒకరు. ఆ ఒక్కడు ఒక్కడిగా మిగిలిపోలేదు. ఒక్క దీపం వందలవేల దీపాలు వెలిగించినట్లు ఆ ఒక్కడే, తను సముపార్జించిన హేతువాద పరిజ్ఞానం ఊరూరా తిరిగి ప్రచారంచేయడం ప్రారంభించారు. ఆ రోజుల్లో గాలి శేషగిరిరావు అనే ప్రసిద్ధ ప్రవచనకారుడు ఉండేవారు. హేతువాదులంతా కలిసి, అదే సుబ్రహ్మణ్య మైదానంలో ఆ ప్రవచనకారుడి బండారం ప్రజల ముందుపెట్టారు. అది కళ్లారా చూసిన పేరలింగం తన ప్రచారకార్యక్రమాలకు రూపకల్పన చేసుకున్నారు. ఒకసారి అనారోగ్యంతో కదలకుండా ఇంటిపట్టున ఉండాల్సివస్తే, ఆయన ఆ సమయాన్ని పుస్తక పఠనానికి, అధ్యయనానికి వినియోగించారు. సమయం వృధాచేయకుండా తన ధ్యేయానికి అనువుగా మలచుకున్నారు.

వాస్తవం ఎప్పుడూ వాస్తవమే. అది అబద్ధాలకు లొంగకూడదు. అని నిర్ణయించుకుని, జనంలో తిరగడానికి, హేతువాద ప్రచారానికి ఉద్యమించారు. తనకు తెలిసిన, తను తెలుసుకున్న అంశాలు సరళమైన తెలుగులో రాయడానికి కూడా ప్రయత్నించారు. అలా కొన్ని చిన్న చిన్నపుస్తకాలు తయారయ్యాయి. అయితే అవి అచ్చేయడం ఎలాగో, అవి జనానికి అందించడం ఎలాగో ఆయనకు అప్పటికి తెలియదు. అందుకు కావల్సిన డబ్బు కూడా ఆయన దగ్గర లేదు. ఒకసారి రాజమండ్రి దగ్గరలో ఉన్న కడియం మండలకేంద్రంలో హేతువాదులు కలుస్తున్నారని పేరలింగానికి తెలిసింది. అంతే, ఆయన హుటాహుటిన అక్కడికి వెళ్లారు. సైకిల్ మీద ఊరూరూతిరిగి హేతువాదం ప్రచారం చేస్తున్న ఈ పెద్ద మనిషిని అక్కడ కొందరు గుర్తించారు. తను కొన్ని చిరుపొత్తాలు రాశానని అవి ఎలా ఎక్కడ అచ్చేయాలో తనకు తెలియదని ఆయన సభలో చెప్పారు. వెంటనే అక్కడున్న యువకులంతా స్పందించారు. ఉన్న పళంగా నలభైవేలు పోగుచేసి ఇచ్చారు. ప్రజాపత్రిక సంపాదకుడు సుదర్శన్, ఆయన శ్రీమతి దేవి ముందు కొచ్చారు. ప్రచురణ బాధ్యత తమ మీద వేసుకున్నారు. ప్రూఫ్‌లన్నీ స్వయంగా సుదర్శనే చూసేవారు. ఆ రకంగా దేవగుప్త పేరలింగం అనే హేతువాద కార్యకర్త జనానికి రచయితగా పరిచయమయ్యారు. నలభైఏళ్ల క్రితమే తెలుగునాట మనిషి కేంద్రంగా గొంతెత్తిన గళంగా, కలంగా ఆయన నిలబడిపోయారు. ఆరు ఏడేళ్లకాలంలో పదికి పైగా పుస్తకాలు ప్రచురించారు.

**ఆయన పుస్తకాల శీర్షికలు కొన్ని ఇలా ఉన్నాయి.**

1. ప్రాచీన కులసంస్కృతి సామాజిక ప్రగతి 2. ఓ మహిళా నీకు మతమెందుకమ్మా? 3. సైన్సు ప్లస్ మూఢనమ్మకాలు

4. బైబిల్ శాస్త్రీయం విశ్లేషణ 5. ఆది మానవుడు మొలకు ఆకులు కట్టుకున్నది సిగ్గువల్ల కాదు. 6. మతతత్వం స్త్రీ వ్యక్తిత్వం 7. పట్టువదలని హేతువాది విక్రమార్కుడు పేరలింగంస్వగతం (జీవితచరిత్ర) 8. మంత్రాల్లో దాగిఉన్న బూతుల మర్మం 9. వరూధిని వివాహం హేతువాద సూక్తులు 10. శ్రీ వేంకటేశ్వర సుప్రభాత శృంగారం 11. పాకలపాటి వారి సంక్షిప్త చరిత్ర.

ఈ పుస్తకాల శీర్షికలు చూస్తేనే ఆయన ఆలోచనా ధోరణి, వ్యక్తిత్వం కొంతలోకొంత అర్థమవుతుంది. ఆయనకు ఇప్పుడు ఎనభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా అభ్యుదయ ప్రజా సంఘాల ఐక్య సమాఖ్యరాజమహేంద్ర వరం (ఫోన్:903209442/ 9502654774) వారు రాజమండ్రిలోని ప్రదీప్ కేర్ ఆసుపత్రిలో 2022సెప్టెంబరు 4న అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీవనసాఫల్య పురస్కారం అందించారు. ఇలాంటి నిస్వార్థ జీవుల్నిగుర్తించి గౌరవించుకోవడం మనకర్తవ్యం. ఎటు నుండి ఏ ఆధారమూ లేని పేరలింగం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్యపు పెన్షన్‌తో ప్రస్తుతం జీవనం సాగిస్తున్నారు. అలాంటి నిస్సహాయ పరిస్థితుల్లో ఉండికూడా నేటి కేంద్రప్రభుత్వ పెద్దలు పెంచి పోషిస్తున్న మతోన్మాదాన్నిఎదుర్కొని నిలబడటం మాటలు కాదు గదా? ఎక్కువగా చదువుకోనందుకు, వడ్రంగి కార్మికుడిగా జీవనం సాగిస్తున్నందుకు, దయనీయమైన స్థితిలో ఉండి కూడా హేతువాదం మాట్లాడుతున్నందుకు భూ స్వాములు, ధనవంతులు, అగ్రవర్ణాల వారినుండి ఎన్నో అవమానాలు ఎదురయ్యేవి. ఓపికగా పేరలింగం అన్నింటినీ సహించారు. నిశ్శబ్దంగా తన పనిలో తాను నిమగ్నమయ్యేవారు. తలవంచుకుని వెళ్లిపోయేవారు. విద్యావంతులైన మూర్ఖుల్ని ఎదుర్కొని చలాకీగా తిప్పికొట్టగల సామర్థ్యం లేనందువల్లవక్తగా, రచయితగా గుర్తింపు పొందే అవకాశం లేక చాలాకాలం కార్యకర్తగానే జనంలో ఉండిపోయారు. అలా కూడా ఎన్నో దాడులకు, బెదిరింపులకు గురయ్యారు. అయినా గత మూడు దశాబ్దాలుగా ఆయన ఎన్నడూ అధైర్యపడలేదు. వెనకడుగు వేయలేదు. అమాయక గ్రామీణుల మెదళ్లలో ప్రశ్నలు మొలిపిస్తూ సనాతన సంప్రదాయాల మోసాలు బట్టబయలు చేస్తూ, తన చైతన్య రథాన్ని ముందుకు దూకించేవారు. నిజానికి అది చాలా గొప్ప విషయం ఇప్పటికీ మనం అనుసరించాల్సిన అంశం ఇదే. పేరలింగం వలె గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు విస్తృతంగా తిరిగి, విద్యార్థుల్ని, అక్కడిపౌరుల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

ఒకవైపు ఒక చక్కటి సైన్సుగ్రంథాలయం నెలకొల్పి, పదిమందికి జ్ఞానం పంచుతూ, మరోవైపు దైవ మహిమలు చూపినవారికి లక్షరూపాయల బహుమతి ఇస్తానని ఛాలెంజ్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆర్థికంగా ఏ మాత్రం నిలదొక్కుకోని జీవితంతో పోరాడుతూ, హేతువాద విషయం వచ్చేసరికి ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఉండగలగడం ఆయన నిబద్ధతకు, నిజాయితీకి నిదర్శనం! పేరలింగం గారు తన ముగ్గురు కొడుకులకు హేతువాదపద్ధతిలో వివాహాలు జరిపించారు. ఎన్ని ఆరోగ్య సమస్యలున్నా, వినికిడి శక్తి బాగా కోల్పోయినా, ఆయన తన ధ్యేయంనుండి తన దృష్టి మరల్చడంలేదు. ఒక ఆదర్శానికి కట్టుబడి జీవించడం మనం సమకాలీనంలో అరుదుగా చూస్తాం. అలాంటి అరుదైన వ్యక్తుల్లో చాలా అరుదైనవారు దేవగుప్తపు పేరలింగం. సామాన్యుల్లో అసామాన్యుడు. (ఏప్రిల్ 14న రాజమండ్రిలో ఆయన మరణించారు)

డా. దేవరాజు మహారాజు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

## యుపిఎస్‌సి ఫలితాల్లో మోనికాకు 487వ ర్యాంక్



ప్రజాపక్షం/హైదరాబాద్: యుపిఎస్‌సి విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ తుది ఫలితాలలో హైదరాబాద్ ఎస్.ఆర్.శంకరన్ అకాడమీకి సంబంధించిన తెలుగు సాహిత్య విద్యార్థిని మోనికా అడుసుమిల్లి (హాల్ టికెట్ నెం. 6210733) అఖిల భారత స్థాయిలో 487వ ర్యాంక్ సాధించింది. మోనికా ర్యాంక్ సాధించడం పట్ల ఎస్ఆర్ శంకరన్ అకాడమీ చైర్మన్ నంద్యాల నరసింహారెడ్డి, సలహాదారు వై.సత్యనారాయణ, ప్రిన్సిపల్ కె.సురేందర్‌రెడ్డితో పాటు అకాడమీ ఫ్యాకల్టీ అభినందనలు తెలియజేశారు.

## సివిల్స్‌లో మెరిసిన కరీంనగర్ జిల్లా వాసులు

### వెలిచాల కుర్రాడు నందాల సాయికిరణ్‌కు 27వ ర్యాంకు

### 739 ర్యాంకు సాధించిన కొలనుపాక సహన



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : యూపిఎస్సి పరీక్షల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన ఇరువురు సత్తాచాటారు. మంగళవారం ప్రకటించిన యూపిఎస్‌సి ఫలితాల్లో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన యువకుడు నందాల సాయికిరణ్ దేశంలో అత్యుత్తమ 27వ ర్యాంకు సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. సాయికిరణ్ వెలిచాలలోని సరస్వతీ ఇంగ్లీష్ మీడియంలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. కరీంనగర్‌లోని తేజ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీయిట్ పూర్తి చేశాడు. ఎన్ఐటి వరంగల్‌లో బిటెక్ పూర్తి చేయగా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్ కోచింగ్‌లో సివిల్స్‌కు ప్రిపేరయ్యాడు. ఆది నుంచి ప్రతిభ కనబరిచే సాయికిరణ్ సివిల్స్‌లో సత్తాచాటి ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించి ఎంపికవడం పట్ల కరీంనగర్ జిల్లాకే తలమానికమని అభినందిస్తున్నారు. తండ్రి కాంతారావు క్యాన్సర్‌తో చనిపోయాడు. కాంతయ్య పవర్‌లూం కార్మికుడిగా పనిచేసి కుటుంబాన్ని పోషించాడు. పద్మశాలి కుటుంబంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన సాయికిరణ్ తల్లి లక్ష్మి కొడుకు తో పాటు కూతురు స్రవంతి ఆలనాపాలనా చూసుకుంది. బీడిలు చుడుతూ కష్టపడి చదివించింది. సాయికిరణ్ అక్క స్రవంతి కష్టపడి చదివి ఇరిగేషన్‌లో ఏఈగా ఉద్యోగం చేస్తోంది. పిల్లల ఉన్నతిని చూసి కన్నతల్లి గర్వపడుతోంది. లక్ష్యాన్ని చేరుకోవడానికి పేదరికం అడ్డుకాదని సాయికిరణ్ నిరూపించాడు. పిల్లలిద్దరూ చదువుల్లో రాణించి పెద్ద ఉద్యోగాలు సాధించడం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

### సహనకు 739వ ర్యాంకు



యుపిఎస్‌సి ఫలితాల్లో కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక సహన 739వ ర్యాంకు సాధించింది. కొలనుపాక గీత, అనిల్ దంపతుల కూతురైన సహన స్థానిక కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో టెన్త్, శ్రీ గాయత్రి జూనియర్ కాలేజీలో ఇంటర్, హైదరాబాద్‌లోని జేఎన్‌టియులో ఇంజనీరింగ్ కంప్లీట్ చేసింది. తర్వాత ఢిల్లీలో యూపిఎస్‌సి కోచింగ్ తీసుకుంది. ప్రిలిమినరీ, మెయిన్స్ ఫలితాల్లో క్వాలిఫై అయ్యాక ఢిల్లీలో మాక్ ఇంటర్వ్యూలు అటెండయ్యారు. సహన తండ్రి కొలనుపాక అనిల్ జయశంకర్ వెలుగు పత్రికలో కరీంనగర్ టౌన్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. కరీంనగర్ కలెక్టర్ పనిచేసిన ఐఏఎస్ ఆఫీసర్ స్మితాసబర్వాల్ స్ఫూర్తితో కలెక్టర్ కావాలని స్కూలింగ్‌లోనే నిర్ణయించుకున్నట్లు సహన వెల్లడించారు. పేరెంట్స్ సహకారంతో ప్రిపేర్ అయ్యాయని, కలెక్టర్ అయి పేద ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాంకుకు సివిల్స్‌లో ఐఏఎస్ కాకుండా మరొక సర్వీస్‌లో జాబ్ వస్తుందని, అందులో జాయిన్ అయ్యాక ఐఏఎస్ సాధించేందుకు మళ్లీ యూపిఎస్‌సి పరీక్ష రాస్తానని వెల్లడించారు.

## ఐపిఎస్‌కు రావూరి సాయిఅలేఖ్య



ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ రావూరి ప్రకాశరావు కుమార్తె రావూరి సాయి అలేఖ్య యూపిఎస్సీ సివిల్ సర్వీస్ 2023 ఆల్ ఇండియా లెవెల్‌లో 938వ ర్యాంకు సాధించి ఐపిఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. సాయి అలేఖ్య చిన్నతనం నుండే ఐపిఎస్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివింది. తల్లిదండ్రులు తన లక్ష్యాన్ని గౌరవించి చదువులో ప్రోత్సహించారు. అలేఖ్య తండ్రి రావూరి ప్రకాశరావు మధిర పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. గత ఏడాది మే 28 ప్రిలిమ్స్ నిర్వహించారు. ప్రిలిమ్స్ పరీక్షలు క్లియర్ చేసిన వారికి సెప్టెంబర్ 15,16,17,23,24 తేదిలో దశల వారిగా మెయిన్స్ పరీక్ష నిర్వహించి డిసెంబర్ 8న మెయిన్స్ ఫలితాలు విడుదల చేశారు. మెయిన్స్ సత్తా చాటిన వారికి జనవరి 2, ఏప్రియల్ 9 మధ్య వివిధ దశల్లో పర్సనల్ ఇంటర్వ్యూల్ నిర్వహించి తాజాగా తుది ఫలితాలు ప్రకటించారు. సెలెక్ట్ అయినా రావూరి సాయి అలేఖ్యను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రముఖ న్యాయవాది తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, ఏనుగు గాంధీ, జక్కుల రామారావు తదితరులు అభినందలు తెలిపారు.

## రామయ్యకు ఘనంగా ఎదుర్కోళ్లు

ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీరామ వనమి తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రామయ్యకు ఘనంగా ఎదుర్కోళ్లు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంత కుమారితో పాటు జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా, ప్రత్యేకాధికారి నరేంద్ర నిమ్జే, పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సామికి విశేష పూజ, పుణ్యాహవచనం, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో రామ లక్ష్మణులను ఆలయం నుండి గిరిప్రదిక్షణగా వైకుంత ద్వారం వద్దకు తీసుకొచ్చారు. సీతమ్మవారిని మరో పల్లకీలో వైకుంత ద్వారానికి ఎదురుగా ఉన్న మిథిలా స్టేడియం వద్దకు తీసుకొచ్చారు. రామయ్య కీర్తి ప్రతిష్టలు, సీతమ్మవారి గుణగణాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

## నకిలీ స్కీమ్‌లతో మోసపోవద్దు : ఎస్‌పి

ప్రజాపక్షం/నల్లగొండ : మోసపూరితమైన నకిలీ స్కీమ్‌లలో లక్షల్లో పెట్టుబడులు పెడితే డబల్ గిట్టుబాటులు అంటూ చైన్ లింక్ స్కీమ్‌లతో పెట్టుబడులు పెట్టి మోసపోతున్న కేసులు నమోదవుతున్నాయని జిల్లా ఎస్పి చందనా దీప్తి తెలిపారు. ఇలాంటి స్కీమ్‌లతో ఒకరి తరువాత ఒకరు చైన్ లింకులతో పెట్టుబడులు పెట్టిన తరువాత మొదటగా కొంత ఇస్తూ ఆశ చూపించి అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టిన తరువాత అడ్రస్ లేకుండా మాయమైన తరువాత మోసపోయామని పోలీసు స్టేషన్లో ఫిర్యాదులు చాలా వస్తున్నాయని తెలిపారు. సోషల్ మీడియా వాట్సాప్‌ల ద్వారా నిరుద్యోగులను ఆసరా చేసుకుని నకిలీ ఉద్యోగాల పేరిట డబ్బులు వసూళ్లు చేస్తూ మోసంచేస్తున్న కేసులు నమోదయ్యాయి. ఉద్యోగాల పేరిట ఎలాంటి మెసేజ్ వచ్చిన అలాంటి వాటికి స్పందించి మోసపోవద్దన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులను క్లిక్ చేస్తే మీ డేటా మొత్తం తమ అధీనంలోకి తీసుకొని బ్యాంక్ అకౌంట్‌లోని అమౌంట్‌ను లూటీ చేస్తారని, సోషల్ మీడియాలో వచ్చే అనుమానిత లింకులను క్లిక్‌చేసి మోసపోవద్దన్నారు.

# కమిటీలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్



ప్రజాపక్షం/సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికలు జిల్లాలో సజావుగా జరిగేలా నియమించిన కమిటీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్‌పి రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్లు సిహెచ్ ప్రియాంక, బిఎస్ లతతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో ఎంసిసి బృందాలు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లో మద్యం, నగదు, బంగారంతో పాటు ఇతర విలువైన వస్తువులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలీస్, సెక్టార్ అధికారులు సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని, జిల్లాలోని 1201 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టిగ్‌తో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో లోనా, బయటకూడా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నియమించే బృందాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్‌రావు, ఆర్‌డిఓలు సూర్యనారాయణ, వేణుమాధవ్, శ్రీనివాస్, నోడల్‌అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

### రైతులకు రూ. 5.50 కోట్లు చెల్లింపులు

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు జిల్లాలో ఇప్పటి వరకు రూ. 5.50 కోట్ల చెల్లింపులు చేసినట్లు కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు, చెల్లింపులు, మౌలిక వసతుల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ బిఎస్ లతతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు 32,305.000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే ట్యాగింగ్ చేసిన మిల్లులకు పంపాలని, టాబ్ ఎంట్రీలు అదే రోజు జరిగేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత, అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా తార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ధాన్యం డబ్బుల చెల్లింపులో ఇబ్బందులు రాకుండా నియమించబడ్డ మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఓ మధుసూదన్ రాజు, డిఎస్ఓ మోహన్‌బాబు, డిఎంఓ నాగేశ్వర్‌శర్మ, డిఎం రాములు, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రత్లో హెచ్చుతగ్గులను గుర్తించి వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, వివిధ శాఖల అధికారులతో వడదెబ్బపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎండ నుండి రక్షణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని అధికారులను సూచించారు. వడదెబ్బకు గురైన వారు 108కు సమాచారం ఇస్తే సిబ్బంది చికిత్స అందిస్తారన్నారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు పడకలు వడదెబ్బ బారిన పడ్డ వారి కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిడబ్ల్యూఓ వెంకటరమణ, ఎహెచ్ఓఎ కుమారస్వామి, డిపివో కె.సురేష్‌కుమార్, డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ నిరంజన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు 18నుంచి నామినేషన్ల స్వీకరణ

### జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఆ రోజు నుండే నామినేషన్ల స్వీకరణ ఉంటుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నల్లగొండ లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల18 నుండి 25 వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్గొండ కలెక్టరేట్ లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. నల్లగొండ లోకసభ నియోజకవర్గంలో 2061 పోలీస్ స్టేషన్లో 17 లక్షల 22,521 మంది ఓటర్లు ఉన్నారని , వీరిలో 1819 వయసు గ్రూపు వాళ్ళు 60116 మంది ఓటర్లు ఉండగా,85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్స్ 9587 మంది ఓటర్లుగా ఉన్నారని తెలిపారు.ఈ సీనియర్ సిటిజన్స్ కి హోం వోటింగ్ సదుపాయం కల్పించామని చెప్పారు. వీరితో పాటు పిడబ్ల్యుడి ఓటర్స్ 33865 మంది,736 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో ఇప్పటివరకు 184 కేసులలో 9.18 కోట్ల విలువగల నగదు, మద్యం,ఆభరణాలు సీజ్ చేశామని, 3 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు వాడపల్లి నాగార్జునసాగర్ అడవిదేవులపల్లిలో ఏర్పాటు చేసి తనిఖీ పటిష్టం చేశామన్నారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, మీడియా నోడల్ అధికారి ,పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వరరావు, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరాకు పకడ్బందీ చర్యలు : కలెక్టర్ సంతోష్



ప్రజాపక్షం/గద్వాల : జోగులాంబ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా మిషన్ భగీరథ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఆదేశించారు. మంగళవారం తాగునీటి సరఫరాపై కలెక్టరేట్‌తోని తన చాంబర్‌లో మిషన్ భగీరత ఈఈ, డిఈలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రెండు నెలల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని వారికి సూచించారు ముఖ్యంగా మున్సిపల్ అధికారులు అప్రమత్తగా ఉంటూ నీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. హ్యాండ్‌పంపులు, బోర్వెల్స్, మోటార్లలకు మరమ్మతులు ఉంటే వెంటనే చేయించి వాటిని నీటిని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీల్లోని ప్రతి వార్డుల్లో మిషన్ భగీరథ నీళ్ళు వస్తున్నాయో, లేదోఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ బల్క్ వాటర్ అవసరం మేరకు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఈఈ గ్రిడ్ భీమేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్లు, ఈఈలు, డిఈలు, తదితరులు పాల్గొన్నారు.

## బాబ్లీ కేసు విచారణలో కోర్టుకు హాజరైన తెలంగాణ ఎమ్మెల్యేలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బిలోలి సెషన్ కోర్టుకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే హన్మంతు షిండే, కెవిఎస్ రత్నంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగుల, విజయ రమణారావు, ప్రకాష్ గౌడ్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత రైతుల భూములు ఎడారిగా మారుతుంటే చూస్తూ ఉండలేక ఆనాడు బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టడం జరిగిందని అన్నారు. ఉత్తర తెలంగాణ ఎడారి అయితే చూస్తూ ఉండలేకపోయామన్నారు.

# భువనగిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### జగదీష్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం

### సన్నాహక సమావేశంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/భువనగిరి : అవినీతికి పాల్పడి వేల కోట్లు ప్రజాధనాన్ని దోచుకున్న కెసిఆర్ కుటుంబంతో పాటు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని సైతం జైలుకు పంపడం ఖాయమని భువనగిరి లోక్‌సభ ఇంచార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్న భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పేరుతో జగదీష్‌రెడ్డి రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డాడని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, టెలిఫోన్ ట్యాపింగ్ కేసులలో త్వరలో కెసిఆర్, కెటిఆర్‌తో పాటు యాదాద్రి తర్మల్ పవర్‌స్టేషన్ కుంభకోణంలో జగదీశ్వర్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని, బిఆర్ఎస్ పార్టీకి చెందిన అలిబాబా 40 దొంగల పార్టీగా మారిందని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను ఓడించినా జగదీశ్వర్‌రెడ్డికి సిగ్గు రాలేదన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే తనపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లలో అక్రమాలు, కరెంట్ కొనుగోళ్ల దోపిడీని బయట పెడుతున్నారనే కోపంతో జగదీష్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిరణ్ కుమార్‌రెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షించారు.



### నేను లోకల్ : చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

తాను జిల్లావాసిని కాదని బిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు తనపై తప్పుడు ఆరోపణల చేస్తున్నారని, నేను ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసినని నన్ను గెలిపిస్తే 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తానని కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విమర్శించారు. 24 సంవత్సరాలు పార్టీకి చేసిన సేవలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా తనకు అవకాశమిచ్చిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోత్తంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, పచ్చిమట్ల శివరాజ్ గౌడ్, కుంభం కీర్తిరెడ్డి, కూర వెంకటేశ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అసమర్థతతో బలపడుతున్న బిజెపి

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్



ప్రజాపక్షం/ఖమ్మం : కాంగ్రెస్ అసమర్థతతోనే బిజెపి బలపడుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. బిఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం పువ్వాడ అజయ్‌కుమార్ స్వగృహంలో మంగళవారం నగర బిఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పే దానికి, చేసే దానికి పొంతన ఉండదని పార్టీ ఫిరాయింపులపై ప్రజల ముందు మేనిఫెస్టోలో అనర్హత వేటు వేస్తామని గొప్ప గొప్ప మాటలు చెప్పి కొద్ది గంటల్లోనే ఇతర పార్టీలకు చెందిన ఎంఎల్‌ఎలను చేర్చుకున్నారని ఇది కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. అలవి కాని హామీలను గుప్పించి గత ఎన్నికల్లో ప్రజలను వంచించిందని మోసపూరిత వాగ్దానాలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారని తెలిపారు. బంగారం లాంటి కెసిఆర్ పాలనను వదులుకున్నారని ఇప్పుడు ఎంపి ఎన్నికల రూపంలో మరో అవకాశం వచ్చిందని ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామ నాగేశ్వరరావును గెలిపించాలన్నారు. ఖమ్మం పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను తరలించడం అనాలోచిత చర్య అని అజయ్‌కుమార్ తెలిపారు. కెసిఆర్ ముందు చూపుతో 500 పడకల ఆసుపత్రికి అతి సమీపంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారని ఈ జిల్లాలో వేరే చోట ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు కళాశాలకు అనుబంధంగా ఆసుపత్రి ఉండాలన్న లక్ష్యంతో తాను మంత్రిగా అక్కడ ఏర్పాటు చేశానని ఆసుపత్రికి, కళాశాలకు మధ్య ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సరిపోతుందన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చిన 100 రోజుల్లోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ ఇబ్బందులు పోవాలంటే ఎంపిగా బిఆర్ఎస్ అభ్యర్థి గెలవాలన్నారు. ఎంపి అభ్యర్థి, ప్రస్తుత సిట్టింగ్ ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి ఎంపిలు ఏనాడు తెలంగాణ నిధులు, సమస్యలు, ప్రాజెక్టుల గురించి మాట్లాడలేదన్నారు. తనకు ఓటేసి గెలిపిస్తే అండగా ఉంటానన్నారు. సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, వీరునాయక్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# డబ్బులు పంచకుండా ఓట్లు అడుగుదాం

### పదవుల మీదున్న చిత్తశుద్ధి అభివృద్ధిపై లేకపాయె

### బిజెపి ఎంపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



ప్రజాపక్షం/నల్లగొండ : పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచకుండా ప్రచారం చేద్దాం.. ప్రజలు ఎవరిని విశ్వసించి గెలిపిస్తారో తేల్చుకుందామని అందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమా అంటూ బిజెపి భువనగిరి పార్లమెంటు అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ సవాల్ విసిరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు కుటుంబాలే రాజకీయాలను శాసిస్తున్నాయని, అందులో కోమటిరెడ్డి బ్రదర్స్ కేవలం పదవులు, కాంట్రాక్టులకు తప్పా జిల్లా అభివృద్ధి కోసం ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మునుగోడు ఎంఎల్‌ఏ రాజగోపాల్‌రెడ్డి ఎంపిగా, ఎంఎల్‌సిగా, ఎంఎల్‌ఏగా గెలుపొంది ఆ నియోజకవర్గానికి, జిల్లాకు ఎన్ని నిధులు తెచ్చి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించి ఓట్లు అడగాలన్నారు. తాను భువనగిరి ఎంపిగా గెలుపొంది సుమారు 9 వేల కోట్ల రూపాయలతో భువనగిరి నియోజకవర్గానికి ఎంతో అభివృద్ధి చేశానని, మళ్లీ అభివృద్ధి చేసేందుకు ఎన్నికల బరిలో నిలబడ్డానన్నారు. జిల్లాలో నక్కలగండి, ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం సాగునీటి ప్రాజెక్టులతో పాటు పిల్లాయిపల్లి, ధర్మారెడ్డికాలువ పనులు పూర్తి చేయడంలో గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఉచిత హామీలతో మళ్లి ప్రజలను మభ్యపెట్టి పార్లమెంటు ఎన్నికల్లో గెలువాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని, ఆ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని, 400 సీట్లతో మూడోసారి మోదీ ప్రధానమంత్రి అవ్వడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్, కిసాన్‌మోర్చ నాయకులు గోలి మదుసూధన్‌రెడ్డి, పిల్లి రామరాజు, పోతెపాక సాంబయ్య, బీపంగి జగ్జీవన్, దోనూరు వీరారెడ్డి, దూదల బిక్షం గౌడ్, లింగస్వామి ఉన్నారు.

## ఉపాధి పనుల వద్ద వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి

### కూనంనేని సాంబశివరావు

### వడదెబ్బతో మృతిచెందిన ఉపాధి కూలీ వెంకటమ్మకు నివాళి



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : వడదెబ్బకు గురై చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ గిరిజన మహిళా బూరుగు వెంకటమ్మ (55) మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా పెనుబల్లి గ్రామంలోని వెంకటమ్మ గృహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అధికారులు పనులు జరిగే ప్రాంతాల్లో వేసవి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వారికి కావాల్సిన రెస్టు షెల్టర్లు, టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రాథమిక చికిత్స కిట్టు అందుబాటులో ఉంచాలని సూచించారు. జరిగిన సంఘటనను ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు ఉపాధి అధికారులు పనులు జరిగే క్షేత్రాలను సందర్శించి పనులను, రక్షణ చర్యలను పర్యవేక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు ఉపాధి పనులపై దృష్టి సారించి కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలకు ఆదేశించాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీను, నర్సింహారావు, భూలక్ష్మి, భద్రమ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## రాములును పరామర్శించిన గోదా

ప్రజాపక్షం/భువనగిరిరూరల్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి ముదిగొండ రాములును మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములుతో పాటు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ ఆధ్వర్యంలో పరామర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ముదిగొండ రాములుకు పార్టీ అండదండలు ఉంటాయని వారికి మనోధైర్యాన్ని కల్పించారు. సిపిఐ భువనగిరి మండల కార్యవర్గ సభ్యులు ఉడత రాఘవులు, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి చిక్క బిక్షపతి, నాయకులు రాసాల పెంటయ్య, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.



## కార్యకర్తలను కాపాడుకుంటా

ఎంఎల్ఎ యశస్విని రెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు** : పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు అనుమాండ్ల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పల మండలానికి చెందిన 50 మంది బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎంఎల్ఎ యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఎ యశస్విని రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని, పాత, కొత్త కార్యకర్తలనందరికి కలుపుకొని పోతానని, అందరికి సరైన గుర్తింపు వస్తుందన్నారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాదేనని, ఎవరూ అధైర్యపడోద్దన్నారు. ఈకార్యక్రమంలో దేవరుప్పల మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్ల శ్రీరామ్, మాజీ సర్పంచ్‌లు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కడియం కావ్యను గెలిపిద్దాం

వర్ధన్నపేట నియోజకవర్గ ఎంఎల్ఎ కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం హసన్‌పర్తి మండల పరిధిలోని నాగారం గ్రామ పెద్దచెరువు కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లు హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులందరూ కలిసి కష్టపడి నాకు వచ్చిన మెజార్టీ కన్నా ఎక్కువ మెజార్టీ పార్లమెంటు ఎన్నికల్లో తీసుకొచ్చి వర్ధన్నపేట నుంచి అత్యధిక మెజార్టీ సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, గ్రామాధ్యక్షుడు గౌరు రాజిరెడ్డి, మేకల రమేశ్, సందరాజు సంతోష్ పాల్గొన్నారు.

## తేమ శాతం 16కు మించొద్దు



**ప్రజాపక్షం/నర్సాపూర్** : నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్, తూర్తి గ్రామంలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న వరికుప్పలను పరిశీలించి వాటిని తేమశాతం ఎంత వచ్చిందని విషయాన్ని చూశారు. అయితే చాలా వరికుప్పలను తేమ శాతం ఎక్కువగా ఉండటంతో తేమశాతం 16 వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే రైతులు నుండి ధాన్యాన్ని సేకరించాలని ఎటువంటి జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డిఎం, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి తదితరులున్నారు.

## పాఠశాలల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ఏటూర్ నాగారం :** పాఠశాలల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పి సీఈవో రమాదేవి అన్నారు.మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం మండల సమైక్య వివోలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ రమాదేవి, ఎంపీడీవో కుమార్, ఎంఈఓ సురేందర్ లు మాట్లాడుతూ, పాఠశాలల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదన లో 25 శాతం నిధులు ముందస్తు గా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని వినియోగించుకొని పనులు రికార్డ్ చేసిన వారం రోజులలో బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేశామని, నిధులకు ఎటువంటి ఇబ్బంది లేనందున పాఠశాల అభివృద్ధి పనులు అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్** : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం ఘనంగా క్రీడా దినోత్సవం2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పరకాల ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస్, కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం. రాంప్రసాద్, కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి. గోవర్ధన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు.ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో బాలుర విభాగంలో పలు క్రీడలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొంది ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుపొందారని విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో కూడా బాలికల విభాగంలో పలు క్రీడలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొంది ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుపొందారని అభినందించారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థినీ విద్యార్థులు పాటలు, నృత్యాలు, ఏకపాత్రాభినయం తదితర కార్యక్రమాలతో వారి ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు.



# కాంగ్రెస్‌తోనే అరాచక పాలన అంతం

నియోజకవర్గంలో లక్ష మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలి

కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కావ్య, ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** : బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను ఎంపి ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని వరంగల్ ఎంపి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు కెఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి తో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ దేశంలో అరాచక పాలన పోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని అన్నారు. నాడు ఇందిరాగాంధీ పేద ప్రజల సంక్షేమం కోసం గరీబ్ హటావో అనే పథకం చేపట్టి పేద ప్రజలకు మేలు చేసి అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, పోయిన అసెంబ్లీలో నన్ను 50 వేల పైచిలుక మెజార్టీతో గెలిపించారని, మరి రానున్న ఎంపీ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గం నుండి లక్ష మెజారిటీ వచ్చే విధంగా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. కులాల పేరుతో, మతాల పేరుతో ఓట్లు దండుకోవాలని నరేంద్ర మోడీ చూస్తున్నాడని, బీజేపీ లాంటి మతతత్వ పార్టీ నుండి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుఎర్రబెల్లి స్వర్ణ, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపిసిసి అధికార ప్రతినిధి కత్తి వేంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే మోలుగురి బిక్షపతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామ్ నరసింహ రెడ్డి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అశోక్, ఎన్ఎస్ సంపత్‌రావు పాల్గొన్నారు.

## సివిల్స్‌లో ఉమ్మడి వరంగల్ విద్యార్థులు

జయసింహారెడ్డికి 105 ర్యాంకు : ప్రణయ్ కుమార్ 554

సయింపు కిరణ్‌కు 568 ర్యాంకు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి** : యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన పరీక్షల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురికి మంచి ర్యాంకులు వచ్చాయి. వరంగల్ నగరానికి చెందిన జయసింహారెడ్డికి 103 ర్యాంకు రాగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారంకు చెందిన సయింపు కిరణ్‌కు 568 ర్యాంకు వచ్చింది. అలాగే వరంగల్ శివనగర్‌కు చెందిన కోట అనిల్‌కు 764 ర్యాంకు వచ్చింది. దీంతో వారి కుటుంబ సభ్యులు,బంధు మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా జనగామ జిల్లా లింగాలఘనపురం మండల కేంద్రంకు చెందిన కొయ్యా డ ప్రభాకర్ లక్ష్మి మూడవ కుమారుడు కొయ్యాడ ప్రణయ్ కుమార్ అతి చిన్న వయసులో మొదటి ప్రయత్నంలో సివిల్స్ ఐపిఎస్ లో885 ర్యాంక్ సా ధించగా ఇటీవల జరిగిన సివిల్స్ లో ఐఏఎస్ లో554 ర్యాంకు సాధించి ఎం తో మంది పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ లో పాలిటెక్నిక్ పూర్తి చేసి తర్వాత జేఎన్టీయూ కూకట్ పల్లిలో బీటెక్ ఎలక్ట్రానిక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. అనం తరం సివిల్స్ సాధించాలనే పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న బీసీ స్టడీ సర్కిల్లో చేరి సివిల్స్ ఎలాగైనా సాధించాలన్న తపనతో కష్టపడి చదివి సివిల్స్ లో ఐఏఎస్ 554 ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు.

## సింగరేణి ద్వారా రోజు గంట మంచినీరు

పట్టణ అర్బన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ప్రారంభించాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** : భూపాలపల్లిలోని 16వ వార్డు రాంనగర్ కాలనీ లో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ఆవరణలో గల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనుల చేపట్టాలని సంబంధిత మెడికల్, మునిసిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ అదేశించారు. 16వ వార్డులో చెత్త పేరుకు పోయిన ప్రదేశాన్ని సందర్శించి వెంటనే తొలగించాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. తదనంతరం యాదవ నగర్ కాలనీ లో గలా సింగరేణి గనుల నుండి వచ్చే నీటిని వడిసి పట్టి ఫిల్టర్ బెడ్ ద్వారా శుద్దికరణ చేసే 6వ గని లో గల ఫిల్టర్ బెడ్‌ను సింగరేణి అధికారులతో కలిసి సందర్శించి నీటి సామర్థ్యం నీటి శుద్దికరణ, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ఘనపూర్ మండలం గాంధీనగర్ గల మిషన్ భగీరథ ల్యాబ్ ఈ నీటిని పరీక్ష చేసిన తరువాత పట్టణ ప్రజలకు మంచినీరు సరఫరా చేయాలని తగు సూచనలు చేశారు. నీటి శుద్దీకరణ కోసం గోదావరి ఇసుక రవాణా కోసం అన్ని అనుమతులు మంజూరు చేస్తామని ఈ వేసవి కాలం పూర్తయ్యే వరకు సింగరేణి యాజమాన్యం సగటున రోజు ఒక గంట పాటు నల్లా కలెక్షన్ ల ద్వారా నీటి సరఫరా అందించాలని కలెక్టర్ అన్నారు. యాదవ నగర్,కృష్ణ కాలనీ,లకు ఏప్రిల్, మే, జూన్, ఈ 3 నెలలు నీటి సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వేర్, ఏఈ, రోజా, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి




**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి** : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు పాఠశాలలు పునః ప్రారంభమయ్యే లోపు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇఇ పిఆర్ ఆర్ డబ్ల్యు సి మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమవేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు అవసరమైన పాఠశాలల్లో ప్రారంభం కానీ పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం తరగతి గదుల మేజర్ మైనర్ మరమ్మతులు ,టాయిలెట్ మరమ్మతులు బాలికల కోసం అదనపు టాయిలెట్లు నిర్మాణ పనులు , విద్యుత్ సౌకర్యాం ,పెయింటింగ్ వంట మౌలిక వసతుల పర్యవేక్షణ పనులు, పాఠశాలలు పునః ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాల్సిందిగా కోరారు. జిల్లా అధికారులు ,మండల పరిషత్ అధికారులు ,ఇంజనీరింగ్ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరులు, మండల విద్యాశాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ ఐఇఎస్ఎస్‌డి మనోజ్ ,జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ,డిఆర్‌డిఓ జ్యోతి ,ఇఇ పిఆర్ ఆర్‌డబ్ల్యుఎస్ మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం : కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు చట్టవ్యతిరేకమని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డిసిపి సీతారాంతో కలిసి ఇసి అండ్ పీఎన్డీడి యాక్ట్, ప్రభుత్వ, ప్రైయివేట్ హాస్పటల్స్ డాక్టర్లతో ఓరియెంటేషన్ సదస్సు నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిసి, పీఎన్డీటి యాక్ట్ 1994ను సరిగ్గా అమలు చేయాలన్నారు. లింగ నిష్పత్తి శాతానికి పెంచాలని, జిల్లా స్థాయిలో మల్టీ మెంబర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, భ్రూణ హత్యలు చట్ట రీత్యానేరమైనందున పూర్తిగా నివారించాలన్నారు. లింగ నిర్ధారన పరీక్షలు చేసిన వారికి 3 ఏండ్ల జైలు శిక్ష పది వేల జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఈ చర్యల్ని ప్రోత్సహించిన వారికి మూడు ఏండ్ల జైలు శిక్షతో ఆపటు 50వేల జరిమాన విదించడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల స్థాయిలో లింగ నిష్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి హాస్పటల్, స్కానింగ్ సెంటర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, రెగ్యులరేషన్ యాక్ట్ 2010 ప్రకారం అన్ని క్లినిక్‌లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మండల స్థాయిలో ప్రత్యేక టీంలను నియమించాలన్నారు. ఇవోలు, డిఉ్యటి డిఎంహెచ్‌ఓలు ప్రతి హాస్పటల్‌ను పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి హాస్పటల్‌లో రిజిస్టర్లను సరియైన విధంగా నిర్వయించాలని, రిజిస్ట్రేషన్ లేని క్లీనిక్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పటల్‌లో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో సాధారణ డెలిరీల శాతాన్ని పెంచాలని, ప్రజలు దానిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రసూతి మరణాలు, పిపల్లల మరణాలు, ఎక్కడ జరగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్, డిసిహెచ్‌ఎస్ సుగుణాకర్‌రాజు, డిప్యూటి డిఎంహెచ్‌ఓలు, పివోలు, మెడికల్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పటల్స్ డాక్టర్లు పాల్గొన్నారు.



## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

నలుగురిపై కేసు నమోదు

అక్రమంగా బియ్యం తరలిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/అల్లాదుర్గం** : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు అల్లాదుర్గం మండలంలో 54 టన్నుల రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేశారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామ శివారులో సోమవారం టాస్క్ ఫోర్స్ అధికారులు 161 జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించగా ఒక లారీ రెండు డిసిఎంలు ఒక బులెరా వాహనాలలో బియ్యం బస్తాలను తరలిస్తుండగా వాటిని టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఆ వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ బాలస్వామి ప్రెస్ మీట్ నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడించారు. వివరాల్లోకి వెళితే గడి పెద్దాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై అక్రమ రేషన్ బియ్యం ను వాహనాలలో తరలిస్తున్నారని పక్క సమాచారం మేరకు టాస్కోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా నాలుగు వాహనాల్లో 54 టన్నుల 540 క్వింటాళ్ల రేషన్ బియ్యం ను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బీదర్ ఆమనగల్ నిజాంపేట్, వరంగల్ జిల్లా, రంగారెడ్డి జిల్లా, కొండుల్ నుండి రేషన్ బియ్యం వస్తున్నట్లు తెలిసిందని వివరాలను ఎస్పి వెల్లడించారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు 10 లక్షల 80 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన వాహనాల విలువ మొత్తం 23 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ముగ్గురు లారీ డ్రైవర్లు రైస్ మిల్ యజమాని మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ బాలస్వామి వెల్లడించారు. మిల్లర్లు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే మాకు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచబడుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి డాక్టర్ రాజేష్, సీఐ రేణుక రెడ్డి, ఎస్సై ప్రవీణ్ రెడ్డి, టాస్కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 25 నుండి ఓపెన్ స్కూల్ పరీక్షలు



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి** : ఏప్రిల్ 25వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు జరుగనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మహేందర్ రెవెన్యూ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్ఫోన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని పేర్కొన్నారు. పరీక్ష రాసే వారితో పాటు ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్‌లు తీసుకెళ్ళకుండా చూడాలన్నారు. నిబంధనలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సికి సంబంధించిన పరీక్ష కేంద్రాలు ములుగు జిల్లా మూడు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మూడు కేంద్రాల్లో 526 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు అదే విధంగా ఇంటర్‌కు సంబంధించిన పరీక్ష కేంద్రాలు ములుగు జిల్లా మూడు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 602 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు తీసుకెళ్లే సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా మాత్రం వ్యవహరించవద్దని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి పాణిని, జిల్లా కోఆర్డినేటర్ డిఈఓ పాణిని, ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ పి నాగేశ్వర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, టిఓఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శంకర్‌రావు, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, ఆర్ఎస్ఐ కనకయ్య, డిపో మేనేజర్ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి** : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లతో తో కలిసి కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, ఖర్చుల రిజిస్టర్‌ల నిర్వహణ, తదితరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 వ తేదిన నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 25వ తేదీన నామినేషన్ల స్వీకరణ ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఏప్రిల్ 25 తేదీ సాయంత్రం 3:00 గంటల లోగా అందజేయాలన్నారు. కార్యాలయ పని దినాల్లో ఏప్రిల్ 18 వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకూ నామినేషన్‌లు స్వీకరిస్తానని చెప్పారు.26 వ తేదీన నామినేషన్ ల స్క్రూటినీ ఉంటుందన్నారు. 29 వ తేదీన నామినేషన్ ల ఉపసంహరణ కు తుది గడువు ఉంటుందని చెప్పారు. మెదక్ పార్లమెంట్ సంబంధించి అన్ని కలిపి మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల సౌకర్యార్థం నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్కను కూడా ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ దాఖలుకు ముందు అభ్యర్థులు తమ నామినేషన్లను హెల్ప్ డెస్క్ లో చెక్ చేయించుకోవాలన్నారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు నామినేషన్ చెట్లను దాఖలు చూసేందుకు అవకాశం ఉందన్నారు. నామినేషన్ ల దాఖలుకు అభ్యర్థితో పాటు 5 గురికి (1 +4) కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఫారం 6 ద్వారా సమర్పించే అఫిడవిట్ లో అన్ని ఖాళీలు పూరించాలని చెప్పారు. నామినేషన్ సమయంలో క్రిమినల్ కేసులు, కన్విక్షన్ కేసుల వివరాలు ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా లో 3 సార్లు పబ్లిష్ చేయాలన్నారు. అభ్యర్థులు కొత్త ఖాతా తెరిచి దాని నుంచే చెల్లింపులు జరపాలన్నారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం నుండి కేవలం 3 వాహనాలనే అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/నల్లబెల్లి** : రైతులు యాసంగిలో పండించిన వరి ధాన్యం నాణ్యత పాటించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోనుగోళ్ల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి ఉషాధాయాల్ కోరారు. మంగళవారం నల్లబెల్లి మండలంలోని రేలకుంట ,రంగాపూర్ ,నల్లబెల్లి ,మేడేపల్లి గ్రామాలలో క్షేత్ర సందర్శన చేసి మండల కేంద్రంలో పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడిఎ ఉషాదాయాల్ మాట్లాడుతూ వరి కోత నూర్పిడి సమయంలో ధాన్యంలో తేమ శాతం 23 నుండి 26 వరకు ఉంటుందని నూర్పి డి ఐన వెంటనే ధాన్యాన్ని టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ పట్టాలపై ఆరబెట్టాలని గింజ రంగు మారకుండా జాగ్రత్త పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.పరమేశ్వర్ ,జిల్లా అధికారులు పి.సారంగం ,సిహెచ్ కృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల మద్దతు కాంగ్రెస్‌కే

**ప్రజాపక్షం/గజ్వేల్** : రాష్ట్ర మంత్రివర్గంలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం పట్ల వర్గల్ లో ఆ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి బిక్షపతి ముదిరాజ్, వర్గల్ మండల శాఖ అధ్యక్షులు శ్రీరాం నర్సింలు ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజుల చిరకాల సమస్యలపై శాశ్వత పరిష్కార దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ముందడుగు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. నారాయణపేట ఎన్నికల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 15 శాతం ఉన్న ముదిరాజ్‌లకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. అయితే వారి చిరకాల కోరిక రిజర్వేషన్ బీసి డి నుంచి బీసీఏ లోకి ముదిరాజ్ కులం మార్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమం నేతలు పసుల లింగం ముదిరాజ్, నాగిరెడ్డిపల్లి నర్సింలు ముదిరాజ్, తీగుల్ల రాముల ముదిరాజ్, చెన్నయ్య ముదిరాజ్, నెంటూరి నాగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష ప్రసారానికి ఎందుకు అనుమతించడం లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉత్తర భారత దేశంలోని అయోధ్యరామ్ మందిరం నుంచి ప్రభుత్వ అధికారిక ఛానల్ డి డి న్యూస్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను నిర్వహిస్తుందని, కానీ తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం రాముని కళ్యాణాన్ని ఎందుకు చూడనివ్వడం లేదని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్. కొనగాల మహేష్ ప్రశ్నించారు. ఇది తెలంగాణ ప్రజల మీద వివక్ష కదా అని నిలదీశారు.నిత్యం మతం పేరుతో రాజకీయాలు చేసే తెలంగాణ బిజెపి నాయకులు మాత్రం, మోడీ మెప్పుకోసం తేలు కుట్టిన దొంగల్లాగా సైలెంట్‌గా ఉన్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ, ఎపి ప్రజలు ఎంతో భక్తిశ్రద్దలతో స్వామివారి కల్యాణ వైభోగాన్ని టివిలో ప్రత్యేక్షంగా వీక్షిస్తారని, కానీ ఎన్నికల కోడ్ పేరుతో మోడీ,ఈసీ అధికారులు, తెలంగాణ, దక్షిణ భారతదేశ ప్రజల పట్ల వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల పట్ల వివక్ష చూపకుండా, భద్రాద్రిలోని శ్రీరాముని కళ్యాణం టీవీలో చూసేలా లైవ్ ఏర్పాట్లకు అనుమతి ఇవ్వాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎన్నికల కమిషన్‌ను కోరగా, అందుకు కమిషన్ తిరస్కరించిందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్యకు ఒక న్యాయం భద్రాద్రికి మరో న్యాయమా అని నిలదీశారు. దీనిపైన తెలంగాణ బిజెపి నేతలు స్పందించరా? అని ప్రశ్నించారు. మోడీగుడ్ బుక్స్ లో ఉండేందుకే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, ఆకాంక్షలను, భక్తి భావాలు, సెంటిమెంట్లను తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిజెపి తాకట్టు పెట్టారని విమర్శించారు.

## 'నిజాం' ఫ్యాక్టరీ పునరుద్ధరణకు హామీ



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గత ప్రభుత్వ హాయాంలో మూతపడిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏకైక వ్యవసాయాధారిత కర్మాగారమైన నిజాం దక్కన్ చక్కర కర్మాగారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్దరణకు పార్లమెంట్ ఎన్నికల అనంతరం కమిటీ నివేదిక అందిస్తుందని తదనంతరం చెరుకు రైతుల కలను నెరవేరుస్తామని సియం రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, రైతు సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

## విచారణకు ఆదేశం




**ప్రజాపక్షం/ ముత్తారం :** ప్రజా పక్షం దినపత్రికలో మంగళవారం ప్రచురించిన ''భర్త బతికుండగానే భార్యకి వితంతు పెన్షన్'' అనే వార్త కథనం ప్రచురించదంతో జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శాల గుండ్లపల్లి కి చెందిన శోభ అనే మహిళ భర్త ఉండగానే వితంతు పెన్షన్ పొందుతున్న విషయమై డిపిఓ ఆశలత ఎంపీడీవో అధికారులకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అక్రమంగా పెన్షన్ పొందిన మొత్తం డబ్బును రికవరీ చేయాలంటూ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది. ఎవరైనా అక్రమంగా పెన్షన్ పొందాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అవసరమైతే కేసులు కూడా పెడతామని డిపిఓ హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాల, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం, మండలంలోని పదిర, హరిదాస్ నగర్, వెంకటాపూర్, అలాగే వీర్నపల్లి, భూక్యారెడ్డి తండా, బాబాయ్ చెరువు తండాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, రిజిష్టర్లు, తూకాలు, నూతనంగా ప్రవేశ పెట్టిన ఐరిస్ విధానం, ట్యాబ్ ఎంట్రీలు పరిశీలించి, అధికారులు, నిర్వాహకులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, గ్రేడ్ బీ రకానికి రూ.2183 నిర్ణయించిదని వెల్లడించారు. దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్‌లోడ్‌తో డ్యామేజి అనడం విడ్డూరం

### నాలుగు నెలల్లో ఓవర్‌లోడ్ లారీలను చూపించాలే

### కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/ మంథని:** ఇసుక లారీలు ఓవర్ లోడ్‌తో వెళ్లడం మూలంగానే పెద్దపల్లి మంథని ప్రధాన రహదారి డ్యామేజ్ అయిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్ట ప్రజా ప్రతినిధులు, నాయకులు అన్నారు. ఓవర్‌లోడ్‌తో రోడ్లు డ్యామేజ్ అయ్యాయని మాజీ ఎమ్మెల్యే పరిశీలించిన రోడ్డును మంగళవారం కాంగ్రెస్ నాయకులు సందర్శించి పరిశీలన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంథని పెద్దపల్లి రహదారి నిర్మాణం జరిగిందని, రోడ్డు మంజూరి అయిన తర్వాత సదరు కాంట్రాక్టర్ నుంచి మాజీ ఎమ్మెల్యే కమీషన్‌లు తీసుకున్నాడని, కమీషన్ తీసుకోవడం సదరు కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా రోడ్ల నిర్మాణం చేశారని అన్నారు. నాడే రోడ్లు డ్యామేజ్ అయితే ఈనాడు ఓవర్ లోడ్ లారీలతో డ్యామేజ్ అయ్యాయని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తుందని,అప్పటికే అనేక క్వారీల గడువు ముగిసిందన్నారు. కేవలం రెండు క్వారీలు మాత్రమే నడుస్తున్నా నిబంధనల ప్రకారమే లారీల్లో ఇసుక వెళ్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు, లారీలునడిపించింది ఎవరో జవాబు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్, ఎంపీపీ కొండ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, ప్రచార కమిటి చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# రేపు బిఆర్‌ఎస్ అభ్యర్థులకు బిఫామ్‌లు

### రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించాలని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఎంపి అభ్యర్థులు, నియోజకవర్గ ఎంఎల్‌ఎలు, ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ నెల 18న బిఆర్‌ఎస్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బిఫామ్‌లతో పాటు ఎన్నికల ఖర్చుల నిమిత్తం వారికి నియమావళి ప్రకారం రూ.95 లక్షల చెక్కును కూడా అందజేయనున్నారు. ఈ సమావేశంలో ఎంపి అభ్యర్థులతో పాటు పార్టీకి చెందిన ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మాజీ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్యులు పాల్గొంటారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం, వ్యూహాలకు సంబంధించి పలు అంశాలపై కెసిఆర్ సమగ్రంగా చర్చించనున్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో ప్రచార అస్త్రాలు, వ్యూహాలపై అభ్యర్థులకు, ముఖ్యనేతలకు కెసిఆర్ హితోపదేశం చేయనున్నారు. ప్రజలు, రాష్ట్ర హక్కులు కాపాడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను గెలిపించాలనే నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ భావిస్తోంది. ఒక వైపు కేసులు, మరోవైపు కొందరు ముఖ్యనాయకులు పార్టీని వీడిన నేపథ్యంలో పార్టీ ముఖ్యనేతల్లో భరోసను కల్పించి, రాజకీయ భవిష్యత్‌పై వారికి భరోస ఇవ్వాలని కెసిఆర్ నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే రాష్ట్ర ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలను రూపొందించుకోవాలని బిఆర్‌ఎస్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే రైతాంగం వద్దకు వెళ్లి వారి కష్ట సుఖాలను తెలుసుకుని వారికి భరోస నివ్వాలని, ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కెసిఆర్ నిర్ణయించారు. సమావేశంలో బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్ పై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**నియోజకవర్గ సమన్వయ కర్తలు**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల వారిగా సమన్వయకర్తలను నియమించారు. ఈ మేరకు తాజా రాజకీయ పరిణామలను దృష్టిలో పెట్టుకుని పలువురు నాయకులను బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు నియోజక వర్గ సమన్వయ కర్తలుగా నియమించారు. లోక్‌సభ ఎన్నికల్లో నాయకుల మధ్య సమన్వయ లోపం వస్తే పార్టీకి తీరని నష్టమని, తాజా పరిస్థితుల్లో ఎటువంటి చిన పొరపాటు జరిగిన తీవ్ర నష్టం జరుగుతుందని గుర్తించిన బిఆర్‌ఎస్ ,వెంటనే పలువురు నాయకులను సమన్వయ కర్తలుగా నియమించారు.

## గుడి చెరువు పనులు వేగంగా పూర్తి



**ప్రజాపక్షం/వేములవాడ :** కొనసాగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన వేములవాడ రాజరాజేశ్వరస్వామి స్వామి గుడి చెరువు అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గుడి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ చెరువులో టూరిజం శాఖ ఆధ్వర్యంలో బండ్ పార్క్‌లో కొనసాగుతున్న నిర్మాణాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్, ఇతర నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనులు, సుందరంగా, ఆకర్షణీయంగా సంప్రదాయ బద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం గుడి చెరువు ఆవరణలో కొనసాగుతున్న శివార్చన స్టేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆలయ ఇఇకి కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం సమీపంలో వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పార్క్‌ను కలెక్టర్ పరిశీలించారు. వచ్చే నెల వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు ఆక్రమణకు గురికావద్దు వేములవాడ పరిధిలోని చెరువులను గుర్తించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, వాటికి హద్దులు పెట్టాలని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, టూరిజం డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్ రెడ్డి, అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీఓ అన్సారీ, ఆలయ ఈఈ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై మోడీ సర్కార్ ముప్పేట దాడి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** దేశంలో పౌర హక్కులపై కేంద్రంలోని మోడీ సర్కార్ ముప్పేట దాడి చేస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్ కార్మిక భవన్‌లో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 30 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి చాడ వెంకటరెడ్డితోపాటు పలువురు నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని మోడీ సర్కార్ అవలంబిస్తున్న విధానాలపై మండిపడ్డారు. లౌకిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసి పౌరుహక్కులను కాలరాస్తున్న విధానాలను ఎండగట్టారు. అబద్దాలతో కాలం వెళ్ళదిస్తూ కార్పొరేట్లకు దేశవ్యాప్తంగా 12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయడమే కాకుండా రైతులకు మొండి చెయ్యి చూపారని అన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలు స్పష్టంగా ప్రజలకు అర్థం కావాలంటే మోడీ దిగిన తర్వాత స్పష్టమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఫోన్ టాపింగ్ వ్యవహారంలో ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్లమెంట్ ఎలన్నికలను దృష్టిలో ఉంచుకొని సిపిఐ ఇండియా కూటమితో కలిసి పనిచేస్తున్నాను తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మర్రి వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, పంతం రవి, నల్ల చంద్రమౌళి, నాగరాజు, మంద సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల చరిత్ర ఎఐటియుసిది

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి సీతారామయ్య




**ప్రజాపక్షం/యైటింక్లయిన్ కాలనీ :** స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు జరిగాయి. యూనియన్ రెండవ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి, వేతన సవరణ కమిటీ సభ్యులు వి. సీతారామయ్య శిక్షణా తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటాల చరిత్ర కలిగిన యూనియన్, అంతేకాకుండా చేపట్టిన పోరాటాల్లో నేలకొరిగిన అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు ఈ యూనియన్ కార్మిక కర్షక ప్రజా పోరాటాల్లో ముందుకు సాగుతుందని అన్నారు. సింగరేణిలో నెలకొన్న అనేక సమస్యల్లో ఒక్కటి ఒక్కటిగా పరిష్కరించేందుకు యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ పొందిన మాజీ కార్మికుల వారసులకు వయోపరిమితి 35 నుండి 40 సంవత్సరాలకు పెంచినట్లుగా కెసిఆర్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, గత గుర్తింపు సంఘం టిబిజికెఎస్ దాన్ని అమలు చేయించడంలో పూర్తి నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అయితే తమ యూనియన్ గెలిచాక రాష్ట్ర ప్రభుత్వంతో సింగరేణి యాజమాన్యంతో చర్చించడం జరిగిందని అన్నారు. ఫలితంగా ఈ సంవత్సరం జూన్ మాసంలో ఆచరణకు నోచుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇక పెంచిన 40 ఏండ్ల గయోపరిమితి 2018 నుండి మాజీ ఉద్యోగుల వారసులకు వర్తిస్తుందని ఈ విషయంలో మాజీ ఉద్యోగులు, వారి వారసులు అనుమానం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఈసూఫ్ యూనియన్ అన్ని బ్రాంచ్, పిట్ కమిటీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఉమామహేశ్వర్, స్వామి, గోవర్ధన్, కేంద్ర కమిటీ నాయకులు ప్రకాశ్, రావు, రాజరత్నం, రెండవ బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి.అన్నారావు, కార్యదర్శి జిగురు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ డిసిపి ఎం. చేతనలతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ గేట్ నుంచి రిటర్నింగ్ అధికారి చాంబర్ వరకు కల్పించాల్సిన భద్రతను పరిశీలించారు. అంతకు ముందు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో లోక్ సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, డిసిపి ఎం. చేతనలతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగుతుందని, భారత ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉన్నామని, నామినేషన్ వేసే అభ్యర్థులను పూర్తి సౌకర్యాలతో రిసీవ్ చేసుకునేందుకు, నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా తీసుకునే విధంగా సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ జరిగే సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ గేటు వద్ద పోలీస్ అధికారులు మొదటి దశలో, ఆర్మ్ ఫోర్స్‌తో రెండవ దశలో, రిటర్నింగ్ అధికారి చాంబర్ వద్ద పారామిలటరీ ఫోర్స్ తో మూడవ దశ భద్రత ఉంటుందని తెలిపారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అభ్యర్థులు సైతం తమ వంతు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపి క్రిష్ణ, సిఐ క్రిష్ణ, తహసిల్దార్ రాజ్ కుమార్, కలెక్టరేట్ ఎఓ శ్రీనివాస్, సంబంధిత పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో మోసం

### ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అబద్ధపు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని బిఆర్ఎస్ నిజామాబాద్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో కెఎంఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావులతో కలిసి కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో కష్టపడి పార్లమెంటులో బిఆర్ఎస్ అభ్యర్థి గొంతుక వినిపించేలా పనిచేయాలన్నారు. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ, దేశంలో బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాటిపల్లి సరోజన ఆదిరెడ్డి, జడ్పిటిసి శ్రీనివాస్ రె డ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఎంపిటిసి రాజేష్, నాయకులు మల్లయ్య, ఖ్యాతం నరేష్ రెడ్డి, జీవన్‌రెడ్డి శరత్ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల పునరుద్ధరణకు బిజెపిని ఓడించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్న, నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు కావాలన్న దేశంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని, దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజలను రక్షించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం 138 మేడే వాల్ పోస్టర్లను ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో పౌర ప్రజాసామ్య పాలన అంతంచేసి పెట్టుబడిదారి విధానంను పోత్సహిస్తూ, కార్మిక వర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు 29 చట్టాలను సమూలంగా రద్దుచేసి పెట్టుబడిదాలకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తెచ్చింది బిజెపి ప్రభుత్వం అని విమర్శించారు. పెన్షన్ చట్టాలను అమలు చేయాలని, హమాలి, ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, సింగరేణి కాంటాక్ట్ కార్మికులను, సింగరేణిలో గుర్తింపు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ విధానాన్ని సవరించి పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు 600 రూపాయలు చెల్లించాలని అన్నారు. జిల్లాలోని కార్మికులు కర్షకులు అందరూ మేడే ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పిడుగు శంకర్, నాయకులు శ్రీనివాస్, ప్రకాష్, మోహన్, కొమురక్క తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** జిల్లాలో లోక్ సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్.పి కె.సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణులతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న లోక్ సభ ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన జిల్లా కేంద్రంలోని ఇవిఎం గోదాము వద్ద గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం రాండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందని, కేటాయింపు అనంతరం ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని పిటిజి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కు బందోబస్తుతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తరలించడం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తరలించి భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు తమ పార్టీ తరపున ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏజెంట్ల వివరాలను అందించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని, రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ డిఎస్‌పి సదయ్య, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటిలో ఆగని దారుణాలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** బాసర ట్రిపుల్ ఐటిలో మరో వివాదం రాజుకుంటుంది. రెండు నెలలకో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం ట్రిపుల్ ఐటిపై ఎన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థి ఆత్మహత్య చేసుకునే ముందు సూసైడ్ నోట్ రాసినట్లు ప్రచారం కూడా జరుగుతుంది. అధికారుల ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నాడా అనే అనుమానాలు..? హాజరు శాతం తక్కువ ఉందని ఒత్తిడి పెంచారా..? విద్యార్థి తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడింది నిజమేనా అధికారులు చెప్తున్నా కట్టు కథన..? స్థానిక ట్రిబుల్ ఐటి అధికారులు సూసైడ్ నోట్ బయటికి పోకుండా జాగ్రత్త పడుతున్నారని విద్యార్థి సంఘాలు కూడా ఆరోపిస్తున్నాయి. విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకాలం లేపుతుంది. పియుసి ద్వితీయ సంవత్సరం చదుపుతున్న అరవింద్ కుమార్ సిద్దిపేట జిల్లా బందారు పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వసతి గృహంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం పట్ల విద్యార్థులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎక్కడ నుంచి ఏం జరుగుతుందోనని విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చిన సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం పట్ల బాసర ట్రిపుల్ ఐటి అధికారులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థుల బలమరణాలు అధికారుల లోపమే పేరెంట్స్ కమిటీ ఆరోపిస్తుంది. విద్యార్థులకు ఏదో విధంగా ఒత్తిడి పెంచుతూ మానసికంగా కృంగిపోయే విధంగా చేస్తున్నారని ప్రచారం కూడా లేకపోలేదు. ట్రిబుల్ ఐటిలో చదువుకోవాలంటేనే విద్యార్థులకు భయమేస్తుంది. ట్రిబుల్ ఐటి అంటే బూతు బంగ్లా తయారవుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థులపై ఏ ఒత్తిడి లేకుంటే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్న వెంటనే పోలీస్ బలగాలకు సమాచారం ఇచ్చి భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూడా పరిశీలించకుండా చేస్తున్నారని, అక్కడ ఏం జరిగిందో అని కూడా బయటి ప్రపంచానికి తెలియకుండా ట్రిబుల్ ఐటి అధికారులు నిర్బంధించడం వెనుక అంతర్యమేంటోనని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు పునర్వంతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం స్పందించి ట్రిబుల్ ఐటి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని లేదంటే దయ్యాల బంగ్లా తయారైపోతే విద్యార్థులు కూడా చదువుకునే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్రికత**

బాసర తింబులీ ఐటిలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు ఎవైఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఎబివిపి ప్రజాసంఘాలు చొచ్చుకెళ్లెందు ప్రయత్నించగా పోలీస్ బలగాలు అడ్డుకున్నాయి. విద్యార్థి అరవింద్ కుమార్ మరణం పట్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండు నెలలకోసారి విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం వెనుక ట్రిబుల్ ఐటి అధికారుల ఒత్తిడి కారణంగానే ఈ ఆత్మహత్యలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల ఆందోళన వ్యక్తం చేశాయి. విద్యార్థి సంఘాల నాయకులను, ప్రజా సంఘం నాయకులను పోలీస్‌లు అరెస్టు చేసి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మండలంలోని కొమరం భీమ్ చౌరస్తా వద్ద 50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా, పట్టుకున్నట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. మంగళవారం ఉదయం నాలుగు గంటలకు బ్లూ కోర్ట్, పెట్రోల్ కార్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది అనుమానపదంగా వస్తున్న, మహీంద్రా మినీ డిసిఎం వాహనమును కొమురం భీం చౌరస్తా వద్ద తనిఖీ చేయగా అందులో ఎలాంటి అనుమతి పత్రాలు లేని సుమారు 50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ బియ్యాన్ని తరలిస్తున్న కడం మండలం, సర్సింగాపూర్ గ్రామానికి చెందిన, సంఘ వెంకటేష్, గొల్ల జలపతి, అను వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రభుత్వ రంగ సంస్థల మూసివేతే
# బిజెపి ప్రధాన ఎజెండా

### వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థల మూసివేతనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని, దానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ అన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'పబ్లిక్ సెక్టార్‌ల మూసివేత సమాజంపై ప్రభావం' అనే అంశంపై రెండవ రోజు జరిగిన సదస్సుకు వేణు గోపాల్ ప్రధాన వక్త గా హాజరయ్యారు. ఈ సదస్సుకు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షత వహించారు. సదస్సులో వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయన్నారు. మోడీ హయాంలో ఒక్క కొత్త ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయలేదని , ఉన్నవాటిని తమ మిత్రులకు అప్పగించేందుకు చర్యలు తీసుకున్నారని విమర్శించారు.చిన్న తరహా పరిశ్రమల మూసివేతలకు కారణం కూడా మోడీనే అన్నారు.

**ఉపాధి కోల్పోయిన లక్షలాదిమంది..**

మోడీ హయాంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోతే, పరోక్షంగా కోట్లాది మందిపై ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న నిజాం చక్కెర ఫ్యాక్టరీకి 7వేల ఎకరాల భూమి ఉన్నదని, ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మే కుటిల ప్రయత్నాలను పాలకులు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. పాలకులు కార్పొరేట్ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంతో నాణ్యత లేని ఉత్పత్తులు తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని తెలిపారు. కార్పొరేట్ పరిశ్రమల యాజమాన్యాలు లాభాపేక్షతోనే పరిశ్రమలను స్థాపిస్తారే తప్ప, ఉత్పాదక, ఉపాధి అంశాలపై దృష్టి సారించరన్నారు. దేశ సంపద, నిర్మాణ సృష్టికర్తలు యువతేనని, చోదక శక్తి యువ నాయకత్వానిదన్నారు.

**ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేయాలి..**

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని వేణు గోపాల్ డిమాండ్ చేశారు. భారతదేశంలోనే యువత సంఖ్య ఎక్కువగా ఉందని, ప్రపంచంలో 186 కోట్ల మంది యువజనులు ఉంటే, అందులో 28 శాతం భారతీయులేనని చెప్పారు. నవ యువకులతో నవనవలాడుతున్న యువజన దేశం భారత్ అన్నారు. ఏ దేశానికి లేనంత యువ సంపద మనకున్నప్పటికీ ఉత్తేజం, ఉత్సాహం కరువయ్యాయన్నారు. పాలకుల వినాశకర విధానాల కారణంగా దేశంలోని 30 శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేవన్నారు. ఈ సదస్సులో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, నాయకులు సత్య ప్రసాద్, యుగంధర్, బిజ్జ శ్రీనివాసులు, మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు స్వప్న, షేక్ మహమూద్, మొగిలి లక్ష్మ ణ్, ఎల్లంకి మహేష్, చిలకరాజు శ్రీను, మార్కపూరి సూర్య, మానస్ కుమార్, నాయీమ్, చిరంజీవి, మాజీద్, అనిల్, కళ్యాణ్, సుశాంత్, వెంకన్న, శోభన్, రమేష్, శేఖర్, రాధ, రవి కుమార్ ఉన్నారు.

## కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరికలు

ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : వివిధ పార్టీల నుంచి సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు సమక్షంలో సిపిఐలో చేరారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నందు జరిగిన సుజాతనగర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా వీరికి కూనంనేని పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఏగా గెలిచిన అనతికాలంలో నియోజకవర్గంలో వివిధ పథకాల క్రింద మంజూరైన నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేశామని, ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని, ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చిన తన దృష్టికి తేవాలన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు అనుబంధ ప్రజా సంఘాలతో భాద్యత తీసుకొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, జక్కుల రాములు, భూక్యా శ్రీను, కేశవరావు, దండు సురేష్, మంగ్యా, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్లను క్రమబద్ధీకరించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్




ప్రజాపక్షం / హైదరాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో గత అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం.నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్స్ విస్తృతస్థాయి సమావేశం యూనియన్ అధ్యక్షురాలు కె.నిశాంతిని అధ్యక్షతన మంగళవారం హిమాయత్‌నగర్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి ఎం.నరసింహ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకునే సందర్భంలోనే వీరికి రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ఆధారితంగా సెలక్షన్ చేయటం జరిగిందని, కరోనా లాంటి పరిస్థితుల్లో సైతం పేద ప్రజలకు అండదండగా ఉండి వారి సేవలను అందించి వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న బేసిక్ వేతనం కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాలని ఉన్నప్పటికీ వీరికి అతి తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని, చట్ట ప్రకారం వీరి జీతం రూ.36,750 ఇవ్వాల్సి ఉండగా రూ.29,900 మాత్రమే చెల్లిస్తూ గత పది సంవత్సరాలుగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తున్నదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ రానున్న రిక్రూట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్లకు 30 మార్కులు వెయిటేజీ ఇచ్చి వీరందరికనీ పర్మనెంట్ చేయాలన్నారు. గ్రామస్థాయిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లను విస్మరించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. నర్సింగ్ ఆఫీసర్లపై పని భారాన్ని తగ్గించడానికి అన్ని స్థాయిల్లో తగిన సిబ్బందిని నియమించాలని మె కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక ఫ** తెలంగాణ రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షురాలుగా కె.నిశాంతిని, ప్రధాన కార్యదర్శిగా మరియా, ఉపాధ్యక్షులుగా కె.చంద్రకాంత్, బి.రత్నకుమారి, సహాయ కార్యదర్శులుగా బి.వనిత, ఎస్‌కె.హిమామ్‌బీ, కోశాధికారిగా ఎస్.సరితను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ ప్రకటించింది.

## విద్యార్థి, యువతను విస్మరించిన బిజెపిని ఓడిద్దాం



ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ చేసిన మోడీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి విద్యార్థిలోకాన్ని ఏకం చేస్తామని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ అన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించిన బిజెపిని ఓడించాలని పిలుపునిస్తూ ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ప్రచురించిన పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, లక్ష్మ ణ్ మాట్లాడుతూ దేశంలో గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. తెలంగాణకు ఒక ట్రిబుల్ ఐటీ కేటాయించలేదని, పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. బిజెపి ప్రభుత్వం గత 10 సంవత్సరాల పాలనలో విద్య, ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

**10 ఏళ్లలో భర్తీ చేయని రెండు కోట్ల ఉద్యోగాలు..**

2014 ఎన్నికలలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి, పదేళ్లలో రెండు కోట్ల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. 10 ఏళ్ల పాలనలో విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కషాయీకరణ చేసిందని విమర్శించారు. విద్యకు ప్రతి బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులు కూడా కేటాయించకుండా విద్యారంగం పట్ల బిజెపి పాలకులు వివక్ష చూపించారని మండిపడ్డారు. తెలంగాణ విభజన హామీల ప్రకారం తెలంగాణకు విద్యాసంస్థలు కేటాయించకుండా, తెలంగాణ విద్యార్థుల పట్ల మోడీ కక్ష్య పూరితంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. దేశంలో అనేక ప్రాంతాల్లో ఐఐటీలు ఏర్పాటు చేసిన బిజెపి ప్రభుత్వం తెలంగాణలో ఒక్క ఐఐటీని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని విభజన చట్టం స్పష్టం చేస్తుందన్నారు.

**జిఎస్‌టితో విద్యార్థులపై ఆర్థిక భారం..**

విద్యార్థుల స్టేషనరీ వస్తువులపై జిఎస్‌టి విధించి పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను రద్దు చేసి, పేద విద్యార్థులను ఉన్నత విద్యార్థులకు దూరం చేసే కుట్ర చేసిందన్నారు. బిజెపి పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. బిజెపి హటావో దేశ్‌కో బచావో, బిజెపిని ఓడిద్దాం భారతదేశ విద్యారంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తామని తెలిపారు. మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యార్థిలోకం బిజెపిని ఓడించేందుకు సిద్ధం కావాలని మణికంఠ రెడ్డి, లక్ష్మ ణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్, రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, ఎం.డి. అన్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మధుయాష్కీగౌడ్‌కు ప్రముఖుల పరామర్శ





**ఫోన్ చేసిన రాహుల్‌గాంధీ**

ప్రజాపక్షం / హైదరాబాద్ : టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను మంగళవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి అనసూయ మరణం పట్ల సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ మంగళవారం మధుయాష్కీతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన తల్లి మృతి పట్ల సంతాపం తెలియజేసి ఓదార్చారు. కుటుంబ సభ్యులు మానసిక ధైర్యంతో ఉండాలని కోరారు. అలాగే మరో కాంగ్రెస్ నేత సోనియాగాంధీ కార్యాలయం నుండి కూడా మధుయాష్కికి ఫోన్ వచ్చింది. సిఎం రేవంత్ రెడ్డి సైతం ఫోన్ చేసి తాను నారాయణపేటలో కాంగ్రెస్ బహిరంగ సభకు వెళ్ళినందున అంత్యక్రియలకు హాజరు కాలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలోని వయనాడులో పర్యటనకు వెళ్తున్నందున, నేరుగా కలవలేక పోతున్నానని.. పర్యటన నుంచి తిరిగి వచ్చాక ఇంటికి వస్తానని తెలిపారు. అలాగే హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా మధుయస్కీ గౌడ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ నాయకులు, ఎంపిలు కూడా ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు.

**పరామర్శించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి**

హయత్‌నగర్‌లోని మధుయాష్కిగౌడ్ నివాసానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పల్లా వెంకట్ రెడ్డిలు మంగళవారం వెళ్ళి ఆయనను పరామర్శించారు. ఆయన తల్లి అనసూయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మధుయాష్కి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమారు వందేళ్ళ తమ పెంకుటిల్లును మధుయాష్కి గౌడ్ వారికి చూపించారు. నగర ప్రధాన ప్రాంతంలో ఇప్పటికీ ఆ పురాతన ఇంటిని శ్రద్ధతో పరిరక్షిస్తున్నందుకు మధు యాస్కీ గౌడ్‌ను కె.శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ కూడా మధుయాస్కీగౌడ్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత హనుమంత రావు, ఎంఎల్‌సి టి. జీవన్ రెడ్డి, ఎగ్గే మల్లేశం , మాజీ ఎంఎల్ఎ కూన శ్రీశైలం గౌడ్,రంగారెడ్డి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి , హరి వర్ధన్ రెడ్డి, సుజాత తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## భావోద్వేగ, మత రాజకీయాలను ఓడించాలి

### సిపిఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : మోడీ చేస్తున్న భావోద్వేగ మత రాజకీయాలను ఓడిద్దామని, దేశ సమగ్రత, అర్థిక విధానాలను నాశనం చేయడమే బిజెపి అజెండా అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలతో అంబాని, ఆదానీలు మేమిద్దరం, మాకు ఇద్దరు అంటూ దేశ వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారని, ఈ దుర్మార్గపు చర్యలను దేశ ప్రజలను తిప్పికొట్టాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే ప్రచార అస్త్రాలుగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, మతోన్మాద బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. దేశ పరిపాలనను మోడీ అంబాని, అదానీల విధానాలనే అనుసరిస్తున్నాడని ధ్వజమెత్తారు. 56 ఇంచుల చాతితో దేశాన్ని రక్షిస్తున్నానని, అభివృద్ధి చేస్తున్నానని మోడీ ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ఇప్పటికే దేశంలో అర్థాకలితో ప్రజలు అలమటిస్తున్నారన్నారు. హిందూత్వానికి, యజమానులు బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ కాదని, దేశ ప్రధాని యజమానులే అని ఉద్ఘాటించారు. మోడీ చర్యలన్ని పురుషాధిక్యతకు అద్దం పడుతాయన్నారు. అందుకే అయోధ్యలో కేవలం సీతాదేవి లేని రాముడు విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేశారని విమర్శించారు. భౌతిక వాదులైన కమ్యూనిస్టులు నిరంతరం ప్రజలకు అవసరమైన విధానాలపై పోరాటం చేస్తారని, అటువంటి భౌతిక వాదులపై దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ దాడులు చేయటాన్ని, దేశ ప్రజాస్వామిక వాదులంత ఎండగట్టాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తం గా 45 శాతం గ్రాడ్యుయేట్‌లు నిరుద్యోగులుగాఉన్నారన్నారు. ఎలక్టోరల్ బాండ్లు అవినీతి బాండ్లని, దాదా వసూళ్ల బాండ్లు అన్నారు. మోడీ 10 ఏండ్ల కాలంలో తన బ్రాండ్ ఇమేజ్ కోసం కొన్ని కోట్లకు పైగా ఖర్చుచేశారన్నారు. ఇది దేశ ప్రజల డబ్బు అన్నారు. అందుకే దేశంలో ప్రస్తుతం భావోద్వేగ పూరిత మతరాజకీయాలు నడుస్తున్నాయని దీన్ని పౌరులంత తిప్పి కొట్టాలన్నారు. మతతత్వ రాజకీయాలకు దేశంలో చోటు లేదని, సర్వమత సమ్మేళనమే భారతదేశమని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేశం, కిష్టపురం లక్ష్మ ణ్, కనుకుంట్ల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోనగిరి రూపేశ్, వేల్పుల శ్రీనివాస్, పిల్లి రజని, జెర్రిపోతుల జనార్దన్, ఎగ్గోజి సుదర్శన్, బొజ్జగిరి రాజు, అయిలేని సంజీవరెడ్డి, సంగే మధు, కర్నాల చంద్రం పాల్గొన్నారు.


















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## లాఅండ్ఆర్డర్ సమస్య లేకుండా శోభాయాత్ర

**హైదరాబాద్ :** శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండే మార్గంలోనే శోభాయాత్ర నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్‌కు అభ్యంతరం లేకపోతే పోలీసులు నిర్ణయంచిన మార్గంలో శోభాయాత్ర నిర్వహించుకోవాలని పిటిషనర్‌కు చెప్పింది. శోభాయత్రకు టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరధిలోని మార్గాల్లో నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ కేసరి హనుమాన్ యువ సంఘాతన్ అధ్యక్షుడు అడ్డాల కార్తీక్ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ బి.విజయేందర్‌రెడ్డి విచారణ చేపట్టి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు. కేసరి హనుమాన్ మందిర్ , దరియాబాగ్ , గిర్కపల్లి ,రాంసింగ్పురా ప్రధాన రహదారి, కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాల ,ఆర్య సమాజ్,లైబ్రరీ సెంటర్, కుల్సుంపురా పార్క్ ,కార్వాన్ మార్కెట్ ,శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం ,ఆంధ్రుని కార్వాన్, క్రాంతి భవన్,పటేల్ హోటల్ ,శ్రీ గంగా పరమేశ్వరి ఆలయం మార్గంలో అనుమతి ఇచ్చేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్ న్యాయవాది కోరారు.

## దానం నాగేందర్‌పై కేసులో స్పీకర్‌కు నోటీసు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్ :** బిఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఆపార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీలో చేరినందున ఆయనపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌లో స్పీకర్‌కు నోటీసులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దానం నాగేందర్‌తో పాటు న్యాయ శాఖ కార్యదర్శి, స్పీకర్ కార్యాలయానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులిచ్చింది నాగేందర్ అనర్హత వేటు వేయాలని గత మార్చి 14న ఇచ్చిన ఫిర్యాదుపై స్పీకర్ చర్య తీసుకోలేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ బి.విజయేందర్‌రెడ్డి సోమవారం విచారించారు. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు స్పీకర్కు ఇచ్చేందుకు నిరాకరించింది.




ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన

## ప్రధాని మోడీపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై చర్యలు తీసుకోవాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు జి. నిరంజన్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు, కాంగ్రెస్ పార్టీని,ప్రతిష్టను కించపర్చేందుకు ఉద్దేశించిన ఏఎన్ఐ ఇంటర్వ్యూను మొదటి దశ ఎన్నికలకు కేవలం నాలుగు రోజుల ముందు ప్రసారం చేశారని ఎన్నికల కమీషన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా, కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై దుష్ప్రచారం చేసేందుకు ఏఎన్ఐకి ఇచ్చినఇంటర్వ్యూను ప్రసారం చేశారని తెలిపారు. దీనిని పెయిడ్ న్యూస్ గా పరిగణించాలని కోరారు. ఈ మేరకు నిరంజన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎంసిసిని ఉల్లంఘించకుండా అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని ఎన్నికల సంఘం సూచించిందని, రాజకీయ పార్టీలు,నాయకులు ప్రత్యర్థులపై విప్రపచారం చేయకుండా, పరిమితులను విధించిందని నిరంజన్ గుర్తు చేశారు. మతాన్ని ,మతపరమైన స్థలాలను తమ ప్రచారంలో ఉపయోగించకూడదని, ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించకూడదని తెలిపారు. పార్టీలు,అభ్యర్థులు ఇతర పార్టీల నాయకులు లేదా కార్యకర్తల ప్రజా కార్యకలాపాలతో సంబంధం లేని వ్యక్తిగత జీవితంలోని అన్ని అంశాలకు సంబంధించిన విమర్శలకు దూరంగా ఉండాలని ఎన్నికల నిబంధనవళిలో ఉన్నదని,వాస్తవాల వక్రీకరణ చేయకూడదని కూడా ఉన్నదని నిరంజన్ పేర్కొన్నారు.

## అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామా రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి కార్యాలయంలో బూత్ ఇంచార్జీలు, బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలో మోడీ పాలనకు ప్రజలు మరో మారు బ్రహ్మరథం పడుతున్నారని, మోడీతోనే దేశం సుభిక్షంగా ఉండాలని మోడీ సర్కార్‌ను కోరుతున్నారని వారు తెలిపారు. ప్రతి ఇంటింటికి మోడీ పాలనపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం నవకిషోర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పిజెఆర్ స్టేడియంలో హోప్ ఫౌండేషన్ చలివేంద్రం




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** క్రీడాకారులకు వేసవి కాలంలో దాహార్తి తీర్చేందుకు హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని పిజెఆర్ స్టేడియంలో చలి వేంద్రన్ని ఏర్పాటు చేస్తున్నామని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని పలు కూడలులోని సెంటర్‌లతో పాటు క్రీడాకారులకు చల్లని మంచి నీటిని అంద చేయాలనే అలోచనతో గత 9 సంవత్సరాలుగా పిజెఆర్ స్టేడియంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నమని అదే విధంగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తు వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తొపుగుండ మహిపాల్ రెడ్డి, మధుసుధన్ రెడ్డి, శాంతి భూషణ్ రెడ్డి, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, మల్లేష్ యాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రంజిత్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి



**ప్రజాపక్షం/షాబాద్:** చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ పామెన భీంభరత్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో క్లస్టర్ ఇంచార్జలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపిని గెలిపించేందుకు మండలంలోని కార్యకర్తలకు పూర్తి స్థాయిలో ప్రచారం చేసేందుకు క్లస్టర్ వైజ్‌గా కార్యకర్తలను నియమించిన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శులు సురేందర్ రెడ్డి, నియెజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల మహిళ నాయకురాలు అశ్విని, ఎంపిటిసి మల్లేష్ పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలేత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బి. సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి ఎద్దడిపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిషన్ భగిరథ మంచి నీటి సరఫరా చేయడంలో ఏమైనా లోపాలుంటే సరి చేయాలని అన్నారు. గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతి కార్యదర్శులు గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఏలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సఫరా డివిజినల్ అధికారులు రాజు, ప్రియాంక, ఎంపిడిఓ నరేంధర్‌రెడ్డి, తహాశీల్దారు అయ్యప్ప వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పారదర్శక ఎన్నికల నిర్వహణకు
# పకడ్బందీ ఏర్పాట్లు



**18న నోటిఫికేషన్ విడుదల : 25 వరకు నామినేషన్ల స్వీకరణ**

**హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్ రోస్ తెలిపారు. మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నామని, నోటిఫికేషన్ రాగానే నామినేషన్‌లను స్వీకరించడం జరుగుతుందన్నారు. సెలవు రోజు ఆదివారం మినహా ఈనెల 18 నుండి 25 వరకు ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల సమయంలో నామినేషన్‌లను స్వీకరిస్తామని తెలిపారు. దాఖలైన నామినేషన్‌లను ఈ నెల 26న పరిశీలించడం జరుగుతుందన్నారు. నామినేషన్‌ల ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు అని చెప్పారు. మే, 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని కమిషనర్ వివరించారు.

**నామినేషన్‌ల దాఖలుకు అభ్యర్థి వెంట నాలుగురికే అనుమతి..**

ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమేలోనికి అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు గరిష్టంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చన్నారు. అభ్యర్థులు తమపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటి వివరాలు తప్పనిసరిగా న్యూస్ పేపర్, న్యూస్ చానల్స్ ప్రచురితం చేయాలన్నారు. ఫిబ్రవరి 8, 2024న ప్రచురితమైన ఫైనల్ ఓటర్ జాబితా మేరకు జిల్లాలో మొత్తం 45,70,138 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 23,30,574 మంది పురుషులు, 22,39,240 మంది మహిళలు, 324 మంది థర్డ్ జండర్ ఉన్నారని చెప్పారు. సర్వీస్ ఓటర్లు 402 మంది, ఎన్నారై ఓటర్లు 846, పిడబ్ల్యుడి ఓటర్లు 22,995, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 36,664 మంది ఉన్నారని వివరించారు. ఈపీ రేషియో 759, జెండర్ రేషియో 961 గా ఉందని, 18 19 సంవత్సరాల వయస్సు గల ఓటర్లు 65,595 మంది ఉన్నట్లు తెలిపారు. జనవరి 23వ తేదీ నుండి ఈనెల 15 వరకు 3,10,979 సూచనలు, అభ్యంతరాలు వచ్చాయని, వాటిని ఈనెల 25 లోగా పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 1675 ప్రాంతాలలో 3986 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవిఎం డెమోన్‌స్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఈవిఎం, వివి ప్యాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణను ఇచ్చామన్నారు.

**ఆధారాలు ఇస్తే నగదు విడుదల చేస్తున్నాం..**

జిల్లాలో పట్టుకున్న నగదుకు సంబంధించి జిల్లా గ్రీవెన్స్ కమిటీలో ఆధారాలు అందజేసిన 24 గంటల్లో విడుదల చేస్తున్నామని రోనాల్డ్ రోస్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 73 కేసులకు గాను 2 కోట్ల 39 లక్షల 92 వేల 730 రూపాయలు విడుదల కోసం అభ్యర్థించగా, అందులో 70 కేసులలో 1.70 కోట్ల రూపాయలు విడుదల చేశామన్నారు.

**గైర్హాజరైన సిబ్బందిపై క్రిమినల్ కేసులు..**

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 23,500 మంది సిబ్బందిని నియమించామని, శిక్షణ కార్యక్రమం సందర్భంగా అందులో పిఓ, ఏపిఓలు 1700 మంది, మైక్రో అబ్జర్వర్లు 120 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది రెండు వేల మంది శిక్షణకు హాజరు కాలేదని, వారికి రెండు సార్లు నోటీసులు ఇచ్చామని, వారిపై త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు ఇతర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని రోనాల్డ్ విజ్ఞప్తి చేశారు.

**ప్రతి ఓటరు వేయాలి..** మే 13న జరిగే పోలింగ్ ప్రక్రియలో జిల్లాలోని ప్రతి ఓటరు పాల్గొని ఓటు వేయాలని రోనాల్డ్ రోస్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ స్వీకరిస్తానని, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి సిఇఓ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యమంలోనూ ముందుండి నడిపించింది పాటే

**పాట మానవ చైతన్య ప్రవాహిని**

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ప్రతి ఉద్యమంలోనూ పాట మనిషిని ముందుండి నడిపించిందని ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. మానవ చరిత్రలో ఆదిమ కావ్యం పాటేనని, అది శ్రమనుంచే పుట్టిందని ఉత్పత్తి ప్రక్రియలోనూ కాయకష్టంలోనూ పనితో పాటే పాట వర్ధిల్లిందని ఆయన వివరించారు. కానీ కారణాంతరాల వల్ల పాటకు ద్వితీయ స్థానాన్ని సాహిత్య చరిత్ర ఇచ్చిందని ఇది బాధాకరమన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మానవీయ మిషన్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, కళాశాల విద్యాశాఖ ఆంధ్ర ప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లోని డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం (సామర్థ్యాల నిర్మాణ కార్యక్రమం) మంగళవారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యుజిసి, మానవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు జరగనుంది. సెంటర్ సంచాలకులు ఆచార్య పి.ప్రకాష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ మానవ మహాప్రస్థానంలో పాట అత్యంత కీలకమైనదన్నారు. మనిషి ప్రతి భావోద్వేగానికి పాట వేదికైందని, మనిషి కష్ట సుఖాల్లో మానవుడికి తోడుగా నిలిచిందని పేర్కొన్నారు. పాట పరిణామ క్రమాన్ని నదితో పోలుస్తూ బొట్లు బొట్లుగా ప్రవాహంతో ప్రయాణమైన పాట ప్రస్తుతం ప్రతి మానవుడి జీవితంలో భాగమైన విషయాన్ని వివరించారు. అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు, సుద్దాల హనుమంతు అందెశ్రీ, గద్దర్ వంటి భక్తి, ప్రజావాగ్గేయకారులను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవీయ విభాగాల డీన్ ఆచార్య వి.కృష్ణ మాట్లాడుతూ నూతన విద్యా విధానం 2020 ఉన్నత విద్యా వ్యవస్థలో అనేకమైన కీలక మార్పులను తీసుకొచ్చిందని, వాటిపైన ఇంకా విస్తృతమైన చర్చ జరగాలన్నారు. విద్యా వ్యవస్థలోని మార్పులే సామాజిక మార్పులకు దారితీస్తాయని, విద్యా విధానం రూపకల్పనలో మేధావి వర్గమైన అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్టులైన, విశేష కృషిచేసిన ఎందరో సాహితీ భాషావేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పి.విజయ కుమార్ మాట్లాడుతూ తెలుగు భాష ఆధునిక కాలానుగుణంగా ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందని, అందుకు కావాల్సిన పరిశోధన సాంకేతికత వంటి అంశాలపై అధ్యాపకులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టి భాషా సాహిత్యాలలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలన్నారు.

## కాంగ్రెస్‌లో జోరందుకున్న చేరికలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరందుకుంటుంది. రాష్ట్ర స్థాయి నుండి జిల్లా,గ్రామ స్థాయి నాయకులు,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి కన చూపుతున్నారు. బిఆర్ఎస్ నేతలు కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి, మాజీ ఎంఎల్‌సి రాజేశ్వర్ రావు హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా వారికి రేవంత్ రెడ్డి పార్టీ కండువను కప్పి కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపి అభ్యర్థి జీవన్ రెడ్డి, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే సరూర్ నగర్ మాజీ కార్పొరేటర్ అనితదయాకర్ రెడ్డి దంపతులు కూడా రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.
గాంధీభవన్ పేరుతో ఫోటోలు ఉన్నాయి.

**కాంగ్రెస్‌లో చేరిన కోరుట్ల బిజెపి, బిఆర్ఎస్ నాయకులు**

కోరుట్లకు చెందిన బిజెపి నాయకులతో పాటు బిఆర్ఎస్ నాయకులు గాంధీభవన్‌లో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ రావు ఆధ్వర్యంలో చేరిన పలువురికి మహేష్ కుమార్ గౌడ్ పార్టీ కండువాను కప్పి కాంగ్రెస్ లోనికి ఆహ్వానించారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెఎన్.వెంకట్, ఇబ్రహీంపట్నం మాజీ జెడ్‌పిటిసి జెఎన్ సునీత, మెట్‌పల్లి మాజీ జెడ్‌పిఇసి ఆకుల లింగారెడ్డి , చెన్నామనేని శ్రీనివాసరావు (సిఎస్ఆర్),మాజీ ఎంపిపి నేరేళ్ల దేవేందర్, ఇబ్రహీంపట్నంకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి కొక్కు పురుషోత్తంతో పాటు బిఆర్ఎస్, బిజెపి సర్పంచులు, ఎంపిటిసిలు, ఉప సర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్లు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నిజామాబాద్ లోక్ సభ అభ్యర్థి జీవన్ రెడ్డి, ఎంఎల్‌ఎ లక్ష్మ ణ్ తదితరులు హాజరయ్యారు.

**బిలకంటి శేఖర్‌రెడ్డితో బాటు దాదాపు 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక**



**ప్రజాపక్షం/యాచారం/తుర్కయంజాల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మేన్ బిలకంటి శేఖర్‌రెడి, సహకార సంఘం డైరెక్టర్ మల్లారెడ్డి, మండల రైతుబంద్ అధ్యక్షులు జోగిరెడ్డి తో బాటు ఆ గ్రామానికి 200 మంది బిఅర్ఎస్ పార్టీ కార్యకర్తలు, జిల్లా డిసిసి బి అధ్యక్షులు కొత్తకుర్మ సత్తయ్య, తన అనుచర వర్గం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి, తాండూరు ఎంఎల్‌ఎ మనోహర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వరు, నోముల కృష్ణ గౌడ్, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మ, అరవింద్‌నాయక్, బాష, సుధాకర్ వెంకటయ్య పాల్గొన్నారు.



## ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి**

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికలను పురస్కరించుకొని క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లు,తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జోనల్ డిసి పి లు,అదనపు డిసిపి లు,ఎసిపి లు,ఇతర అధికారులతో కలిసి మంగళవారంసైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి అవినాష్ మహంతి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను పకడ్భద్బందీగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పని చేయాలని తెలిపారు. ఎన్నికలలో ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అవసరమైన అన్ని చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి,తనిఖీలు నిర్వహించాలని సూచించారు.అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం ముఖ్యంగా ఉచితాలను పట్టుకోవడానికి అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను తమ కింది స్థాయి సిబ్బందికి అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనల మీద అవగాహనను కల్పించడానికి సిబ్బందితో సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.అదేవిధంగా విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సి పి అవినాష్ మహంతి సూచించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సి పి ట్రాఫిక్ డి.జోయల్ డేవీస్,ఎస్‌బి డిసిపి బత్తిని సాయిశ్రీ, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ డిసిపి సృజన కర్ణం,డిసిపి లు డాక్టర్ జి.వినీత్,నితికా పంత్, నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డిసిపి ఇఒడబ్లు కె. ప్రసాద్, సైబరాబాద్ డిసిపి క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి,మేడ్చల్ ట్రాఫిక్ డిసిపి డివి శ్రీనివాసరావు,మేడ్చల్ ఎస్‌ఓటీ డిసిపి డి. శ్రీనివాస్,ఎడిసిపిలు,ఎసి సిపి,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అవయవదానంలో ప్రపంచ రికార్డు అందుకున్న బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** అవయవ దానంలో ప్రపంచ రికార్డును అందుకున్న బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు చల్లా రామ్ కళ్యాణ్ తెలిపారు. ఉగాది పురస్కాకాల కార్యక్రమంలో ప్రతిష్టాత్మక విశ్వగురు వరల్డ్ రికార్డ్‌తో బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు రామ్ కళ్యాన్‌కు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామ్ కళ్యాణ్ మాట్లాడుతూ బి చేంజ్ వెల్ఫేర్ సోసైటీ తన సంచలనాత్మక చొరవతో అవయవ దానం ఆన్ వీల్స్ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ రికార్డును సాధించడం ద్వారా ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించిందని తెలిపారు. ఈ వినూత్న ప్రయత్నం ప్రపంచ వ్యాప్తంగా మొబైల్ ప్లాట్ ఫారమ్‌లో అవయవ, శరీర దాన శిబిరాలు, దాతల నమోదులను నిర్వహించడం మొట్ట మొదటి ఉదాహరణగా గుర్తించబడిందన్నారు. 2016లో ప్రారంభమమైనప్పటి నుంచి బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ అవయవ దానం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన తీసుకురావడానికి అవిశ్రాంతంగా కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు డా, రామారావు మాట్లాడుతూ బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు రామ్ కళ్యాణ్ చల్లా అతని బఅందం అంకిత భావంతో చేస్తున్న కృషికి యన అభినందనలు తెలిపారు.

## 18 నుంచి నామినేషన్లు స్వీకరణ

**చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ రిటైర్నింగ్ అధికారి వెల్లడి**

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** మే 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు ఈనె 18 నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను రాజేంద్ర నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 10చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ రిటైర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం రిటైర్నింగ్ అధికారి కె.శశాంక వెల్లడించారు. మంగళవారం ఆయన రాజేంద్ర నగర్ రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌యందు అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్,డిఆర్ఓ సంగీతతో కలిసి వివరాలు వెల్లడించారు. 26న నామినేషన్‌లను పరిశీలించనున్నట్లు 27వ తేదీ నుంచి 29వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల కౌంటింగ్ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళశాల యందు 4వ తేదీ జరుగబోతుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలైన మహేశ్వరం,రాజేంద్ర నగర్,శేరిలింగం పల్లి,చేవెళ్ల,పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల నుంచి 29,28,186 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని ఆయన తెలిపారు. మావద్ద ఇంకా పెండింగ్‌లో ఉన్న 15వేల దరఖాస్తులను వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో 1222 ప్రాంతాల్లో 2877 పోలింగ్ కేంద్రాలను ఏర్పా ట్లు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలో జరిగే ఎన్నికల్లో మొత్తం 13443 పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు.





## అంతరాలులేని సమాజాన్ని నిర్మిద్దాం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** సమాజశ్రేయస్సు కోసం శ్రమించి అంతరాలు లేని సమాజాన్ని నిర్మించేదిశగా మన జీవనవిధానం ఉండాలని సిపిఐ నాయకులనుద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ రాష్ట్రసమితిసభ్యులు, సిపిఐ కొల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ తండ్రి మహమూద్‌ఖుద్దీస్ మరణించారు. సోమవారం రాత్రి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈసందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎస్‌ఎండి ఫయాజ్ కుటుంబం సిపిఐ ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. పరామర్శించినవారిలో సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ్మా, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు వార్లవెంకటయ్య, కేశవులుగౌడ్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జి, కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.ఇంద్ర, కోళ్లయేసయ్య, కొమ్ముభరత్, కొల్లాపూర్ సిపిఐ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, దళితహక్కులపోరాట సమితి జిల్లా కార్యదర్శి బండిలక్ష్మిపతి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిజ్జ శ్రీనివాసులు, సిపిఐటౌన్ కార్యదర్శి ఎండి యూసుఫ్, సిపిఐనాయకులు చింతలపల్లి కుర్మయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.



## డాక్టర్ మల్లురవిని గెలిపిద్దాం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని గెలిపించాలని మాలమహానాడు రాష్ట్రప్రధాన కార్యదర్శి ముచ్చపోతుశంకర్ అన్నారు. మండలకేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం ముచ్చపోతుశంకర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ సబ్బండవర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలన్నారు. బిజెపిప్రభుత్వం అధికారంలోకివస్తే భారత రాజ్యాంగంమార్పుతోపాటు, కులమతాలను ప్రోత్సహిస్తూ బడుగు బలహీనవర్గాల ప్రజలను అణచివేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను అమలుచేస్తుందని, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకివస్తేనే కార్పొరేట్ వ్యవస్థ, కుల వ్యవస్థను అణచివేస్తూ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ అభివృద్ధిని చూసి ఓటేయండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్-ప్రతినిధి :** రాష్ట్రంలో కెసిఆర్ పదేళ్లపాలనలో చేసిన అభివృద్ధిని చూసి బిఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాగర్‌కర్నూల్ బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పిమైదానంలో మార్నింగ్‌వాక్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరుగ్యారెంటీలపేరుతో ప్రజలకు ఆచరణసాధ్యంకాని అబద్ధపు హామీలిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకిరాగానే ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి నయవంచనచేసిందని విమర్శించారు. అనంతరం ఆర్‌టిసి బస్టాండు, అంబేద్కర్‌చౌరస్తాలో హమాలీసంఘం నాయకులతో కలిసి రైతుబజార్ మార్కెట్‌లోని వర్తక వాణిజ్య సముదాయాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనవెంట ఎంపిటిసి మంగివిజయ్, పార్టీసీనియర్ నాయకులు భాస్కర్‌గౌడ్, కొత్తగంగాధర్, కరణ్‌లాల్ పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ మాజీచైర్‌పర్సన్ పెద్దపల్లి పద్మావతి బంగారయ్యను డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఎండ తీవ్రతతో డీహైడ్రేషన్‌కి గురై నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆయనను మంగళవారం పరామర్శించారు.



## జోగుజ్యోతికి జాతీయనంది అవార్డు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ తెలుగువెలుగు ఉగాది జాతీయ పుష్కర ప్రదానోత్సవంలో జోగుజ్యోతి జాతీయనంది అవార్డును అందుకున్నారు. జొన్నలబొగుడ గ్రామానికి చెందిన కవి, గాయని జోగుజ్యోతి జిల్లా సమాచారహక్కు పరిరక్షణసమితి నాయకురాలిగా పాల్గొన్నారు. హైదరాబాద్ త్యాగరాయగానసభ భవనంలో సమాచారహక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్‌వాచ్‌కమిటి జాతీయచైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు, తెలుగువెలుగు సాహిత్యవేదిక జాతీయ స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మపోలోజు రాజకుమార్ చేతులమీదుగా జాతీయనంది అవార్డును అందుకున్నట్లు జోగుజ్యోతి తెలిపారు. జొన్నలబొగుడ గ్రామప్రజలు, మండలప్రజలు జోగుజ్యోతికి జాతీయనంది అవార్డువచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్‌సి, ఎస్‌టి కేసుపై డిఎస్‌పి విచారణ



**ప్రజాపక్షం/అడ్డాకుల :** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో అంబేద్కర్ జయంతి నాడు దళిత ఎంపిటిసి గణేష్‌పై దాడి నిమిత్తం అడ్డాకుల పోలీసు స్టేషన్లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయింది. మంగళవారం నాడు డీఎస్పి వెంకటేశ్వర్లు బలిదుపల్లి గ్రామంలోని స్పాట్ దగ్గరికి వచ్చి విచారణ చేపట్టారు. దోషులకు శిక్ష పడుతుందని తెలిపారు. వారి వెంట అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్, రైటర్ శంకర్ నాయక్, రాజు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలు



**ప్రజాపక్షం / పెబ్బేరు :** శ్రీరామనవమి సందర్భంగా పెబ్బేరు మండలం తిప్పాయపల్లి గ్రామంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే మెగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయం ఖాయం

### ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



**ప్రజాపక్షం / కొత్తకోట :** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలో నిర్వహించిన కొత్తకోట టౌన్ , మండల, మదనపురం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అథిథులుగా ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దేవుని అడ్డం పెట్టుకొని నీచ రాజకీయాలకు బీజేపీ పాల్పడుతుందని , బీజేపీ నీచ రాజకీయాలను తిప్పి కొట్టాలన్నారు. గత పదేళ్లు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండి విద్యార్థులకు, నిరుద్యోగులకు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఏం మోహం పెట్టుకొని బీజేపీ ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. డి.కె. అరుణ రామరాజ్యం కోసం బీజేపీకి ఓటెయ్యాలి అంటున్నారు. గత పదేళ్లు కేంద్రంలో ఉన్నది రామరాజ్యం కాదా లేక రాక్షస రాజ్యమా అంటూ ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీని డి.కె. అరుణ విమర్శించడం అంటే తిన్నింటి వాసాలు లెక్కబెట్టడం లాంటిదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేసిన, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. తదనంతరం కొత్తకోట, మదనపురం మండలాలకు చెందిన బీఆర్ఎస్ , బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



## కార్యకర్తలకు అండగా ఉంటాం

### ఎమ్మెల్యే మెగారెడ్డి

**ప్రజాపక్షం / పెబ్బేరు :** ఉమ్మడి పెబ్బేరు మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వల్లపురెడ్డి ఫంక్షన్ హాల్‌లో వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మెగారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామం వారిగా సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామ ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేకంగా సమైక్యత ఇచ్చి గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలు, గ్రామాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఎలా పని చేయాలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యంగా చేసుకొని పని చేస్తున్నానని, నియోజకవర్గ ప్రజలు సహకరించాలని వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పెబ్బేరు నాయకులు శ్రీనివాస్‌గౌడ్ , విజయవర్ధన్‌రెడ్డి, బీరం రాజశేఖర్‌రెడ్డి, శ్రీహరి రాజు, ప్రతి గ్రామం నుండి ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాపక్షం / పాన్‌గల్ : వేసవి కాలం నేపథ్యంలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ లోకనాథ్ , ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాన్‌గల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంను ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రస్తుతం తాగు నీటి సమస్య నెలకొందని అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామాలలో బోర్లు, బావులను లీజుకు తీసుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మి చంద్రశేఖర్ నాయక్ , వైస్ ఎంపీపీ కవిత దశరథ్ నాయుడు, ఎంపీడీఓ కోటేశ్వర్ , డిటి ఆశోక్ కుమార్ , ఎంపీఓ రఘురామయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొత్తకోటలో ముగిసిన రంజాన్ ట్రోఫీ

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలో నిర్వహించిన రంజాన్ ట్రోఫీ క్రికెట్ గేమ్‌లో విన్నర్‌గా వనపర్తి క్రికెట్ టీం, రన్నర్‌గా జడ్చర్ల టీం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, తాజా , మాజీ ఎమ్మెల్యే ఆల చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్న విజేతలు. కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని ఈద్గా వద్ద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల ఆల యువసేన క్రికెట్ రంజాన్ ట్రోఫీ గత మూడురోజుల క్రితం ప్రారంభం కాగా 22 టీంలు పాల్గొనగా, వనపర్తి క్రికెట్ టీం విన్నర్‌గా ఫైనల్ కప్ సాధించగా జడ్చర్ల టీం రన్నర్‌గా రెండో స్థానంలో నిలిచి రెండవ బహుమతి అందుకున్నది. ఈ బహుమతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

## జలమండలి ఉన్నతాధికారులతో ఎండి సుదర్శన్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి ఉన్నతాధికారులతో ఎం.డి. సుదర్శన్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో డివిజన్ల వారీగా ట్యాంకర్‌ల బుకింగ్స్, డెలివరీ, పెండెన్సీ, పర్యవేక్షణ, అదనపు ట్యాంకర్లు, రోజువారీ, రాత్రి వేళల్లో సరఫరా చేసే ట్రిప్పులు, నీటి సరఫరా, అదనపు జలాల కేటాయింపు తదితర అంశాలపై ఎం.డి. సమీక్షించారు. డివిజన్ల వారీగా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ ట్రిప్పులు, నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యల గురించి ఆరా తీశారు. నీటి సరఫరాలో ప్రెజర్ సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం లేకుండా చూడాలన్నారు. ఒకవేళ ఆలస్యమైతే వినియోగదారులకు సందేశం పంపించాలని సూచించారు. అంతకు ముందు నారాయణగూడ, చిలకలగూడలలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. లాగ్ బుక్స్, నీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** కేసిఆర్ హయంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, బీడు భూములకు సాగునీరు అందిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురంలోని పద్మశాలి భవన్‌లో జరిగిన పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వనపర్తి జిల్లాను సస్యశ్యామలం చేసే గణప సముద్రం, బుద్దారం రిజర్వాయర్లను ప్రారంభించిన ఘనత కేసీఆర్ దేవన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రాజెక్టు పనులు తక్షణమే పూర్తి చేసి, వచ్చే సీజన్‌లో సాగునీరు అందించేలా ప్రభుత్వంపై ఒత్తడి తెస్తామన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ భారాసా అభ్యర్థి డా. ఆర్.ఎస్ . ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో కరువు వచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వ స్పందించడం లేదన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ , నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇంచార్జీ అభిలాష్ రావు, సీనియర్ నాయకులు ప్రత్యూష, స్థానిక ఎంపీపీ కృష్ణనాయక్ , జడ్పీటీసీ సామ్యనాయక్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త బస్సులు మంజూరు చేయండి

### ఆర్‌టిసి ఎండి సజ్జనార్‌తో చిన్నారెడ్డి భేటీ



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి ఆర్టీసీ డిపోకు మరో 26 కొత్త బస్సులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి ఆర్టీసీ ఎండికి లేఖ రాశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి బస్ భవన్‌లో సమావేశమయ్యారు. ప్రజా రవాణాలో వనపర్తి ఆర్టీసీ డిపోకు గొప్ప పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనే అతి పురాతన ఆర్టీసీ డిపోగా వనపర్తికి ఖ్యాతి ఉందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. నిజాం నవాబుల కాలంలోనే వనపర్తిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు అయిందని, వనపర్తి ఆర్టీసీ డిపోకు కొత్తగా మరో 26 బస్సులు మంజూరు చేయాలని చిన్నారెడ్డి, ఆర్టీసీ ఎండి సజ్జనార్‌ని కోరారు. అందుకు ఆర్టీసీ ఎండీ సానుకూలంగా స్పందించారు. వనపర్తి పాత బస్టాండ్ ప్రాంతాన్ని అభివృద్ధి పర్చి వాణిజ్య పరంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కూడా చిన్నారెడ్డి , ఆర్టీసీ ఎండిని కోరారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం రావడంతో పాటు వనపర్తి పట్టణ ప్రజలకు వ్యాపారపరంగా లాభం చేకూరుతుందని చిన్నారెడ్డి అభిప్రాయ పడ్డారు. దీనికి కూడా ఆర్టీసీ ఎండి సానుకూలంగా స్పందించారని చిన్నారెడ్డి తెలిపారు.




## అందరి త్యాగ ఫలితమే...

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** అందరి త్యాగ ఫలితమే నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు . పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణం లోని క్రౌన్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారని , బిఆర్‌ఎస్ బిజెపి రెండు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. వారి కుటిల రాజకీయాలను తిప్పికొట్టేందుకు అందరూ సమాయత్తం కావాలని, క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు ,మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వినోద్ కుమార్ , టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎపి మిథున్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను అవమానిస్తున్న పార్టీలకు గుణపాఠం




**ప్రజాపక్షం/మహబూబ్-నగర్ ప్రతినిధి :** పాలమూరు పార్లమెంట్ బీసీ బిడ్డలకు జరుగుతున్న అవమానాలను బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తూ త్వరలో జరగబోవు పార్లమెంటు ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి బరిలో ఉన్న ముగ్గురు రెడ్డిలను ఒడగొట్టి బీసీ అభ్యర్థి పార్లమెంట్లో అడుగుపెట్టబోతున్నాడని బీసీ సమాజ్ నుంచి బలమైన బీసీ అభ్యర్థి బరిలో ఉంటున్నట్లు బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏం . శ్రీనివాస్ సాగర్ వెల్లడించారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారాయణ పేట సభలో ప్రసంగిస్తూ షరితులతో కూడిన తన ప్రజంగంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిస్తే ముదిరాజ్ బిడ్డను ఆగస్టులో మంత్రిని చేస్తారని ప్రకటించడం విడ్డూరంగా ఉందని కనీసం పార్టీ జాయిన్ కాకముందే క్యాబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు . రెడ్డిలకు ఒక న్యాయం బీసీలకు ఒక న్యాయమా అని ప్రశ్నిస్తూ ముఖ్యమంత్రి మాకు నిజంగా బీసీల పట్ల ప్రేమ ఉంటే , ముదిరాజులపై అభిమానం ఉంటే రేపే మంత్రి వర్గంలోకి వాకిటి శ్రీహరిని తీసుకొని మాట నిలుపుకోవాలని శ్రీనివాస్ సాగర్ అన్నారు. ఈఎన్నికల్లో బీసీ సమాజ్ ప్రత్యేక ప్రణాళికతో మన ఓటు మనమే వేసుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తూ ఈసారి ముగ్గురు రెడ్డిల ఓటమి ధ్యేయంగా ముందుకెళుతూ బీసీ అభ్యర్థిని పార్లమెంటు పంపే విధంగా ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాల్లో సభలతో బీసీలందరిని చైతన్యపరుస్తూ, ఐక్యమత్యంతో ముందుకెళ్లి బీసీ బిడ్డను పార్లమెంటుకు పంపే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, పద్మశాలి సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, గోపాల్ ముదిరాజ్, రమేశ్ యాదవ్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సవారి సత్యం, రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారం సత్యం, బీసీ సమాజ్ దేవరకద్ర కన్వీనర్ బి.శేఖర్ పాల్గొన్నారు.




## మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పునరాలోచించి మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా టికెట్లను కేటాయించాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కోరారు. సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టిఎస్‌ఎ) ఆధ్వర్యంలో మహనీయుల జయంతి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ సభాధ్యక్షతన '' మాదిగల వాటా కోసం మాట సామాజిక తెలంగాణ సాధన కోసం'' అనే అంశంపైన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు , వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, ప్రొఫెసర్ కాసిం, రామిల్ల రాధిక, సురేందర్ మాదిగ,బి.నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, కానీ మాదిగలకు ఎంపి టికెట్ల కేటాయించే అంశాన్ని పునరాలోచన చేయాలన్నారు. ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం దండోరా ఉద్యమంతో మొదలైందన్నారు. మాదిగ ఉద్యమం మిగతా అణగారిన వర్గాలకు తోడుగా నిలిచి ప్రస్తుతం తన భవిష్యత్తును ప్రశ్నార్థకంగా చేస్తుందని తెలిపారు. పసునూరి దయాకర్ మాట్లాడుతూ తన రాజకీయ జీవితం దండోరా ఉద్యమంతో మొదలైందన్నారు.రమిళ్ళ రాధిక మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసిన తనను సమాజం గుర్తించినప్పటికీ, ధన ప్రవాహం ముందు తన పోరాటానికి విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల విద్యార్థి నాయకులు లింగంపల్లి మనోజ్, సోమశేఖర్ మాదిగ , పాల్వాయి నగేష్, కంచర్ల బద్రి, కొమ్ము శేఖర్ చాగంటి రాజేష్ సుమంత్ ఉదయ్, బోనాల నగేష్ ,బొర్రా శాంతి కుమార్ దర్శనం జాన్, అందే కృష్ణ, నవీన్ రాజ్, జోగు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### రానున్న వర్షాకాల సీజన్‌కు..

# పటిష్టమైన ముందస్తు చర్యలు

### మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. దానకిషోర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న వర్షాకాలంలో హైదరాబాద్ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తిస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డిలతో కలిసి జిహెచ్‌ఎంసి పరిధిలో వర్షాకాల ముందస్తు ప్రణాళికపై ఈఎన్‌సి, జోనల్ కమిషనర్లు, ఎస్‌ఇలతో సమీక్షించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో నగర వాసులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్‌ఎఫ్) అన్ని వేళలా అప్రమత్తమై సిద్ధంగా ఉండాలన్నారు. ఫైర్, జలమండలి, జిహెచ్‌ఎంసి, పోలీస్ తదితర శాఖలన్ని కలిసి మే నెల చివరి వారంలో కానీ, జూన్ మొదటి వారంలోగా మాక్ డ్రిల్ ఏర్పాటు చేయాలని, వరదలు వచ్చినప్పుడు ఏ విధంగా సంసిద్ధంగా ఉండాలన్న దానిపై చేసి చూపాలని, ఏదైనా ఆపద సంభవిస్తే ఆయా అధికారులు వచ్చి అండగా ఉంటారన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సూచించారు. సాధారణంగా చేపట్టే పూడిక తీత పనులపై ప్రజలకు అవగాహన కోసం ఎగ్జిబిషన్ పెట్టాలని, వరద ముంపు కోసం చేపట్టిన పనులు 52 శాతం పూర్తైనవని, మిగిలిన అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**నీరు నిలిచే ప్రాంతాల్లో శాశ్వతంగా సమస్యలు పరిష్కరించాలి..**

జిహెచ్‌ఎంసి పరిధిలో 125 నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించారని, 22 ప్రాంతాలలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని, 40 ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన సమస్యలు పరిష్కరించేందుకు వ్యక్తిగతంగా వెళ్లి పరిశీలించి, శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులకు ఆయన మార్గనిర్దేశం చేశారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈలకు స్పష్టం చేశారు. కల్వర్టులను శుభ్రం చేయించాలని, కల్వర్టుల వద్ద ఇతర యుటిలిటీలను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. జూన్ మొదటివారంలోగా నాలాలన్నింటిలో పూడికతీత పనులు చేయాలన్నారు. 1304 కి.మీ. పొడవు నాలాలు ఉన్నాయని, నాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలో భాగంగా నాలాల ఆడిట్ చర్యలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు నాళాలలో చెత్త వేస్తున్నారని, నాలాలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్కడ చిన్న చిన్న చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి, చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల కోసం చేపడుతున్న వర్షాకాల ప్రణాళిక కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. క్రమం తప్పకుండా చేసిన పనులు, జరుగుతున్న పనులు ప్రజలకు తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అంతకు ముందు జోన్‌ల వారీగా చేపట్టిన పనులు, వర్షాకాల ప్రణాళికల సంసిద్ధతపై ఆయా జోనల్ అధికారులు ఆయనకు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్‌సి జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్లు ఎన్. రవి కిరణ్, హేమంత్ బోర్కడే, సహదేవ్ రావు, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, ఎస్. పంకజ, వెంకన్న, సిఈలు దేవానంద్, కిషన్, ఎస్ఈ ఆనంద్, జోనల్ ఎస్.ఈలు అశోక్ రెడ్డి, చిన్న రెడ్డి, అనిల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సైన్స్‌శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చర్లపల్లి :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వేసవి సైన్స్ శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఇటిడిసి సైంటిస్ట్ కర్రె మల్లేశం ఇసీఐఎల్ కార్యాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. వేసవి శిక్షణ శిబిరాన్ని కుషాయిగూడ, చర్లపల్లి, కాప్రా, కమలానగర్, గాయత్రి నగర్, మహేష్ నగర్, ఏఎస్ రావు నగర్, మౌలాలీ ప్రాంతాల విద్యార్థిని, విద్యార్థులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9491550128, 9246543662, 8919204421ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పిట్టల నాగరాజు,శివ ప్రసాద్,దుర్గాచారి పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అధికారులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఇటీవలే దుండిగల్ మున్సిపల్ పరిధిలో కుంటలు చెరువు ఎఫ్టిఎల్ బఫర్లలో నిర్మాణాలు జోరందుకోవడంతో మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ మూడు శాఖ అధికారుల సమన్వయంతో మంగళవారం కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని దుండిగల్ గ్రామంలోని పెద్ద చెరువు బఫర్ లో నిర్మించిన ప్రహరీ గోడ, డిపి పల్లి లో కుంటను ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్ వాల్ ను తొలగించారు. కబ్జాలను కూల్చివేసేందుకు వెళ్లిన అధికారులకు స్థానిక బిఆర్ఎస్ ప్రజాప్రతినిధి నుండి ఒత్తిడి రావడంతో మధ్యలో కూల్చివేతలు నిలిపివేశారు. ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, స్వయంగా వచ్చి ముల్లభాయ్ కుంటలో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించినట్టు సమాచారం. దుండిగల్ మండల ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి, ఇరిగేషన్ ఎఈ నిఖిత ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులు వందశాతం పూర్తిచేయాలి

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ఉపాధి హామీపనులు వందశాతం పనులు పూర్తి అయ్యేలా చూడాలని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులు అదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పూర్తికి పక్కా ప్రణాళికతోముందుకెళ్లాని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులలో కూలీల సంఖ్యను పెంచుతూ పనులు చేయించాలని, ప్రతిరోజు పనులు పూర్తి అయిన వాటికీ తప్పని సరిగా ఎఫ్‌టిఒ జనరేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీల ఆరోగ్యంపై భద్రత పెంచాలని, లేబర్ తక్కువగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కూలీలు ఉదయం వచ్చి పనులు చేసి మధ్యాహ్నం వరకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పని చేసే చోట తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులు అదేశించారు. గ్రామ పంచాయతీ పనులలో లేబర్ సమీకరణ చేస్తు పద్ధతి ప్రకారం పనులు చేపడితే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చుని కలెక్టర్ అన్నారు. గ్రామాల్లో తాగునీటి సరాఫరాలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా తాగు నీరు సమస్య ఏర్పడితే అధికారులు వెంటనే స్పందించి 24 గంటల్లో రిపేరు చేసి తాగు నీటి సమస్య రాకుండా చూడాలని అదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్‌లు , జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

### రోడు ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించాలి

రోడ్డు ప్రమాదాల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి , అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను గత మూడు సంవత్సరాలకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగడానికి గల కారణాలను క్షణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. అధికారులు సమన్వయంలో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కేంద్రంలో పార్కింగ్ స్థలం లేకపోవడం ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలపడం కారణంగా ప్రజలు అసౌకర్యానికి గురి అవుతున్నారని తెలిపారు. రవాణాశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివిధ వాహనాలతో పాటు పాఠశాలలో అద్దెకు తీసుకోని నడిపిస్తున్న బస్సుల ఫిట్నెస్ ,డ్రైవర్ లైసెన్సులను తనిఖీ చేయాలని కలెక్టర్ అదేశించారు. పండిన పంటలను నూర్పిళ్లు చేయడం వల్ల ప్రమాదాలపై కూడా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి ధాన్యమును సేకరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర నారాయణరెడ్డి తెలిపారు. పరిగి మండల కేంద్రంలో వరి ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి కలిసి ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీపుకోవడం జరిగింది అని అన్నారు. వరి పంటకు గ్రేడ్ రకానికి 2203 సాధారణ రకానికి 2183 రూపాయలు చెల్లిస్తున్నట్లు అయన తెలిపారు.



## సెక్టార్ అధికారులు పోలింగ్ స్టేషన్‌లను సందర్శించాలి : ఎఆర్‌ఒ



**ప్రజాపక్షం/తాండూరు :** సెక్టార్ అధికారులు తమ కెటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి నివేదికలు అందించాలని చేవెళ్ళ పార్లమెంట్ తాండూరు సెగ్మెంట్ సహాయ ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం తాండూరు సబ్ డివిజన్ కార్యాలయంలో సెక్టార్ అధికారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మే13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా నిర్వహించేందుకు సెక్టార్ అధికారులు తమతమ పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి పోలింగ్ సిబ్బందికి అవసరమగు తాగునీరు, కరెంటు సదుపాయం, ఓటర్లకు అనుగుణంగా టెంటు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సౌకర్యలు లేకుంటే తమకు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, కిషన్ వెంకటేష్, మునిరుద్దీన్, ఎన్నికల ఉపతహసీల్దార్ లలిత, మాస్టర్ ట్రైనర్స్ బస్వరాజ్, మృత్యుంజయస్వామి పాల్గొన్నారు.

## అన్నదానానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/నాగారం :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు పంచముఖ హనుమాన్ దేవాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి మున్సిపల్ బిజెపి కార్యదర్శి,10వ వార్డు కంటెస్టెడ్ కౌన్సిలర్ జూపల్లి నరేష్ 15 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నవీన్‌గౌడ్, సూర్యశేఖర్‌రెడ్డి, బి.సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** మల్కాజ్‌గిరి పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బిఆర్ఎస్ నాయకులు బిజెపిలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు గణేష్ ముదిరాజ్, ఏనుగు సీతారాంరెడ్డి, ఏనుగు మంజుల, వారాల సతీష్‌ముదిరాజ్, సంపత్‌ముదిరాజ్, నాగేష్ ముదిరాజ్, సత్యనారాయణగౌడ్‌లకు బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మర్రి మోహన్ రెడ్డి, రమేష్ యాదవ్, పద్మారెడ్డి, మల్లేష్ వంశరాజ్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య రానివ్వం..

### కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం /కొడంగల్ :** కొడంగల్ మున్సిపల్‌లో తాగునీటి సమస్య రానివ్వమని మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఆయన తన అనుచరులతో కలిసి గ్రామంలో తాగునీటి, విద్యుత్ తదితర సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కడేక్కడ బోరు బావులు ఉన్నాయి, చేతి పంపులు ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నిరంతర కరెంటు సరఫరాపై గ్రామంలోని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేశాలతో ఎవ్వరికి కూడా ఎలాంటి సమస్యలు రానివ్వకుండా 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యమ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీరితో పాటు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మురారీ వశిష్ట, సయ్యద్ మునీర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నయ్యూమ్ పాల్గొన్నారు.

## 'ఆర్గాలా రివైవ్' వైద్య పునరావాస కేంద్రం ప్రారంభం

### చికిత్స ముందు, తరువాత సేవలే లక్ష్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శస్త్రచికిత్స ముందు, తరువాత సేవలు, ఫిజియోథెరపీ సేవల కోసం ఏర్పాటు చేసిన 'అర్గాలా రివైవ్' వైద్య పునరావాస కేంద్రాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఇది ప్రపంచ స్థాయి మల్టీ స్పెషాలిటీ సెంటర్. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఇలాంటి కేంద్రాలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా అర్గాలా హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి యడవల్లి మాట్లాడుతూ ఆర్గాలా రివైవ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డే కేర్ మెడికల్ రిహాబ్ సెంటర్ అన్నారు. ఆర్థో, న్యూరో, కార్డియాక్, జెరియాట్రిక్ రిహాబ్‌లలో ప్రపంచ స్థాయి సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల నేతృత్వంలో నిర్దిష్ట లక్ష్యాలు, సమయానుకూల ఫలితాలతో కచ్చితంగా రూపొందించబడిందని తెలిపారు. రోగుల ప్రత్యేక అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన ప్రత్యేక కేర్ జోన్‌లను ఈ సెంటర్ కలిగి ఉందని వివరించారు.

# కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి

### పట్నం సునితా మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు ఐక్యంగా కృషిచేయాలని కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్‌లలో సంక్షేమ సంఘాలు, కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి ఆధ్వర్యంలో కల్పనా సొసైటీలోని కమిటీ హాల్‌లో మరియు సుచిత్ర టిఎన్ఆర్ గార్డెన్స్‌లో వేర్వేరుగా జరిగిన సమ్మేళనానికి మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి పట్నం సునిత మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కూన శ్రీశైలంగౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీకి కంటుకోట అని సిఎం రేవంత్ రెడ్డి ఇక్కడి నుండి ఎంపీగా గెలుపొందిన విషయాన్ని గుర్తు చేశారు. నేటి వరకు బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఎన్నడూ మల్కాజ్‌గిరి నుండి గెలవలేరని అన్నారు. ఈ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్‌లలోని కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల సమస్యలను, కుల సంఘాల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. బూత్ స్థాయి నుండి పార్టీ కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేసి సీఎం రేవంత్ రెడ్డికి మల్కాజ్ గిరి ఎంపి స్థానం గెలుపును కానుకగా ఇవ్వాలని చెప్పారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి వలసలుగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని, పార్టీలో చేరుతున్న వారంతా కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కెఎం ప్రతాప్, శోభారాణి, నర్సారెడ్డి భూపతి రెడ్డి, జోష్న రెడ్డి, పున్నారెడ్డి, లక్ష్మీ , సంక్షేమ సంఘం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనాధాశ్రమంలో పండ్లు పంపిణీ

**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరిః** సమాజ సేవకు అంకితమై సేవా కార్యక్రమాల్లో పాల్గొని పేదలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ముదిరాజ్ యువజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి తలారి రాజు ముదిరాజ్ అన్నారు. పలు అనాధాశ్రమాలను ఆయన సందర్శించి ముదిరాజ్ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అక్కడ చిన్నారులకు అవసరమైన నోట్ పుస్తకాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తలారి ఒవిన్ ముదిరాజ్ పుట్టిన రోజును పురస్కరించుకుని అనాధ పిల్లల ఆనందోత్సాహాల నడుమ కేక్ కట్ చేయించి వేడుకలను నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. అలాగే వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

## ఓబిసి ఇన్‌చార్జిగా వీరేశం

**ప్రజాపక్షం/బంట్వారం :** చేవెళ్ళ పార్లమెంట్ ఓబిసి డిపార్ట్‌మెంట్ ఇంచార్జిగా వికారాబాద్ నియోజక వర్గం బంట్వారం మండల పరిధిలో ఉన్న తొర్మామిడి గ్రామానికి చెందిన కె.వీరేశం నియామకమయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఇంచార్జీ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభ పతి గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ ఓబిసి చైర్మన్ శ్రీ నూతి శ్రీకాంత్‌కు జిల్లా నాయకులకు, కార్యకర్తలకు నాయకులకు వీరేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దేశాభివృద్ధికి బిజెపికే ఓటేయాలి



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరిః** దేశ భద్రత, అభివృద్ధి కోసం బిజెపికే ఓటు వేయాలని బిజెపి సీనియర్ నేత రాంబాబు అన్నారు. మంగళవారం గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మధుసూధన్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మల్కాజ్‌గిరి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు మల్కాజ్‌గిరి అభివృద్ధికి మలుపు అన్నారు. కార్యక్రమంలో నారబోయిన మహేష్, శిఖర శ్రీనివాస్, ఆనంద్, సుబ్రహ్మణ్యం, హరీరాజు, రాజేష్, శ్రీకాంత్ గుప్తా, వికాస్ పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి నేత మోహన్ యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం నాడు బూత్ నెంబర్ 262 ఆర్టీసి కాలనీలో ఆయన ప్రచారం చేపట్టారు. కమలం గుర్తుకు ఓటు వేసి బిజెపి అభ్యర్థి ఈటలను గెలిపించాలని ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుజాత, స్వరూప, వాణి, చంద్రమ్మ, సుమ దీప్తి, గణేష్, మహేష్ యాదవ్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

### కూన శ్రీశైలంగౌడ్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్గిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ లకు సంబంధించి సంక్షేమ సంఘాలు, కులసంఘాల ఆత్మీయ సమావేశం కల్పనా సొసైటీ లోని గుజరాతి కమ్యూనిటీ హాల్, సుచిత్ర టిఎన్ ఆర్ గార్డెన్ లలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేరు వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు లతో కలిసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలపరిచిన మల్కాజ్గిరి అభ్యర్థి శ్రీమతి సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కుల సంఘాలు, సంక్షేమ సంఘాలను శ్రీశైలం గౌడ్ కోరారు. మల్కాజ్ గిరి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఇప్పటి వరకు బీఆర్ఎస్, బీజేపీ లు ఇక్కడ గెలవలేదని, ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని అన్నారు. బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేసి ముఖ్యమంత్రి కి మల్కాజ్ గిరి స్థానాన్ని కానుకగా ఇవ్వాలన్నారు. పలువురు నాయకులు బీజేపీ నుండి కాంగ్రెస్ లో చేరగా, వారికి సునీతా మహేందర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి, జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కేఎం ప్రతాప్, నియోజకవర్గ కోఆర్డినేటర్ బంద్రు శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు నర్సారెడ్డి భూపతి రెడ్డి, కందాడి జోష్ణ శివారెడ్డి, సొంటి రెడ్డి పున్నారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మీ, డివిజన్ అధ్యక్షులు, ఇంచార్జులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ హామీల అమలు ఎప్పుడు?

### ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్‌లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ లేదని, రేవంత్ ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు అవుతాయని అని బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటిలో శామీర్‌పేట మండల మాజి ఎంపిపి బొల్లెబోయిన చంద్రశేఖర్‌యాదవ్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఈటెల రాజేందర్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఆయనతో పాటు సుమారు 100 మంది బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే దాని విలువ జీరో అని చెప్పారు. కాంగ్రెస్ గెలువడం కోసం ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు కాసుల ఈశ్వర్‌గౌడ్, బిజెపి మేడ్చల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, అమరం మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నేతలు

**మేడ్చల్ ప్రతినిధి:** కుటుంబ పాలన, మోసం, అవినీతితో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని పదేళ్ల పాలనలో భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేకతతో ఇక కనుమరుగయినట్లే అని మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు గనేష్ ముదిరాజ్, ఏనుగు సీతారాంరెడ్డి, మంజుల రెడ్డిలతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు బిజెపి సీనియర్ నేత మర్రి మోహనరెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డిల నేతృత్వంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు వేసే ఓటు వృథాగా పోతుందని, అనుభవ రాహిత్యంతో అమలు చేయలేని హామీలతో అధికారం దక్కించుకొన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచిస్తుందన్నారు. ఈ రెండు పార్టీలను ఈ ఎన్నికల్లో తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, కుంటల కిరణ్‌కుమార్, తేలు నాగరాజు, వెంకటేష్, శ్రీకాంత్, వంశీపాపిరెడ్డి, ఎంపల్ల పద్మారెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

## అనుమతులులేని ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లపై దాడులు

### సీజ్ చేస్తూ నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖాధికారులు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎలాంటి అనుమతులు లేకుండా ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల ల్యాబ్‌లను నడిపిస్తున్న వారిపై జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులు దాడులు నిర్వహిస్తూ చర్యలు తీసుకొంటున్నారు. పోలీసు విభాగం సహకారంతో నిర్వాహకులపై కేసులు నమోదు చేయిస్తున్నారు. నకిలీ వైద్యులు, ఆస్పత్రులు, మెడికల్ షాపుల విషయంలో తనిఖీలు నిర్వహిస్తూ కఠినంగా వ్యమహరించాలంటూ నేషనల్ మెడికల్ కమిషన్ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో గత కొద్ది కాలంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి నేతృత్వంలో తనిఖీలు చేస్తూ చట్ట ప్రకారం అనుమతులు లేని వాటిని సీజ్ చేస్తున్నారు. తాజాగా మంగళవారం తమకందిన విశ్వసనీయ సమాచారంతో మేడ్చల్ మండలంలోని గుండ్ల పోచంపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రథమ చికిత్సల పేరిట మేఘావత్ కవిత ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.నారాయణరావు, కీసర డివిజన్ డా.లావణ్య, రంగవరం పిహెచ్‌సి డా.శ్రీహస, గుండ్లపోచంపల్లి బస్తీ దవఖానా వైద్య అధికారి శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు అధికారులతో కల్సి కవిత నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్ర ఆస్పత్రిపై దాడి చేసారు. ఆమె వద్ద ఆస్పత్రికి సంబంధించిన తెలంగాణా మెడికల్ కమిషన్ జారీ చేసిన ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవటంతో చట్టవిరుద్ధంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నట్లు నిర్ధారించి దాన్ని సీజ్ చేయటంతో పాటు ఆమెపై పోలీసు కేసు నమోదు చేశారు. ఇదేవిధంగా ఈనెల ఆరున సైనిక్‌పురిలోని గోకుల్‌నగర్ ప్రాంతంలో గీతా ఫ్రాన్సిస్ నడిపిస్తున్న అనుమతులు లేని ప్రథమ చికిత్సా కేంద్రం, మూడవ తేదీన షాపూర్‌నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్‌ఆర్ శ్రీజన్ క్లినిక్, శ్రీ వీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లతో పాటు వైద్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్న పూర్ణ ల్యాబ్‌లపై దాడులు నిర్వహించి వాటిని సీజ్ చేశారు.

## భూదేవి,లక్ష్మీసమేత వేంకటేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లుపూర్తి

**ప్రజాపక్షం/తాండూరు/బంటారంః** భక్తుల కోరికలు తీర్చే ఇలవేల్పుగా పేరుగాంచిన శ్రీభూదేవి, లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి(బాలాజీ)జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఐదు రోజుల పాటు సాగే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 17 నుండి 24వరకు నిర్వహించేందుకు గాను ఆలయ కమిటి సభ్యులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. వికారాబాద్ జిల్లా బంటారం మండల పరిధి తొర్మామిడి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాలు ప్రతి యేటా దవున పున్నమి రోజున నిర్వహిస్తారు. ఆలయానికి 400సంవత్సరాల చరిత్ర ఉంది. ఆలయ పున్నర్ నిర్మాణంలో ఈ ప్రాంతంలోని ప్రతి రైతు చందాలు అందించి భక్తిని చాటుకున్నారు. 30యేళ్ళ తరువాత ఆలయానికి పూర్వ వైభవం సంతరించుకుంది. ఆలయ ప్రాంగణంలోని విగ్రహాలకు, గోపురాలను రంగులతో తీర్చిదిద్దారు.

## శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ బాచుపల్లి, కౌసల్య కాలనీలో నూతనం నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ, శ్రీదేవి భూదేవి సహిత శ్రీవెంకటేశ్వర, శ్రీ శివ పంచాయతన, శ్రీలలితా పరమేశ్వరి, నవగ్రహ ఆలయాన్ని శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఆలయంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని విధాలుగా సిద్ధం చేశారు. సీతారాముల కళ్యాణం ఉదయ 11;45 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నారు. ఈ వేడుకలకు భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సీతారాముల వారి ఆశీస్సులను పొందాలని సూచించారు. బాచుపల్లి కౌసల్య కాలనీలో శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ, శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర, శ్రీ శివపంచాయతన, శ్రీలలితాపరమేశ్వరి, నవగ్రహ మూర్తులు కొలువయ్యేలా ఆలయ నిర్మాణం చేపట్టే అదృష్టం తనకు దక్కడం పూర్వజన్మ సుకృతంగా బావిస్తున్నానని ఆలయ కమిటీ చైర్మన్, నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నారు.

## క్రీడ



### బట్లర్ శతకం..

# కోల్‌కతాపై రాజస్థాన్ విజయం

**కోల్‌కతా :** ఐపిఎల్17లో రాజస్థాన్ ఆరో విజయాన్ని నమోదు చేసింది. కోల్‌కతా నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని 2 వికెట్ల తేడాతో ఛేదించి గెలుపును సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులు చేసింది. నరైన్ (109; 56 బంతుల్లో) శతకంతో అదరగొట్టాడు. అవేశ్ ఖాన్ 2, కుల్‌దీప్‌సేన్ 2, బౌల్ట్ 1, చాహల్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన రాజస్థాన్ 8 వికెట్లు కోల్పోయి చివరి బంతికి లక్ష్యాన్ని అందుకుంది. జోస్ బట్లర్ (107*; 60 బంతుల్లో) చెలరేగి ఆడి శతకం బాదేశాడు. రియాన్ పరాగ్ (34; 14 బంతుల్లో), పావెల్ (26; 13 బంతుల్లో) దూకుడుగా ఆడారు. హర్షిత్ రాణా 2, వరుణ్ 2, నరైన్ 2, వైభవ్ 1 వికెట్ తీశారు.

# వీరుడొచ్చాడు.. సన్‌రైజర్స్‌కు దొరికిన మరో వార్నర్



సన్‌రైజర్స్ హైదరాబాద్ అంటే ఒకప్పుడు డేవిడ్ వార్నర్ మెరుపులే గుర్తుకొచ్చేవి. ఓపెనర్‌గా క్రీజులో అడుగుపెట్టడం.. ధనాధన్ ఇన్నింగ్స్‌తో జట్టుకు మెరుపు ఆరంభాలను అందించడమే పనిగా వార్నర్ సాగాడు. కెప్టెన్ కూడా కావడంతో మరింత బాధ్యతతో నిలకడగా పరుగులు సాధించాడు. కానీ వార్నర్ వెళ్లిపోయిన తర్వాత ఆ లోటు కనిపించింది. ఓపెనింగ్‌లో ఖాళీ. రెండు సీజన్ల పాటు ఆ వెలితి అలాగే ఉంది. కానీ ఇప్పుడొక వీరుడొచ్చాడు. అదే ఆస్ట్రేలియా నుంచి.. అలాంటి లెఫ్టార్మ్ బ్యాటరే బరిలోకి దిగాడు. సంచలన బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. అతనే.. ట్రావిస్ హెడ్.. సన్‌రైజర్స్‌కు దొరికిన మరో వార్నర్.

**ఆసీస్ నుంచే :** మెరుపు ఆరంభాలను అందించే మరో ఓపెనర్ సన్‌రైజర్స్‌కు దొరుకుతాడా?.. ఇవీ 2022 వేలానికి ముందు వార్నర్‌ను సన్‌రైజర్స్ వదులుకున్నప్పుడు రేకెత్తిన ప్రశ్నలు. 2022, 2023 సీజన్లలో ఈ ప్రశ్నకు జవాబు దొరకలేదు. మార్‌క్రమ్, మయాంక్, అభిషేక్, హ్యారీ బ్రూక్ ఇలా వేర్వేరు ఓపెనింగ్ జోడీలను పరీక్షించినా ఫలితం దక్కలేదు. అలాంటి దశలో తానున్నానంటూ హెడ్ వచ్చాడు. ఆస్ట్రేలియా నుంచే వార్నర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు దూసుకొచ్చాడు. సన్‌రైజర్స్ తరపున ఇలా ఐపిఎల్‌లో అడుగుపెట్టాడో, లేదో అలా రెచ్చిపోతున్నాడు. అయినా అతనంతే. ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే.. ఒక్కసారి పిచ్‌పై అంచనాకు వచ్చి బంతిపై గురి కుదిరితే ఇక ఆగడు. 2013లోనే హెడ్ ఐపిఎల్‌లో అడుగుపెట్టాడు. అప్పుడు రూ.30 లక్షలకు అతడిని ఢిల్లీ తీసుకుంది. కానీ ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఆ తర్వాత ఆర్‌సిబి అతడిని రూ.50 లక్షలకు కొనుగోలు చేసింది. 2016, 2017 సీజన్లలో ఆర్‌సిబికి ఆడిన అతను.. 10 మ్యాచ్‌ల్లో 138.51 స్ట్రైక్‌రేట్‌తో 205 పరుగులు చేశాడు. ఆ తర్వాత వివిధ కారణాలతో లీగ్‌కు దూరమయ్యాడు. 2023 సీజన్‌కు ముందు వేలంలో అతడిని ఎవరూ కొనుక్కోలేదు. కానీ నిరుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో, వన్డే ప్రపంచకప్ తుదిపోరులో కీలక ఇన్నింగ్స్ ఆడి ఆసీస్‌ను విజేతగా నిలిపిన హెడ్‌కు ఈ సీజన్‌కు ముందు జరిగిన వేలంలో డిమాండ్ ఏర్పడింది. ఇతర జట్లతో పోటీపడీ మరీ సన్‌రైజర్స్ రూ.6.80 కోట్లకు దక్కించుకుంది. ఇప్పుడా ధరకు న్యాయం చేస్తూ హెడ్ చెలరేగుతున్నాడు.

**ఇలా సాగితే :** 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఐపిఎల్ ఛాంపియన్‌గా నిలపడంలో వార్నర్‌ది కీలక పాత్ర. 848 పరుగులు చేసిన అతను.. కోహ్లీ (973) తర్వాత ఆ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. 2015 (562), 2017 (641), 2019 (692)లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా వార్నర్ ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. వార్నర్ కాకుండా సన్‌రైజర్స్ తరపున ఆరెంజ్ క్యాప్ అందుకున్నది ఒక్క విలియమ్సన్ (735) మాత్రమే. ఇక 2019 తర్వాత మరే సన్‌రైజర్స్ బ్యాటర్ కూడా ఈ ఘనత సాధించలేదు. తాజాగా బెంగళూరుపై 39 బంతుల్లోనే శతకం చేసిన హెడ్ ఇదే దూకుడు కొనసాగిస్తే ఆరెంజ్ క్యాప్ అందుకునే ఆస్కారముంది. అలాగే సన్‌రైజర్స్‌ను రెండో టైటిల్ దిశగా నడిపించే అవకాశముంది. ఈ సీజన్‌లో ముంబయితో మ్యాచ్‌లో అడుగుపెట్టిన హెడ్ 24 బంతుల్లోనే 62 పరుగులు చేశాడు. అప్పుడు జట్టు రికార్డు స్కోరు 277 చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ఆర్సీబీపై 41 బంతుల్లోనే 102 పరుగులు చేసి అత్యధిక స్కోరు రికార్డును 287 పరుగులతో సన్‌రైజర్స్ మరోసారి బద్దలు కొట్టడంలో ప్రధాన భూమిక పోషించాడు. సన్‌రైజర్స్ తరపున అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన హెడ్ ఇదే ధనాధన్ బ్యాటింగ్ కొనసాగించాలన్నది అభిమానుల ఆకాంక్ష.

## ఆర్‌సిబి ప్లే ఆఫ్స్ ఆశలు

ఈ ఏడాది ఐపిఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వైఫల్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సోమవారం సన్‌రైజర్స్ మ్యాచ్‌తో వరుసగా ఐదు పరాజయాలు మూటగట్టుకుంది. ఇప్పటివరకూ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లోనే నెగ్గి, ఆరు మ్యాచ్‌ల్లో ఆర్‌సిబి ఓడింది. కేవలం 2 పాయింట్లతో పట్టికలో ఆర్‌సిబి అట్టడుగు స్థానంలో కొనసాగుతోంది. దీంతో ఆర్‌సిబి ప్లేఆఫ్స్ అవకాశాల సంక్లిష్టం అయ్యాయి. అప్పుడే ఆర్‌సిబి ప్లే ఆఫ్ ఛాన్స్‌ల గురించి అభిమానులు లెక్కలు వేస్తున్నారు. మరి ఆర్‌సిబికి ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉన్నాయా? ఇంతకీ బెంగళూరు ఎలా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది? ఇప్పుడు చూద్దాం. ఈ టోర్నీలో ప్రతి జట్టు లీగ్ దశలో 14 మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి. అందులో టాప్ 4 జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అంటే ప్లే ఆఫ్స్‌కు వెళ్లాలంటే ప్రతి జట్టు కనీసం 8 మ్యాచ్‌లైనా నెగ్గాల్సి ఉంటుంది. ఇక ఈ టోర్నీలో ఆర్‌సిబికి ఇంకా 7 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ లెక్కన బెంగళూరు నెకట్స్ ఆడే అన్ని మ్యాచ్‌ల్లో నెగ్గాలి. అది ఎంత వరకు సాధ్యం అనేది అందరి మదిలే మెదిలే ప్రశ్న. ఆర్‌సిబి తదుపరి కోల్‌కతా, సన్‌రైజర్స్, గుజరాత్, గుజరాత్, పంజాబ్, ఢిల్లీ, చెన్నై జట్లతో తలపడాల్సి ఉంది. అయితే టోర్నీలో ఏడు మ్యాచ్‌ల్లో విజయం సాధించినా 14 పాయింట్లతో ప్లే ఆఫ్స్ చేరవచ్చు. కానీ, అప్పుడు రన్‌రేట్, ఇతర జట్ల గెలుపోటములపై ఆధారపడాల్సి ఉంటుంది.

## రీల్



## 'మనమే' టీజర్ పై కృతిశెట్టి ఇంట్రెస్టింగ్ పోస్ట్!

టాలీవుడ్ హీరో శర్వానంద్ వరుస చిత్రాలు చేస్తూ, కెరీర్ లో దూసుకుపోతున్నారు. డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ మనమే. ఈ చిత్రం అనౌన్స్ మెంట్ తోనే అందరిలో ఆసక్తి నెలకొంది. కృతి శెట్టి ఈ సినిమా లో హీరోయిన్ గా నటిస్తుంది. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వ ప్రసాద్ మరియు వివేక్ కూచిభోట్ల సంయుక్తం గా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కి సంబందించిన టీజర్ విడుదల పై తాజాగా హీరోయిన్ కృతి శెట్టి ఇంట్రెస్టింగ్ పోస్ట్ ను షేర్ చేశారు. మనమే టీజర్ ఇక్కడ ఉంది? డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య గారు, ఇంకా వెయిట్ చెయ్యడం మా వల్ల కాదు అంటూ చెప్పుకొచ్చారు. ఇందుకు నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రెస్పాండ్ అయ్యింది. ఇంత క్యూట్ గా అడుగుతున్నారు. ఇచ్చేయండి సార్, త్వరగా టీజర్ డేట్ ఇచ్చేయండి అంటూ చెప్పుకొచ్చారు. శర్వానంద్ కెరీర్ లో 35 వ సినిమా గా తెరకెక్కుతున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



## ప్రమోషన్స్ షురూ చేసిన 'ఆ ఒక్కటీ అడక్కు' టీమ్

అల్లరి నరేష్ హీరోగా ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా మల్లి అంకం దర్శకత్వంలో తెరకెక్కుతోన్న లేటెస్ట్ కామెడీ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ ఆ ఒక్కటీ అడక్కు. ఈ మూవీని రాజీవ్ చిలకా గ్రాండ్ గా నిర్మిస్తుండగా గోపి సుందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఒక సాంగ్, టీజర్ తో అందరిలో మంచి ఆసక్తిని ఏర్పరిచిన ఈ మూవీ మే 3న ఆడియన్స్ ముందుకి రానుంది. విషయం ఏమిటంటే, తాజాగా ఈమూవీ టీమ్ ప్రమోషన్స్ ని ఫుల్ స్వింగ్ లో షురూ చేసింది. అందులో భాగంగా హీరో అల్లరి నరేష్ పలు మీడియా ఛానెల్స్ కి ఇంటర్వ్యూస్ ఇస్తున్నారు. తమ టీమ్ మొత్తం ఎంతో కష్టపడ్డ ఈమూవీ మంచి విజయం అందుకుంటుందని, అలానే చాలా గ్యాప్ తరువాత తాను చేస్తున్న ఈ కామెడీ మూవీ తనకు మరింత మంచి పేరు తెస్తుందని నరేష్ అభిప్రాయపడుతున్నారు.

## పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మార్కెట్ మహాలక్ష్మి వివిస్ ముఖేష్



బి2పి స్టూడియోస్ బ్యానర్‌లో కేరింత మూవీ ఫేమ్ హీరో పార్వతీశం, నూతన పరిచయం హీరోయిన్ ప్రణీకాన్వికా జంటగా నటిస్తున్న చిత్రం మార్కెట్ మహాలక్ష్మి . డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ మూవీకి కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను వియస్ ముఖేష్ నిర్వహించారు. అఖిలేష్ కలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న థియేటర్ లో రిలీజ్ కానుంది. మూవీ యూనిట్ ప్రమోషన్స్ లో బిజీ ఉండగా, ఈ క్రమంలో దర్శకుడు వియస్ ముఖేష్ సినిమా గురించి ఆసక్తికర విషయాలను తెలిపారు. నా పేరు వివిస్ ముఖేష్, యూట్యూబ్ ప్లాట్ ఫామ్ లో దాదాపు 100 కి పైగా షార్ట్ ఫిలిమ్స్ చేశాను. అలా ఒక రోజు అఖిలేష్ గారిని కలవడం, మార్కెట్ మహాలక్ష్మి స్క్రిప్ట్ను నరేట్ చేయడం జరిగింది. మేము నిజాయితీగా, ఇప్పటి వరకు ఆడియన్స్ కి తెలియని ఒక కొత్త పాయింట్ను టచ్ చేసాము. ఆ మేజర్ పాయింట్ ని ప్రమోషన్ల కోసం ఉపయోగించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే టీజర్, ట్రైలర్లో చూపించలేదు. మార్కెట్ మహాలక్ష్మి పూర్తి లవ్ స్టోరీ, ఫ్యామిలీ ఎంటర్టైనర్. నిజ జీవితంలో నాకు తెలిసిన ఒక ఫ్రెండ్ కూరగాయలు అమ్మే అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. పార్వతీశం మరియు ప్రణీకా అన్విక ఇద్దరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. పార్వతీశంకి ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుందని భావిస్తున్నాను. మాకు చాలా OTT ఆఫర్లు వచ్చాయి, కానీ మా టీమ్ థియేట్రికల్ రిలీజుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఆడియన్స్ ఆదరిస్తారనే భావంతో రిస్క్ తీసుకున్నాం అంటూ చెప్పుకొచ్చారు.

## 'నా పేరు అరవింద్ కేజ్రీవాల్, నేను ఉగ్రవాదిని కాదు'

**న్యూఢిల్లీ :** దేశం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలకు ఓ కొడుకులా, సోదరుడిలా పనిచేసిన ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి ప్రజలకు సందేశం పంపారని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రసంగించిన సంజయ్‌సింగ్ 'నా పేరు అరవింద్ కేజ్రీవాల్, నేను ఉగ్రవాదిని కాదు' అని ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని వినిపించారు. కేజ్రీవాల్‌ను కలవడానికి పంజాబ్ సిఎం భగవంత్ మాన్ జైలుకు వెళ్తే వారిని గ్లాస్ గోడకు ఇరువైపులా ఉండి ఇంటర్‌కామ్ ద్వారా మాట్లాడుకునేలా చేశారని, దీన్ని బట్టి ఢిల్లీ సిఎంపై ప్రధానికి ఎంత ద్వేషముందే అర్ధమవుతోందని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్‌ను మానసికంగా కుంగదీసేందుకు, నిరుత్సాహపరిచేందుకు తీహార్‌లో 24 గంటలు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆప్ నేత ఆరోపించారు. 'అతడు అరవింద్ కేజ్రీవాల్. అతన్ని ఎంత అణగదొక్కాలని ప్రయత్నిస్తే అంత బలంగా తిరిగి వస్తాడు' అని అన్నారు. ఆదివారం సిఎం భగవంత్ మాన్ కేజ్రీవాల్‌ను చూసి భావోద్వేగానికి గురయ్యారని తెలిపారు. ఈ విధమైన చర్యలకు పాల్పడటం బిజెపికి, ప్రధాని మోడీకి సిగ్గుచేటని సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ గురించి ఆప్ ఎంపి మాట్లాడుతూ 'ఆదివారం ప్రధాని ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. షాకింగ్ విషయం ఏంటంటే అతిపెద్ద కుంభకోణమైన ఎలక్టోరల్ బాండ్ల జారీని ఆయన సమర్థించుకుంటున్నారు. సుప్రీంకోర్టు సైతం ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, చట్ట విరుద్ధమని తెలిపినా లెక్క చేయకుండా న్యాయస్థానాన్ని అవమానించారు. సుప్రీంకోర్టుకు, దేశ ప్రజలకు మోడీ క్షమాపణలు చెప్పాలి'' అని డిమాండ్ చేశారు.

## అర్ధరాత్రి విచారణ నిద్రించే హక్కు ఉల్లంఘనే

**ముంబై :** అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక సీనియర్ సిటిజన్‌ను ఈడీ ప్రశ్నించడాన్ని బాంబే హైకోర్టు తప్పుపట్టింది. నిద్రించే హక్కును ఉల్లంఘించలేమని, అది మనుషుల ప్రాథమిక అవసరమని అభిప్రాయపడింది. ఓ వ్యక్తి విచారణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యవహరించిన తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మనీలాండరింగ్ కేసులో భాగంగా గత ఏడాది ఆగస్టులో 64 ఏళ్ల రామ్ ఇస్రానీని దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. దానిని సవాలు చేస్తూ అతడు కోర్టును ఆశ్రయించారు. తాను విచారణకు సహకరించానని, పిలిచినప్పుడల్లా హాజరైనా సరే అరెస్టు చేశారని, అది చట్ట విరుద్ధమంటూ తన పిటిషన్‌లో ఆరోపించారు. గత ఆగస్టు ఏడున అధికారులు తనను రాత్రి అంతా విచారించి మర్నాడు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం... ఇస్రానీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అయితే అతడిని రాత్రి అంతా ప్రశ్నించడాన్ని మాత్రం తప్పుపట్టింది. నిందితుడి అంగీకారంతోనే తెల్లవారుజాము మూడు గంటల వరకు విచారించినట్లు ఈడీ తరపు న్యాయవాది వాదించడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ''ఏది ఏమైనా అర్ధరాత్రి తర్వాత వాంగ్మూలాన్ని రికార్డు చేసే పద్ధతిని మేం నిరాకరిస్తున్నాం. నిద్ర మనుషుల కనీస అవసరం. దానిని అందించలేకపోవడం హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది. అది ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పగటిపూట మాత్రమే వాంగ్మూలాలను రికార్డు చేయాలి. పిటిషనర్ సమ్మతించినప్పటికీ తర్వాత రోజో లేక మరో సారో ఆ వ్యక్తిని విచారణకు పిలిచి ఉండాల్సింది'' అని వ్యాఖ్యానించింది.

## సొరేన్ కేసులో మరో నిందితుడి అరెస్టు

**రాంచీ:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరొకరిని అరెస్ట్ చేసింది. భూ కుంభకోణానికి సంబంధించిన మరో మనీలాండరింగ్ కేసులో అఫ్సర్ అలీ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సంబంధిత వర్గాలు మంగళవారం తెలిపాయి. కోర్టు అనుమతితో ఈడీ అతనిని కస్టడీలోకి తీసుకుందని పేర్కొన్నాయి.

# రాజకీయపార్టీలపై రైతుల భ్రమలన్నీ పోయాయి

### ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి బహిరంగ మద్దతు ఇవ్వం పోరాటం కొనసాగిస్తాం : రాకేశ్ టికాయత్



**న్యూఢిల్లీ :** దేశంలో రాజకీయపార్టీలపై ఇన్నాళ్ళుగా రైతులకు ఉన్న భ్రమలన్నీ తొలగిపోయాయని ప్రముఖ రైతు నాయకుడు రాకేశ్ టికాయత్ అన్నారు. తమ సమస్యల కోసం ఇకమీదట రైతులు తమ పోరాటాన్ని కొనసాగిస్తారని ఆయన ప్రకటించారు. ''ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏ రాజకీయపార్టీకి రైతులు బహిరంగ మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న ఈ సమయంలో ఫలానా రాజకీయ పార్టీకి ఓటు వెయ్యి అని చివరకు నేను నా భార్యకు కూడా చెప్పను'' అన్నారు. ప్రజలు తమ అంతరాత్మప్రభోధం మేరకే ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమకు నచ్చిన అభ్యర్థులకు ఓట్లు వేస్తారని అన్నారు. ఏ పార్టీ మంచిదో ఏ అభ్యర్థి మంచివాడో రైతులకు ఇప్పటికే తెలిసిందని ఆయన వ్యాఖ్యానించారు. పిటిఐ వార్తాసంస్థతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ, ''ఈనాడు బిజెపి అంటే కేవలం ఒక రాజకీయపార్టీ మాత్రమే కాదు, దేశంలో రైతుల వ్యవసాయ భూములను ఆక్రమించుకున్న ధనికులైన పారిశ్రామికవేత్తలకు అగ్రభాగాన నిలిచి రక్షణ కల్పించేపార్టీగా మారింది'' అన్నారు. ఇక దేశంలో రైతులకు రాజకీయ పార్టీలపై ఇన్నాళ్ళుగా ఉన్న భ్రమలన్నీ తొలగిపోయాయి, కానీ వారికి కట్టకడపటిగా ఉన్న మిణుకు మిణుకు మని మెరిసే ఆశ మాత్రం ఇంకా చావలేదు అన్నారు. బిజెపి సహా కాంగ్రెస్, సమాజ్‌వాదీపార్టీ, బిఎస్‌పి, ఆర్‌ఎల్‌డి పార్టీలపట్ల రైతులకు,జాట్ వర్గానికి ఉన్న భ్రమలన్నీ తొలగిపోయాయా? అని పిటిఐ విలేకరి ప్రశ్నించినప్పుడు, ''మేం ఓట్లు వేసి వస్తాం, తిరిగి మా సమస్యల పరిష్కారానికి పోరాటంలో వచ్చి చేరతాం, నిరసనలు తెలియజేస్తాం'' అని టికాయత్ చెప్పారు. టికాయత్ 2020–21 లో మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతులు చేసిన మహా ఉద్యమంలో ఒక రైతు నాయకుడుగా కీలకపాత్ర పోషించారు. ''రైతులు తమ ఆత్మప్రభోధానికి అనుగుణంగా ఏ రాజకీయపార్టీకైనా, ఏ అభ్యర్థికైనా ఓటు వేసుకోవచ్చును, కానీ తర్వాత వారు కచ్చితంగా వచ్చి రైతుల సమస్యల పరిష్కారంకోసం ఉద్యమంలో పాల్గోవాలి'' అన్నారు. ''ఎన్నికల్లో ఓటింగ్ యంత్రంలో నోటా (ఎవరికీ ఓటు వేయను) బటన్‌ను మాత్రం నొక్కవద్దు, ఎందుకంటే రైతులకు చిట్టచివరిగా ఉన్న ఆశ కూడా చచ్చిపోయినప్పుడు మాత్రమే ఆ బటన్ నొక్కుతారు'' అని టికాయత్ అన్నారు. ''మరి ఐతే రైతులు ఏం చెయ్యాలి? రైతు వర్గానికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?'' అని ప్రశ్నించగా, ''అంతరాత్మ ప్రభోధానికి అనుగుణంగా ఓట్లు వేయమని మేం ప్రజలకు చెప్పాం'' అని టికాయత్ అన్నారు. ''ఓటు వేసేటప్పుడు సరైన నిర్ణయం తీసుకోవాలి, మిమ్మల్ని పట్టించుకునేదెవరో ఆలోచించాలి, ఆ తర్వాత మీరు తిరిగి ఆందోళన కార్యక్రమాల్లోకి రావాలి'' అన్నారు. ''నియోజకవర్గంలో కౌంటింగ్‌కు 24 గంటలు ముందుగా 100 ట్రాక్టర్లను, 1,000 మంది ప్రజలను ఎవరైతే అభ్యర్థి సమీకరించగలుగుతారో వారే విజయం సాధిస్తారనని మేం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు చెప్పాం, ఆ సంఖ్య స్థాయిలో గనుక సమీకరణలు చేయలేని అభ్యర్థి ఎన్నికల్లో ఓడిపోతాడని కూడా చెప్పాం'' అనని టికాయత్ అన్నారు. 2014 ఎన్నికలలో కొంత మంది అభ్యర్థుల వెనక ఉన్నాగానీ, తానుగానీ, తన సంఘం గానీ బిజెపికి మద్దతు ఇవ్వలేదన్నారు. ఆనాడు బిజెపి ప్రధాన ప్రతిపక్షంగా ఉందనీ, ఆ పార్టీ రైతులకు అనేక వాగ్దానాలు చేసిందనీ, ఆనాడు ఆ పార్టీ ఏదో కొంత చేస్తుందన్న ఆశ ఉండేదనీఈ అన్నారు. వారు తమ సమావేశాల్లో కూడా ఉండేవారన్నారు. రాజ్‌నాథ్ సింగ్, డా.మురళీ మనోహర్ జోషిలు తమ సమావేశాల్లో చాలాసార్లు పాల్గొన్నారని చెప్పారు. వారు తమ వేదికలను కూడా పంచుకున్నారన్నారు. ఓటింగ్ అనేది పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో కుల ప్రాతిపదికపైనా, మత ప్రాతిపదికపైనా, అభ్యర్థి ప్రాతిపదికపైనా ఉంటుందన్నారు. ఇవిఎంల అక్రమాలపై ప్రశ్నించగా, ఆ అవసరం ఏముందని అన్నారు. ఓడిపోయిన అభ్యర్థికి మూడు మార్గాలున్నాయనీ, మొదట వారు ఎన్నికల సంఘానికి వెళ్ళాలనీ, కానీ వెళ్ళరనీ, రెండోది కోర్టుకు వెళ్ళాలనీ, కానీ కోర్టుకు కూడా వెళ్ళరనీ, చివరిగా వారు నేరుగా బిజెపి కార్యాలయానికి వెళ్ళి ఆ పార్టీలో చేరాలనీ,ఎక్కువమంది ఈ చివరి మార్గాన్నే ఎంచుకుంటున్నారన్నారు. నాయకులను బిజెపిలో చేర్చుకునే ప్రచారం భారీగా జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇలా పార్టీల్లో చేరేవాళ్ళు మూడు రకాలుగా ఉన్నారనీ, మొదటి కేటగిరీ వాళ్ళు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కేటగిరీ..వాళ్ళు గౌరవం తప్ప ఏమీ కోరుకోరు, రెండో కేటగిరీ లంచ్ కేటగిరీ, వాళ్ళకి చాలా ఆశలు ఉంటాయి, వ్యాపారం నడుపుతారు, ఇక మూడో కేటగిరీ రాత్రివేళ బలవంతంగా వెళ్ళి పార్టీల్లో చేరతారు, చక్రవర్తి గనుక తనవైపు రావాలని ఎవరైనా కోరుకుంటే ఎవరికి వాళ్ళే చక్రవర్తి దగ్గరకు వెళ్ళాల్సిందే. అందువల్ల పార్టీలో చేరికలనేవి బాహాటంగా తలుపులు తెరచే ఉంటాయి, ఎవరైనా కోరుకుంటే ఈ మార్గాల్లో వెళ్ళి చేరిపోవచ్చు ఎక్కడైనా..'' అని టికాయత్ విమర్శించారు.

# ఎలక్టోరల్ బాండ్లు... మోడీ దోపిడీకి రూపం



**కోజీకోడ్ / వాయనాడ్ :** ఎలక్టోరల్ బాండ్ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విరుచుకుపడ్డారు. ఇది మోడీ దోపిడీకి రూపమన్నారు. వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకొని బెదిరింపు వ్యూహాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 'ప్రతి చిన్న పట్టణం లేదా గ్రామంలో కొంత మంది వ్యక్తులు భౌతికంగా హాని చేస్తూ, బెదిరించి వీధుల్లో డబ్బు వసూలు చేస్తారు. మలయాళంలో ఈ దోపిడీని 'కొల్ల అడిక్కల్' (దోపిడీ) అని పిలుస్తారు, కానీ మోడీ దీనిని ఎన్నికల బాండ్లు అంటారు. ఒక సాధారణ దొంగ వీధుల్లో ఏమి చేస్తున్నాడో అంతర్జాతీయ స్థాయిలో ప్రధాని కూడా అదే చేస్తున్నారు' అని రాహుల్ దుయ్యబట్టారు. రెండవ రోజు మంగళవారం కూడా కేరళలోని తన సొంత నియోజకవర్గమైన వాయనాడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్ష్యంగా చేసుకున్న వ్యాపారవేత్తలను బెదిరించేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అధునాతన వ్యూహాలను పన్నుతున్నదని ఆరోపిం+చారు. దేశంలోని కొంతమంది ధనిక వ్యాపారులకు మోడీ సాయం చేస్తున్నారన్నారు. 'ఎలక్టోరల్ బాండ్ స్థాయిలో బెదిరింపులు అత్యంత అధునాతనమైనవి. ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖకు చెందిన అధికారులు వస్తారు, విచారిస్తారు. చివరికి మీ వ్యాపారాన్ని అదానీకి ఎందుకు ఇవ్వకూడదని బెదిరింపి వెళ్తారు' అని రాహుల్ అన్నారు. ముంబయి విమానాశ్రయాన్ని వ్యాపారవేత్త అదానీ అదే పద్ధతిలో లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి 'బెదిరింపు వ్యూహాలు' బిజెపికి వ్యాపారవేత్తలు ఎలక్టోరల్ బాండ్లు చెల్లించడానికి కూడా దారితీశాయని కాంగ్రెస్ ఎంపి ఆరోపించారు. అదే విధంగా కోజికోడ్‌లోని కొడియత్తూర్‌లో కాంగ్రెస్ ఏర్పాటుచేసిన బహిరంగ ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ దేశంలోని కొంతమంది సంపన్న వ్యాపారవేత్తలకు ప్రధాని నరేంద్ర మోడీ ఓ సాధనంగా మారారని విమర్శించారు. వారి బ్యాంకు రుణాలు మాఫీ చేశారంటూ ఆరోపించారు. 'దేశంలోని అత్యంత సంపన్న పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోడీ సాధనంగా మారారు. వారి రుణాలను మాఫీ చేయించారు. ఇప్పటి వరకు 20–25 మందికి దాదాపు రూ.16 లక్షల కోట్లు ఇచ్చారు. భారత్‌లో రైతు సమస్యలపై ఆయన అసలు మాట్లాడరు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను ప్రస్తావించరు. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ముందు దేశంలో ఉన్న అతి పెద్ద సమస్య ఇది' అని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం లేదా ధరల పెరుగుదల గురించి మోడీ అసలు మాట్లాడడు అని అన్నారు. భారత సైన్యంలో చేరి దేశాన్ని రక్షించాలని కలలు కంటున్న వీర యువతకు అగ్నిపథ్ పథకం అవమానకరమని, కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే దానిని రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎంపి అన్నారు. కాగా, దక్షిణాదిలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం 11.30 గంటలకు కొడియాత్తూరు నుండి రాహుల్‌గాంధీ భారీ రోడ్ షో నిర్వహించారు. వందలాది మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు రాహుల్ వెంట నడిచారు.

## కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**న్యూఢిల్లీ :** మద్యం కేసుకు సంబంధించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత రెగ్యులర్ బెయిల్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. న్యాయమూర్తి కావేరీ భవేజా సెలవులో ఉండటంతో బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 22వ తేదీకి వాయిదా వేశారు. ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం పిటిషన్‌పై విచారణ జరుగనుంది. కాగా, రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌లో భాగంగా ఈ కేసులో తన పాత్రకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని కవిత పేర్కొన్నారు. తనపై అక్రమంగా కేసు పెట్టారని చెప్పారు. నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తనను మద్యం కేసులో ఇరికించారని కవిత ఆరోపించారు. తన పాత్రకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు, కవిత వాదనలను ఈడీ అధికారులు వ్యతిరేకించారు. కవిత లిక్కర్ కేసులో సూత్రధారి అని, ఆప్‌సౌత్ గ్రూపునకు కవిత మధ్యవర్తిగా వ్యవహరించారని పేర్కొన్నారు. మద్యం కుంభకోణంలో భాగంగా రూ.100 కోట్ల ముడుపుల వ్యవహారంలో కవితదే కీలక పాత్ర అని, ఇండో స్పిరిట్ ద్వారా తిరిగి ముడుపులు వసూలు చేశారని, ముడుపుల చేరవేతలో కవిత కీలకంగా ఉన్నారని ఈడీ వాదిస్తోంది. సాక్ష్యాలు దొరకకుండా కవిత తన ఫోన్‌లో డేటాను తొలగించారు. ఈడీ నోటీసులు ఇచ్చాక వాట్సాప్ డేటాను డిలీట్ చేశారు. డిజిటల్ ఆధారాలు లేకుండా ముందు జాగ్రత్త పడ్డారు. కవిత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి. ఆమెకు నోటీసు ఇచ్చిన వెంటనే అరుణ్ పిళ్లై తన వాంగ్మూలం ఉపసంహరించుకున్నారు. అరుణ్‌ను బెదిరించి వాంగ్మూలం ఉపసంహరించుకునేలా చేశారు. ఆమెకు బెయిల్ ఇస్తే సాక్షులకు ప్రభావితం చేయగలరు. సాక్ష్యాలు ధ్వంసం చేస్తారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో కవితకు బెయిల్ ఇవ్వకూడదని ఈడీ అధికారులు కోరుతున్నారు.

## 25 వరకు పోలీస్ కస్టడీ

**ముంబై :** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటనలో అరెస్టయిన ఇద్దరు నిందితులను ఈనెల 25 వరకూ పోలీస్ కస్టడీలోకి తీసుకోవాలని ముంబై కోర్టు మంగళవారం ఆదేశించింది. కాల్పుల ఘటన వెనుక కుట్ర వివరాలు, ప్రధాన సూత్రధారి ఎవరనేది తెలుసుకునేందుకు నిందితులను 14 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును క్రైం బ్రాంచ్ కోరింది. అయితే కోర్టు ఈ నెల 25 వరకూ అంటే తొమ్మిది రోజుల కస్టడీకి అనుమతించింది.